www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 సంచిక : 13 Vol No
విజయవాడ, ఆదివారం 13 జనవరి 2019
12 + స్నేహ + 12 పేజీలు వెల : 5.00

రాష్ట్రంలో ఓటర్లు 3.69 కోట్లు



2



రోహిత్ శతకం వృథా

ఆసీస్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా 34 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఆసీస్ నిర్దేశించిన 289 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేక్రమంలో ఆదిలోనే మూడు వికెట్లు కోల్పోయిన కోహ్లీసేన ఆ తర్వాత రోహిత్(133), ధోని(51) రాణించినా టీమిండియాకు విజయం దక్కలేదు. టీమిండియా నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 254 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ మ్యాచ్‌లో ధోనీ 10వేల పరుగుల మార్క్‌ను, రోహిత్ 22వ సెంచరీని, ఆస్ట్రేలియా 1000వ అంతర్జాతీయ విజయాన్ని నమోదు చేసుకున్నాయి.

12

పిడుగురాళ్లలో జనం పరుగులు

- స్వల్పంగా భూ ప్రకంపనలతో బెంబేలు
- రెండుగంటల వ్యవధిలో నాలుగుసార్లు



ప్రజాశక్తి-పిడుగురాళ్ల (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో స్వల్ప భూ ప్రకంపనలతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. పలు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుండి బయటకు పరుగులు తీశారు. రెండు గంటల వ్యవధిలోనే నాలుగు సార్లు ప్రకంపనలు రావడంతో ప్రజలు కలవరపాటుకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక మున్సిపల్ కమిషనర్ కాసు శివరామిరెడ్డి, సిఐ వీరేంద్రబాబు, తహశీల్దార్ కె.రవిబాబు, పోలీసులు లెనిన్‌నగర్, స్వర్ణ పిచ్చయ్య కాలనీలను సందర్శించి ప్రజలకు భయపడాల్సిందేమీ లేదని ధైర్యం చెప్పారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఒకసారి, 3.55 గంటలకు రెండోసారి, 4.29 గంటలకు మూడోసారి, 4.55 గంటలకు నాల్గోసారి స్వల్ప తీవ్రతతో భూమి కంపించిందని తెలిపారు. ప్రకంపనల కాల వ్యవధి మూడు నుంచి తొమ్మిది సెకన్ల పాటే ఉందన్నారు. అయితే కంపనల తీవ్రత పెరిగితే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికీ స్థానికులు ఇళ్లల్లో భయంభయంగానే గడుపుతున్నారు. క్వారీ పేలుళ్లే ఇందుకు కారణమని కొందరంటున్నా అధికారులు దీన్ని కొట్టిపారేస్తున్నారు.

బాబూ ధాన్యం కొనండి



- రైతులు లబోదిబో
- కొనుగోలుకు నోచుకోని ఏడు లక్షల టన్నులు
- కేంద్రానికి అభ్యర్థనలంటూ సర్కారు కాలక్షేపం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

తిత్లీ, పెథాయి తుపాన్ల ముంపుతో తడిసిన, రంగు మారిన, దెబ్బతిన్న వరి ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం మోపేస్తూ రైతులకు తీరని అన్యాయం చేస్తున్నాయి. రెండు తుపాన్ల వలన ఏడు జిల్లాల్లో సుమారు ఆరేడు లక్షల టన్నుల ధాన్యం తడిసిందని ప్రభుత్వ విభాగాలు ప్రాథమికంగా అంచనా వేశాయి. ఇలాంటి ధాన్యాన్ని మిగతా 9లో

రూ.800 గగనం

తిత్లీ తుపాను సమయంలో వరి కోతకొచ్చే దశలో ఉండగా, పెథాయి సమయంలో పనలు, కుప్పలు, నూర్చిన దశల్లో కల్లాల్లో ఉంది. దీంతో ధాన్యానికి బాగా నష్టం వాటిల్లింది. రెండు తుపాన్లకూ ఆరేడు లక్షల టన్నుల ధాన్యం తడిసిందని, రంగు మారిందని, కొన్ని చోట్ల మొలకలొచ్చాయని రైతులు లబోదిబోమంటున్నారు. కాగా ప్రభుత్వం తెరిచిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన, రంగు మారిన ధాన్యానికి ఎంఎస్‌పి చెల్లించట్లేదు. ఖరీఫ్ ధాన్యానికి కేంద్రం ప్రకటించిన ఎంఎస్‌పి సాధారణ రకం క్వింటాలుకు రూ.1,750 కాగా ఫైన్ క్వాలిటీ రూ.1,770. ప్రైవేటు వ్యాపారులు రూ.800కు కూడా కొనట్లేదు.



చెరో 38

- ఎస్‌పి, బిఎస్‌పి మధ్య సీట్ల సర్దుబాటు ఖరారు
- అఖిలేశ్, మాయావతి సంయుక్త ప్రకటన

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్రంలో పెద్ద పార్టీలుగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి), బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ (బిఎస్పీ) మధ్య పొత్తు కుదిరింది. 80 పార్లమెంటు స్థానాల్లో చెరో 38 స్థానాల్లో పోటీ చేద్దామని ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైంది. ఈ విషయాన్ని ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్, బిఎస్‌పి అధినేత్రి మాయావతి శనివారం నిర్వహించిన సంయుక్త విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. బిజెపిని ఓడించడమే మిగతా 9లో



విజయవాడలో కృష్ణానదిపై నిర్మించనున్న ఐకానిక్ వంతెన నమూనాను పరిశీలిస్తున్న చంద్రబాబు వార్త 2లో..

రాష్ట్రాల హక్కులపై జాతీయ స్థాయిలో చర్చ

- జగన్‌పై దాడి కేసు ఎన్‌ఐఎకు అప్పగింతపై ప్రధానికి లేఖ
- రిజర్వేషన్ల వ్యవహారంలో రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోవాలి
- రెండు చేతుల్లేని వికలాంగులకు రూ.10వేలు పింఛను: ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రాల హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, రాష్ట్రాల అధికారాల్ని కబళించే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. మీకున్న సార్వభౌమాధికారమే మాకు ఉంటుందని, ఎవరి హక్కులు వారికి ఉంటాయని కేంద్రాన్ని ఉద్దేశించి సిఎం వ్యాఖ్యానించారు. శనివారం సాయంత్రం ఉండవల్లి లోని సిఎం గ్రీవెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల మిగతా 9లో



ఏప్రిల్ 20 నుంచి ఎంసెట్

- మే 6న ఎడ్‌సెట్
- ఆన్‌లైన్‌లోనే పరీక్షలు
- 'ఏపి సెట్స్ నేస్తం' యాప్ ఆవిష్కరణ
- ఏడు ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసిన మంత్రి గంటా



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏప్రిల్ 20, 21, 22 తేదీల్లో ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష(ఎంసెట్) ఉంటుందని మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. ఎంసెట్‌తో సహా ఏడు ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను విజయవాడలోని ప్రైవేట్ హోటల్‌లో మంత్రి శనివారం విడుదల చేశారు. ఎంసెట్ అగ్రికల్చర్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24 ఉంటుందని చెప్పారు. అన్ని ప్రవేశ పరీక్షలనూ ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తామని ప్రకటించారు. ఎంసెట్‌ను రెండు పూటలా మిగతా 9లో

సెట్ల షెడ్యూల్

పరీక్ష	తేదీ	నిర్వహించే వర్సిటీ	కన్వీనర్
ఈసెట్	ఏప్రిల్ 19	జెఎన్‌టియు(అనంతపురం)	పిఆర్ భానుమూర్తి
ఎంసెట్	ఏప్రిల్ 20,21 22,24(అగ్రి)	జెఎన్‌టియు(కాకినాడ)	సిహెచ్‌ఎస్ సాయిబాబు
ఎపిఐసిఇటి	ఏప్రిల్ 26	ఎస్‌వియు తిరుపతి	శ్రీనివాసరెడ్డి
పిజిఇసెట్	మే 1	ఎయు	అవధాని
ఎడ్‌సెట్	మే 6	ఎస్‌వియు తిరుపతి	కుమారస్వామి
లాసెట్	మే 6	ఎస్‌కెయు అనంతపురం	జె విజయకుమార్
పిఇసెట్	మే 8 నుంచి15	నాగార్జున	పాల్‌కుమార్

పండగ రద్దీ



ఫొటో : ఎల్ నాగమల్లేశ్వరరావు

సంక్రాంతి పండగ నేపథ్యంలో వరుస సెలవులు రావడంతో హైదరాబాద్-విజయవాడ మధ్య కృష్ణా జిల్లా కీసర టోల్‌గేట్ వద్ద శనివారం సాయంత్రం వాహనాల రద్దీ

జగన్‌పై దాడి కేసు నిందితుడిని హైదరాబాద్‌కు తరలించిన ఎన్‌ఐఎ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతిపక్షనేత జగన్‌పై దాడి చేసిన నిందితుడు శ్రీనివాస్‌ను ఎన్‌ఐఎ అధికారులు శనివారం విజయవాడ సబ్ జైలు నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఇంతకు ముందు నిందితుడికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. తరలింపు సందర్భంగా సబ్ జైలు వద్ద స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నిందితుడు శ్రీనివాసరావును ఎక్కడికి తీసుకెళ్లారో సమాచారమివ్వాలని విజయవాడ సెషన్స్ కోర్టులో న్యాయవాది సలీం పిటీషన్ దాఖలు చేశారు. మెట్రోపాలిటన్ కోర్టు పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. నిందితుడి తరఫు న్యాయవాదికి సమాచారమివ్వాలని ఎన్‌ఐఎకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. న్యాయవాదుల సమక్షంలో విచారణ జరపాలని కోర్టు పునరుద్ఘాటించింది. వారం రోజులపాటు విచారించిన అనంతరం తిరిగి విజయవాడ జైలుకు రిమాండ్ ఖైదీగా నిందితుడు శ్రీనివాస్‌ను హాజరుపరచనున్నారు.





కేంద్ర ప్రభుత్వ విధానాలతో
ఆదివాసీలకు తీవ్రనష్టం

- త్రిపుర ఎంపి జితేంద్ర చౌదరి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాల వల్ల ఆదివాసీ, గిరిజన తెగలకు తీవ్రనష్టం వాటిల్లుతోందని ఆదివాసీ అధికార్ రాష్ట్రమంచ్ జాతీయ కన్వీనర్, త్రిపుర ఎంపీ జితేంద్ర చౌదరి విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయగూడెం మండల కేంద్రంలో నిర్మించిన ఆదివాసీ విజ్ఞానకేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. గిరిజన సంఘ కార్యాలయాన్ని ఎపి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, ఉచిత వైద్యశిబిరాన్ని సిఐటియు రాష్ట్ర నాయకులు మిగతా 9లో



సభలో మాట్లాడుతున్న జితేంద్రచౌదరి

అవినీతికి ఆధారాలు లేవు

'సివిసి' విచారణ పర్యవేక్షణాధికారి జస్టిస్ పట్నాయక్
అలోక్ వర్మ వ్యవహారంలో మరో మలుపు



జస్టిస్ పట్నాయక్ అలోక్ వర్మ

న్యూఢిల్లీ : పదవీచ్యుతుడైన సిబిఐ డైరెక్టర్ అలోక్‌వర్మ అవినీతికి పాల్పడ్డారనడానికి ఎటువంటి సాక్ష్యాధారాలు లేవని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎకె పట్నాయక్ తెలిపారు. అలోక్‌వర్మపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సివిసి) చేసిన విచారణకు పర్యవేక్షణాధికారిగా వ్యవహరించిన ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. 'వర్మ అవినీతికి పాల్పడినట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదు. సిబిఐ స్పెషల్ డైరెక్టర్ రాకేష్ ఆస్థానా చేసిన ఫిర్యాదుపై మొత్తం విచారణ ప్రక్రియ సాగింది. సివిసి చేసిన నిర్ధారణల్లో ఏ ఒక్కటీ నేను చేసింది కాదు. ఇదే విషయాన్ని నేను రాతపూర్వకంగా సుప్రీంకోర్టుకు తెలిపాను' అని ఆయన ఒక మీడియా సంస్థకు చెప్పారు. అలోక్‌వర్మ అవినీతికి పాల్పడ్డారని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని పేర్కొంటూ సివిసి మొత్తం ఎనిమిది అభియోగాలు ఆయనపై మోపిన విషయం తెలిసిందే. ఈ నివేదిక ఆధారంగా ప్రధానమంత్రి నేతృత్వంలోని హైపవర్ కమిటీ మెజార్టీ నిర్ణయంతో అలోక్‌వర్మను సిబిఐ డైరెక్టర్ బాధ్యతల నుండి తొలగించింది. అయితే, ఆ విచారణ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించిన, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సివిసి నిర్ధారణలతో విభేదించడంతో ఈ వ్యవహారం మరో కీలక మలుపు తిరిగింది. అలోక్‌వర్మ విషయంలో తుది నిర్ణయం మిగతా 9లో

వికలాంగుల పింఛను పెంపుపై ఎన్‌పిఆర్‌డి హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం వికలాంగుల పింఛను రెట్టింపు చేయడంపట్ల వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పెంచిన పింఛన్ మొత్తాన్ని వైకల్యశాతంతో ముడిపెట్టకుండా వికలాంగులందరికీ రూ.3వేలు పింఛను చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. వికలాంగులచట్టం-2106కు డ్రాఫ్ట్‌రూప్స్‌ను రూపొందించి అమలు చేసినప్పుడే వికలాంగుల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు.

సన్మానం



విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రఖ్యాతి సాహితీ వేత్త కొలకలూరి ఇనాక్‌ను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వేదికపై ప్రతిపాటి పుల్లారావు, నక్కా ఆనంద్‌బాబు, డొక్కా మాణిక్య వరప్రసాద్, వర్ల రామయ్య ప్రభృతులు

జాషువా కళా ప్రాంగణానికి సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ జాషువా కళాప్రాంగణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం శంకుస్థాపన చేశారు. జాషువా జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్మాణం కానున్న ప్రాంగణానికి చంద్రబాబు ఉండవల్లిలోని ప్రజావేదిక నుంచి రిమోట్ ద్వారా ప్రారంభించారు. ఈ కళాప్రాంగణం నిర్మాణంతో రాజధానిలో సాంస్కృతిక వైభవానికి నాందికానుందన్నారు. నిర్మాణానికి ఎంతైనా కేటాయిస్తామన్నారు. గుంటూరులోని మహిళా కళాశాలలో భూమి కేటాయించామని, త్వరితగతిన పనులు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సమాజాన్ని చైతన్యపరచడానికి స్మారకచిహ్నాం దోహదపడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇనాక్‌ను సన్మానించిన సిఎం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కొలకనూరు ఇనాక్‌ను సిఎం చంద్రబాబు నాయుడు సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులుగా ఇనాక్‌ను నియమిస్తూ పత్రాలు అందజేశారు. సాహిత్యంలో ఇనాక్ బలమైన ముద్ర వేశారని సిఎం కొనియాడారు.



పొడి వాతావరణం

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో

కర్నాటక నుంచి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ మీదుగా రాజస్థాన్ వరకు ద్రోణి కొనసాగు తోంది. శుక్రవారం మరట్వాడా, విదర్భ మీదుగా ఉండటంతో శనివారం రాష్ట్రంలో కాస్తా మబ్బులు, పొగమంచు వాతావరణం నెలకొంది. ద్రోణి శనివారం నాటికి మరింత పైకి ఎగబాకడంతో ఆదివారం రాష్ట్రంలో సాధారణ వాతావరణం నెలకొంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. పొగమంచు మూడు నాలుగు రోజులు కురుస్తుందంటు న్నారు. పట్టణాల్లో కంటే చెట్లు, కొండలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పొగమంచు ప్రభావం అధికంగా ఉంటుందన్నారు.

పెన్షన్ పెంపునకు ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని 70 ఏళ్లకు పైబడిన పెన్షన్‌దారులు, కుటుంబ పెన్షన్ తీసుకుంటున్న వారికి 10 శాతం పెంచుతూ ప్రభుత్వం జీఓ నెంబరు 6ను శనివారం జారీ చేసింది. పదవ పిఆర్‌సి 15 శాతం పెంచాలని సూచించినప్పటికీ పాత పెన్షన్ దారులు, పదవ పిఆర్‌సి వచ్చిన తరువాత పదవీ విరమణ పొందిన వారికి మధ్య వ్యత్యాసాన్ని తగ్గించేందుకు పెన్షన్‌ను ప్రభుత్వం పెంచింది. బేసిక్ పెన్షన్‌లో 70 నుంచి 75 ఏళ్లవారికి 10శాతం, 75 నుంచి 80 ఏళ్ల మధ్య వారికి 15శాతం, 80 నుంచి 85 ఏళ్ల వారికి 20శాతం, 85 నుంచి 90 ఏళ్ల వారికి 25శాతం, 90 నుంచి 95 ఏళ్ల వారికి 30శాతం, 95 నుంచి 100 ఏళ్ల వయస్సు ఉన్న వారికి 35శాతం, వందేళ్ల పైబడిన వారికి బేసిక్ పెన్షన్‌పై 50శాతం అదనంగా ప్రభుత్వం పెంచింది.

తెలంగాణా కంటే ముందున్నాం

- పవిత్ర సంగమం వద్ద ఐకానిక్ వంతెనకు శంకుస్థాపన
- రాజధానికి 24 గంటలు నీరందించే నీటిశుద్ధి ప్లాంటు
- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణ రాష్ట్రంతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ముందంజలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తెలంగాణలో 42శాతం జనాభాకు 54శాతం అభివృద్ధి ఉంటే, ఎపిలో 58 శాతం జనాభాకు 45శాతం అభివృద్ధి నమోదైందని తెలిపారు. అమరావతి అభివృద్ధిని అడ్డుకునేవారికి బుద్ధివచ్చేలా రాజధానిని నిర్మించి చూపిస్తానని చంద్రబాబు ధీమావ్యక్తం చేశారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అమరావతి అభి వృద్ధి ఆగదని విశ్వాసం వ్యక్తం చేశారు. కూచిపూడి కేబుల్‌స్టేయిడ్ బ్రిడ్జ్ అమరావతికి, అమరావతి నీటిశుద్ధి కేంద్రానికి ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం వద్ద శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద పైలాన్(170మీటర్లు)తో కేబుళ్ల ఆధారంగా రూ.1387 కోట్ల వ్యయంతో ఐకానిక్ వంతెన నిర్మిస్తున్నామని చెప్పారు. వంతెన పొడవు 3.2కిలోమీటర్లు ఉండబోతుందన్నారు. వంతెనను ఎల్‌అండ్‌టి, అమరావతి అభివృద్ధి సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయని తెలిపారు. రెండు సంవత్సరాల్లో వంతెన నిర్మాణం పూర్తవుతుందనీ,ఈ వంతెన నిర్మించడం వల్ల కృష్ణా, గుంటూరు జిల్లాల అనుసంధానమే కాకుండా రెండు రాష్ట్రాలు, ఎపి లోని ఆరు జిల్లాలకు రాజధాని అందుబాటులో ఉంటుందన్నారు. వంతెన నిర్మాణంతో రాజధాని



ఐకానిక్ వంతెన శంకుస్థాపన కార్యక్రమంలో చంద్రబాబు, మంత్రులు దేవినేని, నారాయణ, ప్రభృతులు

చేరుకోవడంలో 2గంటల సమయాన్ని ఆదా చేయడంతోపాటు, విజయవాడలో ట్రాఫిక్‌ను తగ్గించవచ్చని చెప్పారు. అమరావతికి 24 గంటలు మంచినీటిని అందిచే ఉద్దేశంతో నీటిశుద్ధికేంద్రాన్ని రూ.740.65 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. కృష్ణా నదికి ఒక పక్క శరవేగంగా అభివృద్ధి జరుగు తోందనీ, రెండో పక్క అభివృద్ధి చేయడానికి తాను సిద్ధంగా ఉన్నాననీ, రైతులు సహకరిస్తే ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను చేపడతామని ఇబ్రహీంపట్నం రైతులను అడిగారు. కృష్ణాజిల్లాను ఆక్వాకల్చర్ హబ్‌గా తీర్చి దిద్దామనీ, రాష్ట్రంలోనే అత్యధిక తలసరి ఆదాయం వచ్చే జిల్లాగా కృష్ణాజిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. త్వరలోనే మచిలీపట్నం పోర్టు నిర్మాణనికి కూడా శంకుస్థాపన చేస్తాననీ, నవయుగ కంపెనీ నిర్మాణాన్ని చేపట్టనుందనీ స్పష్టంచేశారు. సహజసిద్ధంగా పండించే పండ్లు, కూరగాయలను తినడం వల్ల ఆరోగ్యం పెరుగు తుందనీ, ప్రకృతి సేద్యానికి మరికొంతమంది రైతులు ముందుకు రావాలని సిఎం పిలుపునిచ్చారు. రాజ ధానిలో ఒక్కఇటుక కూడా పెట్టలేదని విమర్శించే వారు ఒక్కసారి అమరావతికి వచ్చి చూడాలని మంత్రి నారాయణ కోరారు. ఐకానిక్ వంతెన అమరాతి రాజధానికి తలమానికంగా నిలవనుందని మంత్రి ఉమామహేశ్వరరావు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సుమోటో మెమోను వెనక్కి తీసుకోండి

చుక్కల భూములపై సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చుక్కల భూములు, నిషేదిత భూముల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4న సుమోటోగా జారీ చేసిన 57443 నంబర్ మెమోను తక్షణం వెనక్కి తీసుకోవాలని సిపిఎం రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. ఈ మెమోలోని కొన్ని నిబంధనలు అక్రమాలకు అవకాశం కల్పించేలా ఉన్నాయని, వెంటనే ఆ మెమోను వెనక్కి తీసుకుని, వాస్తవ సాగుదారులకు ఉపయోగపడేలా సవరించాలని ఆ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి. మధు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పెత్తందార్లు, అధికారులతో కుమ్మక్కై పేదల సాగులో ఉన్న భూముల్ని, ప్రభుత్వ భూముల్ని కాజేసేందుకు మెమో అవకాశం కల్పిస్తోందని పేర్కొన్నారు. మెమోలో చుక్కల భూములు, నిషేదిత భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి ఏయే అర్హతలుంటే జాబితా నుంచి తొలగించవచ్చో నాలుగు నిబంధనలను పేర్కొన్నారని, భూమి రికార్డు 1(బి)లోని ఎనిమిదో కాలమ్ లో ఆ భూమి ఎలా సంక్రమించిందనే వివరాలు నమోదు కాకపోయినప్ప టికీ వాటిని ప్రయివేటు భూములుగా పరిగణించి నిషేదిత భూముల జాబితాలో తొలగించాలని పేర్కొనడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీని ద్వారా విలువైన భూములను అధికార పార్టీ అనుయాయులకు, సంపన్నులకు కట్టబెట్టేం దుకు సర్కారు యత్నిస్తోందని స్పష్టమవుతోందన్నారు. 1954 తరువాత డికెటి పట్టాలు పొందిన భూములను, అసైన్డ్ భూములను నిషేదిత జాబితాలోనే కొనసాగు తాయని, తాజా మెమోతో ఒరిగేదేమీ లేదని తెలిపారు. ఎక్కడైనా ఏవైనా వివరాలు రికార్డుల్లో ఉంటే వాటి ఆధారంగా నిర్ధారణకు రావడం, నిర్ణయాలు చేయాలని, ఏ వివరాలూ లేకపోతే ప్రయివేటు భూమిగా ఎలా పరిగణిస్తా రని ప్రశ్నించారు. 4(ఎ) నిబంధనలో 1954 ముందు డికెజి పట్టాలు, అసైన్‌మెంట్ పొందినట్లు ఎనిమిదో కాలమ్‌లో ఉంటే ఆయా భూములను నిషేదిత జాబితా నుంచి తొలగించాలని సూచించారని, 4(డి) నిబంధనలో 1954 తరువాత డికెటి పట్టాలు పొందిన భూములను నిషేదిత జాబితాలోనే కొనసాగించాలని పేర్కొన్నారని తెలిపారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను ఈ నెల 24 లోపు పరిష్కరించాలనడం ఆచరణలో ఏ మాత్రమూ సాధ్యంకాదన్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, గ్రామ సభలు నిర్వహించిన ఆయా భూములను వాస్తవంగా సాగు చేసుకుంటున్న వారికి హక్కులు దక్కేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ భూ ముల వివరాలను మీడియా ద్వారా, బహిరంగ ప్రదేశాల్లో పెట్టి ప్రజలకు తెలియజేసి రికార్డులు పారదర్శకంగా ఉండేలా చూడాలని సిపిఎం డిమాండ్ చేసింది.

అస్మదీయుల కోసమే : రైతుసంఘం

అధికార పార్టీ అనుయాయులు, పెత్తందారులకు చుక్కల భూములను కట్టబెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో ఉపయోగపడుతుందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం విమర్శించింది. ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వై. కేశవరావు, అధ్యక్షుడు పి. పెద్దిరెడ్డి విడుదల చేసిన ప్రకటనలో పేదలకు లబ్ధి చేకూర్చేలా ఈ మెమోను తక్షణం సవరించాలని డిమాండ్ చేశారు. . 1954 అనంతరం డి-ఫారం పట్టాలు, ఎస్సైనుమెంటు పట్టాలు పొందిన పేదలు, దీర్ఘకాలం నుంచి సాగు చేసుకుంటున్న పేదలు శాశ్వతంగా నిషేధిత భూముల్లోనే ఉండిపోతారని, పేదలకిచ్చిన ఈ పట్టాలను క్రమబద్ధీకరించాలని కోరారు.

రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 3.69 కోట్లు

తుది జాబితాను విడుదల చేసిన ఇసి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఓటర్ల తుది జాబితా ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ శనివారం వెల్లడించింది. పదమూడు జిల్లాల్లో మొత్తం 3,69,33,091 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొంది. వారిలో పురుషులు 1,83,24,588 మంది, మహిళా ఓటర్లు 1,86,04,742 మంది, థర్డ్ జండర్లు 3,761 వేల మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. తూర్పు గోదావరి జిల్లాలో అత్యధికంగా 40,13,770 మంది, అత్యల్పంగా విజయగనగరం జిల్లాలో 17,33,667 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

జిల్లాల వారీగా ఓటర్ల వివరాలు

జిల్లా పేరు	ఓటర్ల సంఖ్య
శ్రీకాకుళం	20,64,330
విజయనగరం	17,33,667
విశాఖపట్నం	32,80,028
తూర్పుగోదావరి	40,13,770
పశ్చిమ గోదావరి	30,57,922
కృష్ణా	33,03,592
గుంటూరు	37,46,072
ప్రకాశం	24,95,383
నెల్లూరు	22,06,652
కడప	20,56,660
కర్నూలు	28,90,884
అనంతపురం	30,58,909
చిత్తూరు	30,25,222

18 తరువాత భవిష్యత్ కార్యాచరణ

ఆర్టీసి ఇయు వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి ఉద్యోగుల వేతన సవరణ, కార్మికుల సమస్యలపై చేపట్టనున్న సమ్మెపై ఈ నెల 18 తరువాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వైవి రావు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 18న నిర్వహించే వేతన సవరణ కమిటీ సమావేశంలో యజమాన్యం వైఖరిని బట్టి అన్నిసంఘాలతో చర్చించి భవిష్యత్ కార్యచరణ తెలియజేస్తామని పేర్కొన్నారు. గుర్తింపు సంఘంగా ఇచ్చిన సమ్మె నోటీసుపై ఈనెల 7 నుంచి 11 వరకు అన్ని జిల్లాలలోనూ సన్నాహక సమావేశాలు నిర్వహించామని, శనివారం రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె సన్నాహక దినాన్ని పాటించామని తెలిపారు. ఈ సమావేశంలో వేతనాల సవరణ ప్రతిపాదనలు ఇచ్చాక చర్చల ద్వారా అంగీకరించిన అంశాలపై చర్చించామన్నారు. ఆర్టీసి పరిరక్షణ, వేతన సవరణ కోసం రాష్ట్ర కమిటీ ఏ క్షణంలో పిలుపునిచ్చినా అందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

చంద్రబాబుకు భయం పట్టుకుంది : బొత్స

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై జరిగిన హత్యా యత్నం కేసు విచారణను ఎన్‌ఐ ఎకు అప్పగించ డంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భయంతో కేంద్రానికి లేఖ రాశారని వైసిపి సీనియర్ నేత బొత్స సత్య నారాయణ అన్నారు. చంద్రబాబు జీవితమంతా హత్యా రాజకీయాలేనని, అందుకే కేసును ఎన్‌ఐఎకు బదిలీ చేయ డాన్ని ఆయన వ్యతిరేకిస్తున్నారని అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఎన్‌ఐఎ విచారణ చేయాలని కోర్టే తీర్పు చెప్పిందని, ఏపీ పోలీసుల నివేదికలో కూడా హత్యాయత్నం జరిగిందని స్పష్టంగా పేర్కొన్నారని చెప్పారు. ప్రతిపక్ష నేతపై హత్యాయత్నం జరిగితే, ఏపీ ప్రభుత్వానికి అభ్యంతరాలు ఉన్నాయంటూ ప్రధానికి లేఖ రాయడంలో ఆంతర్య మేంటని ప్రశ్నించారు. హత్యాయత్నం ఘటనలో చంద్రబాబు, లోకేష్, వెంకటేశ్వ రరావు హస్తం ఉంది కాబట్టే ఎన్‌ఐఎ విచారణ అంటే భయపడుతున్నారన్నారు. చంద్రబాబు చర్యల వల్ల దేశ స్థాయిలో రాష్ట్ర పరువు పోవడమే కాకుండా రాష్ట్రంలో శాంతి భద్రతలు, ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతున్నాయన్నారు.

బాబు గ్యాంగ్‌లో వణుకు

ప్రతిపక్షనేత జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రజాసంకల్ప యాత్రకు వచ్చిన ప్రజాదరణతో చంద్రబాబు గ్యాంగ్‌లో వణుకు పుడుతోందని వైసిపి అధికార ప్రతినిధులు టిజెఆర్ సుధాకర్‌బాబు, కె పార్థసారథి అన్నారు. విజయవాడలోని వైసిపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో వారు మాట్లాడుతూ ఒక వైపు దళితులు, పేదల మీద అధికార పార్టీ నేతలు దాడులు చేస్తుంటే ఇంకోవైపు పేదలకు, సామాన్యులకు తన పాదయాత్ర ద్వారా జగన్ భరోసా ఇచ్చారన్నారు. చంద్రబాబు మానసికంగా ఓటమికి సిద్ధమయ్యారని, అందుకే జగన్ ప్రకటించిన నవరత్నాల్లోని పథకాలను కాపీ కొడుతున్నారని ఆరోపించారు.

ప్రజ్ఞ

1. ఏ పన్ను నుండి కేంద్రం చిన్న వ్యాపారులకు మినహాయించింది?
2. బాక్సింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది?
3. డఫ్ అండ్ ఫెల్ఫ్స్ సంస్థ నివేదిక ప్రకారం మోస్ట్ వాల్యుబుల్ సెలబ్రిటీ ఎవరు?
4. 25వ సార్టనర్ షిప్ సమ్మిట్ ఎక్కడ జరిగింది?
5. క్యుబా దేశ అధ్యక్షుడిగా రెండోసారి ఎవరు ఎన్నికయ్యారు?

సమాధానాలు 7లో

వివేకానందుని యువత ఆదర్శంగా తీసుకోవాలి

డిఎస్‌ఎంఎం జాతీయ కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వామి వివేకానందను నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని దళిత్ సోషణ్‌ముక్తి మంచ్ (డిఎస్‌ఎంఎం)జాతీయ కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ-డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 156వ జయంతి కార్యక్రమం వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో శనివారం జరిగింది. వివేకానంద హిందుత్వవాది కాదని, సంఘ సంస్కర్త అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు జి రామన్న, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె రమేష్, అశోక్, గర్ల్స్ కన్వీనర్ చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలోకి ముద్రగడ?

పిఠాపురం సీటుపై కన్ను

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి



కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వచ్చే ఎన్నికల్లో వైసిపిలో చేరి ఆ పార్టీ తరఫున తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశమున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. 2009లో కాంగ్రెస్ తరపున బరిలోకి దిగి పరాజయం పాలైన పిఠాపురం నియోజకవర్గం నుంచే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని దాదాపు నిర్ణయానికి వచ్చిన ముద్రగడ సన్నిహితులతో మంతనాలు జరుపుతున్నట్టు సమా చారం. సన్నిహితుల సమాచారం ప్రకారం ఈనెల 31న రాజకీయ కార్యాచరణపై ముద్రగడ నిర్వహిం చబోతున్న సమావేశంలో ఈమేరకు ఓ నిర్ణయం తీసుకునే అవకాశముంది. వచ్చేనెల మొదటి వారం లో ఆయన రాజకీయ భవితవ్యానికి సంబంధించిన నిర్ణయాన్ని ప్రకటించడానికి సిద్ధపడుతున్నారు. 2009 ఎన్నికల్లో ఇక్కడ్నుంచే పోటీ చేసిన ముద్రగడ స్వల్ప ఓట్ల తేడాతో మూడోస్థానంలో నిలిచారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ వంటి వారు ఆయనతో మంతనాలు జరుపుతూ పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు సమాచారం.

ప్రత్యేకం

టిడిపిలో సీట్ల పోరు

శ్రేణుల్లో పెరుగుతున్న ఉత్కంఠ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీలో సీట్ల కుస్తీ ప్రారంభమైంది. పలువురు సిట్టింగ్ ఎంఎల్ఏలపై అసంతృప్తి ఉందన్న ఆ పార్టీ అంతర్గత సర్వేల్లో ఇప్పటికే తేలడం, సంక్రాంతి పండుగ తర్వాత అభ్యర్థుల మొదటి జాబితా ప్రకటిస్తారనే ప్రచారం నేపథ్యంలో టిక్కెట్లు ఎవరికి దక్కుతాయో అన్న ఉత్కంఠ టిడిపి శ్రేణుల్లో నెలకొంది. మరోవైపు సిట్టింగ్ ఎంఎల్ఏలతో పాటు, పలువురు అశావాహులు కూడా తవ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కడప జిల్లా జమ్మలమడుగు స్థానాన్ని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మంత్రి ఆదినారాయణరెడ్డి ఇద్దరూ

కోరుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రామసుబ్బారెడ్డికి ఎమ్మెల్యే సీటు, ఆదినారాయణరెడ్డికి కడప ఎంపి సీటు ఇస్తామని చంద్రబాబు సూచించినట్లు సమాచారం. రామసుబ్బారెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే శాసనమండలికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ సీటును తన కు టుంబసభ్యులకే కేటాయించాలని, అధికారంలోకొస్తే మంత్రి పదవి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేస్తుండటంతో ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నారు. కృష్ణా జిల్లా పెడనలో బూర్లగడ్డ వేదవ్యాస్, సిట్టింగ్ ఎమ్మెల్యే కాగితపు వెంకట్రావు కుమారుడు టికెట్ ఆశిస్తున్నారు. పామర్రులో సిట్టింగ్ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన, ఆర్టీసి ఛైర్మన్ వర్ల రామయ్యతో పాటు మాజీ ఎమ్మెల్యే డివై దాస్, గుడివాడ నుంచి వై.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, పిన్నమనేని బాబ్జి, నూజివీడు నుంచి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, బచ్చుల అర్జునుడు, దేవినేని అవినాష్ టికెట్ ఆశిస్తున్న వారిలో ఉన్నారు. ప్రకాశం జిల్లా అద్దంకి టికెట్ కోసం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్సీ కరణం బలరాం తనయుడు వెంకటేశ్‌లు పోటీపడుతున్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నుంచి ఎమ్మెల్యే బొల్లినేని రామారావుతో పాటు ఓ ప్రొటోకాల్ అధికారి కూడా టికెట్‌ను ఆశిస్తున్నారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నుంచి రావెళ్ల కిషోర్‌బాబు జనసేనలోకి వెళ్లడంతో ఆ సీటును ఓ ఐఎఎస్ అధికారి పోటీ చేసేందుకు లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం. అనకాపల్లి మాజీ ఎంపి సబ్బంహరి టిడిపిలో చేరేందుకు మార్గం సుగమమయ్యింది. త్వరలో ఈయన టిడిపిలో చేరనున్నారు. టికెట్ ఎవరికి కేటాయించినా, టికెట్ దక్కని నేతలు పార్టీ మారకుండా కలిసి పనిచేసే విధంగా చూడాలని టిడిపి అధిష్టానం భావిస్తోంది. అయితే, రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ వ్యూహం ఎంతవరకు అమలవుతుందన్న దానిపై టిడిపి వర్గాల్లోనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సంక్షిప్తం

ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి : సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ వర్ధంతిని ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులను ఆదేశించారు. శనివారం గ్రామ, జిల్లా,రాష్ట్ర పార్టీ నేతలతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో రక్తదాన శిబిరాల్ని నిర్వహించాలన్నారు. ఈ ఏడాది ఎన్టీఆర్ బయోపిక్ రావడం ఒక మైల్ స్టోన్ అని అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని చారిత్రాత్మకంగా నిర్వహించాలని నేతలకు సూచించారు. వైయస్ హయాంలో పింఛన్ నెలకు రూ.200 ఉండగా, తాము అధికారంలోకొచ్చాక ఐదు రెట్లు పెంచామన్నారు. 16 వేల గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారీ రికార్డు సాధించామని, 15 శాతం వృద్ధి రేటు లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ కార్యకర్తలు, నేతలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. కేంద్రం తోడ్పాటు లేకున్నా అభివృద్ధిలో ముందుకు సాగుతున్నామని నేతలకు తెలిపారు.

'రాజ్యాంగ ఔన్నత్యం'పై పోటీలు నిర్వహించాలి : బిటిఎ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగ ఔన్నత్యంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షులు శరత్ చంద్ర శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 26న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలను నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ ఆదేశాల్లో రాజ్యాంగంపై గానీ, రాజ్యంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రపై కానీ విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొనక పోవడం శోచనీయమని పేర్కొన్నారు. విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వుల్ని వెంటనే సవరించాలని కోరారు.

పండగనాడూ అంగన్‌వాడీలకు పస్తులే

ఏపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత మూడు నెలలుగా అంగన్‌వాడీలకు వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం వారిని పండుగనాడు కూడా పస్తులుంచుతోందని ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బరావమ్మ శనివారం ప్రకటనలో తెలిపారు. వేతనాల చెల్లింపుపై గత నెల రోజుల నుంచి అధికారులకు సమస్య చెబుతున్నా సిఎఫ్ఎమ్ఎస్‌లో సమస్యలున్నాయంటూ జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. జన్మభూమి కార్యక్రమాలకు అంగన్‌వాడీలతో అదనపు పని చేయించుకుని కూడా వారికి వేతనాలు చెల్లించలేదని తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వ్యాపారాలు మందకొడి


గుంటూరు జిల్లా వినుకొండలో వెలవెలబోతున్న ఓ దుకాణం

నిత్యావసరాల ధరలకు రెక్కలు - తగ్గిన కొనుగోలు శక్తి
పరిమితంగా పిండి వంటలు - కానరాని సంక్రాంతి సందడి
కొత్త బట్టల కోసం ఇంటికి రూ.10-15 వేలు ఖర్చు

ప్రజాశక్తి- యంత్రాంగం

రంగవల్లులతో కళకళలాడుతూ కనిపించే సంక్రాంతి క్రమేపీ ఆ శోభను కోల్పోతోంది. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి ప్రభావంతో ప్రజల్లో కొనుగోలు శక్తి క్షీణించింది. ఫలితంగా ఒకప్పుడు సంక్రాంతి కోసం ఎదురుచూసే వారంతా నేడు పండుగ పేరు చెబితేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇళ్లకు సున్నాలు, రంగులు వేయడం, ఇళ్ల ముంగిట రంగవల్లులతో అలంకరించడం, ఇంట్లోని వారికి నూతన వస్త్రాలను కొనుగోలు చేయడం ప్రతి ఏడాది పరిపాటి. సంక్రాంతి పండుగ అంటే ప్రతి ఇంట్లోనూ అరిసెలు, సున్నుండలు, జంతికలు వంటి పిండివంటకాలు చేస్తారు. అయితే ఈ ఏడాది దాదాపు 70 శాతం మంది ఈ పిండివంటకాలకు దూరంగా ఉన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో పాలకుల పుణ్యమా అని పప్పులు, ఉప్పులు, కూరగాయల ధరలు పెరుగుతూనే ఉన్నాయి.మరో పక్క పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల కూడా తమ జీవన విధానం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడలో కిలో కందిపప్పు రూ.100, బియ్యం కిలో రూ.50కు, నూనె రూ.90కు చేరుకుంది. కిలో బెల్లం రూ.30 నుంచి 42 కు, మైదా రూ.25 నుంచి 30కు, శనగ 55 నుంచి 65 కు, పామాయిల్ 60 నుంచి 70లకు పెరిగాయి. అయితే గతంలో మాదిరిగా నెల రోజులకు సరిపడా పండివంటలు చేసుకునే పరిస్థితి ఇప్పుడు లేదు. అరిసెలు, ఇతర పిండి వంటలు తయారీకి ఎక్కువ సమయం కేటాయించలేక పోతున్నారు. కొంత మంది స్థానికంగా ఉన్న వ్యాపారుల వద్ద వీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. మరికొంత మంది తక్కువ మోతాదులోనే అరిసెలు, ఇతర పిండి వంటలు తయారు చేసుకుంటున్నారు. గతంలో నేతి అరిసెల తయారీకి ప్రాధాన్యత ఇచ్చే వారు. పండగకు కనీసం వారం రోజుల ముందు నుంచే గ్రామాల్లో పిండివంట ఘుమఘుమలతో వాసనలు గుప్పుమనేది. ఇప్పుడు కమ్మని వాసనలు కనుమరుగవుతున్నాయి. సమయాభావం, మారిన జీవన పరిస్థితుల మధ్య పండుగ రోజు మాత్రం దగ్గర్లో ఉన్న మిఠాయి దుకాణం వద్దకు వెళ్లి తమకు కావాల్సిన కొన్ని రకాల పిండివంటలను మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. గతంలో వస్త్రాలను కొనుగోలు చేసి వాటిని దర్జీలకు ఇచ్చి కుట్టించేవారు. ఒక జతకు గ్రామం, పట్టణాన్ని బట్టి రూ.350 నుండి రూ.500ల వరకూ తీసుకుంటున్నారు. అయితే ప్రజలు రెడీమేడ్ వస్త్రాల వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ వస్త్రాల కోసం గతంలో కుటుంబానికి రూ.5 వేల వరకూ అయ్యేది. కానీ నేడు రూ.10 నుండి 15 వేల వరకూ అవుతున్నాయి. ప్రకాశం జిల్లా జె పంగులూరుకు చెందిన జాగర్లమూడి సుబ్బారావు మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు, బంధువులకు ప్రతి ఏడాదీ 15 రోజుల ముందే బట్టలు తీసుకునేవారమనీ, అయితే ఈ ఏడాది డబ్బు లేకపోవడంతో ఇంత వరకు బట్టలు కూడా తీసుకోలేదనీ తెలిపారు.

నాటి సందడి లేదు



గతంలో ఆటలు,పాటలు, ఎడ్ల పరుగు పందేలు ఉండేవి. ఇప్పుడు వీధుల్లో భోగి మంటలు కూడా కరువయ్యాయి. సెలవులు వస్తే పదుల సంఖ్యలో పిల్లలు ఒక చోట చేరి ఆటలు ఆడుకునే వారు. ఇళ్ల వద్ద పిండి వంటలు కూడా లేవు.

సికోటి నవీన్, స్థానికుడు (శ్రీకాకుళం)



ప్రతి పండగకి రోజుకు ఆరేడు వేలు యాపారం జరిగేది. ఇప్పుడు రోజుకు 500 కూడా జరగడం లేదు. నూతన కాలువలో మా ఒక్క బట్టల అంగడే ఉంది. 47 పల్లెలు ఇక్కడికి వచ్చే ఎక్కువ మంది బట్టలు కొంటారు. కరువు వల్ల ఎవరూ రావడం లేదు. యాపారమే లేదు.

బాలక్రిష్ణ, బట్టల వ్యాపారి, చిత్తూరు

వ్యాపారమే లేదు

దర్జీ పని చేసుకునే వారు క్రిస్మస్, సంక్రాంతి పండగలను మంచి ఆదాయం వచ్చే సీజన్‌గా భావిస్తారు. ఏడాదంతా కష్టపడితే ఎంత ఆదాయం వస్తుందో... సంక్రాంతి, దసరా, క్రిస్మస్ పండగలకు అంత ఆదాయం వస్తుంది. ఈసారి రెండు సందర్భాల్లోనూ వారి ఆదాయానికి గండి పడింది. ఈ సీజన్‌లో వారి ఆదాయం సగానికి పడిపోయింది. శ్రీకాకుళం జిల్లా పలాస- కాశీబుగ్గ గున్నేశ్వర్‌నగర్‌లో ఉంటున్న స్టైలిష్ టైలర్స్ ప్రతీ పండగ సీజన్‌లో 300కు పైగా డ్రెస్సులు కుడతారు. ఈ ఏడాది వాటి సంఖ్య 160కి తగ్గిందని దుకాణం నిర్వాహకుడు జింగా గోపాల్ చెప్పాడు. అదీగాక ప్రతి ఏడాదీ డిసెంబరు 20వ తేదీ తర్వాత సంక్రాంతి దుస్తులు కుట్టడం పనులు ప్రారంభమయ్యేవని, కానీ ఈ ఏడాది జనవరి మొదటి వారం తర్వాతే పనులు ప్రారంభమయ్యాయని చెప్పాడు.

బట్టలు కొనే పరిస్థితి లేదు

వరిసాగు ఇబ్బందిగా మారింది. ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రతి సంక్రాంతికీ కొడుకు, కోడలు, కూతురు, అల్లుడుతోపాటు వారి పిల్లలకు కొత్త బట్టలు కొనేవాడిని. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. బయట అప్పు కూడా దొరకడం లేదు. ఏం చేయాలో కూడా తెలియడం లేదు. ఈ ఏడాది సంక్రాంతికి వారిని ఇంటికి పిలిచే పరిస్థితి లేదు.

పంపన సూర్యారావు, కౌలురైతు, మైప (పశ్చిమగోదావరి జిల్లా)

ప్రతి సంవత్సరం డిసెంబర్ జనవరి నెలల్లో ఉండే క్రిస్‌మస్, సంక్రాంతి పండుగలకు వ్యాపారం బాగా జరిగేది. ఈ యేడాది కరువు వల్ల రోజూ 50 వేలు జరగాల్సిన వ్యాపారం ఐదారువేల వ్యాపారం కూడా జరగడం లేదు.

మురళీ, శ్రీప్రియ క్లాత్ మర్చెంట్ (కర్నూలు)



రూ.2 లక్షల సరుకు తెచ్చాం..

'పండుగకు వ్యా పారం జరుగు తుం దని ఆశించిన రెండు లక్షల రూపాయలు సరుకు తెచ్చా. కొనేం దుకు ఒక్క నాథుడు రావడం లేదు. ఈ సరుకంతా ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. మాములుగా ఈ సమయానికి దుకాణం నిండా మనుషులుండే వారు. కానీ ఈసారి పది వేలు కూడా జరగలేదు. వ్యాపారం ఎట్లా అని భయమవుతోంది.' అని అనంతపురం జిల్లా కొండకమర్లలోని బట్టల వ్యాపారి మహబూబ్ బాషా ఆవేదన వ్యక్తం చేశాడు. ఓబుళదేవరచెరువు మండలంలో కొండకమర్ల ఓ కూడలి గ్రామం. చుట్టుపక్కల గ్రామాలకు ఇదే పెద్ద గ్రామం. గ్రామాల నుంచి అంతా వచ్చి ఇక్కడే బట్టలు, సరుకులు కొనుక్కోవడం జరుగుతుంది. పంటలు బాగా ఉండి, డబ్బులుంటే ఈ సమయానికి దుకాణాలన్నీ కిటకిటలాడుతూ ఉండేవి. గత సంవత్సరం ఇదే సమయానికి ప్రతిరోజూ రూ.30వేలు వ్యాపారం జరిగింది. కానీ ఈ సారి 10 వేల రూపాయలు కూడా రావడం లేదు. పండుగ దగ్గరికొచ్చినా దుకాణాల్లో కొనే వారు కరువయ్యారు. ప్రకాశం జిల్లా జె పంగులూరుకు చెందిన కిరాణా షాపు యజమాని ఇమ్మడిశెట్టి మారుతి మాట్లాడుతూ పతియేటా పండుగ సీజన్‌లో రూ.6 లక్షలకు సరుకులు అమ్మేవాళ్లమనీ, ఈ ఏడాది ఇప్పటికి రూ.50 వేలకు కూడా అమ్మలేదనీ చెప్పారు.

గతంలో వారం, పదిరోజుల ముందే సన్నాహాలు

తమ చిన్నతనంలో పండుగ బాగా జరిగేది. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు గతంలో వారం10 రోజుల ముందు నుంచే ఇళ్లను శుభ్రం చేసి సున్నాలు వేసి, ఇంటిలో సామాన్లు కడిగి అలంకరించుకునే వాళ్లం. ఈ రోజుల్లో కొన్ని చోట్ల మినహా ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ఆ రోజుల్లో 6,7 రకాల పిండి వంటలు తయారు చేసుకుని ఇంటిల్లిపాది తినేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు.

సత్యవతి, పిఠాపురం (తూర్పుగోదావరి జిల్లా)

వచ్చి వెళ్లే ఖర్చులతో అక్కడే పండుగ

పనికోసం బెంగళూరుకు పోయిన కొడుకు, కొడలు, వారి పిల్లలు వచ్చిపోవాలంటే కనీసం రెండు వేలకుపైగా ఛార్జీలే అవుతాయి. అదేదో అక్కడే ఉండి చేసుకుంటే ఆ ఖర్చులైనా మిగులుతాయి. ఊళ్లో శివరాత్రి పండుగ బాగా జరుగుతుంది. అప్పుడు వస్తారు. బతకడమే కష్టంగా ఉంటే కొత్త బట్టలెట్టా కొనేది. ఊళ్లో ఉన్నవాళ్లు వారి సరిపడ చేసుకుని తింటారంతే. పంటల్లేక డబ్బుల్లేకపోతే ఏ పండగ చేసుకుంటారు

యల్లమ్మ వృద్ధురాలు, పోతులవాండ్ల కొత్తపల్లి (అనంతపురం)



బస్, రైల్వేస్టేషన్లు రద్దీ


విజయవాడ పిఎన్‌బిఎస్ బస్టాండులో ప్రయాణికులు

ప్రైవేటు బస్సుల్లో మూడు రెట్లు అధిక ఛార్జీలు
టోల్ గేట్ల వద్ద తీవ్ర రద్దీ

ప్రజాశక్తి - యంత్రాంగం

సంక్రాంతికి సొంత గ్రామాలకు వచ్చే వారికి ఏటా మాదిరిగానే ప్రయాణ కష్టాలు తొలగడం లేదు. కోస్తాలోని వివిధ జిల్లాలోని సొంత గ్రామాలు, పట్టణాలకు రావడానికి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబయి, ఢిల్లీ నుంచి వచ్చే వారికి బస్, రైల్వే, విమాన టిక్కెట్లు దొరక్క నానా ఇబ్బంది పడుతున్నారు. హైదరాబాద్ నుండి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం మధ్య ఉన్న టోల్‌గేట్లన్నీ రద్దీగా మారాయి. కృష్ణాజిల్లా కీసర టోల్‌ప్లాజా వద్ద శనివారం ఒక్కరోజే ఈ మార్గంలో 10 వేల వరకు కార్లు ప్రయాణించాయి. రుసుము చెల్లించే క్రమంలో ఆలస్యం కావటంతో కిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోవటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

మధ్యతరగతి, పేదలు రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో పడిగాపులు పడుతున్నారు. హైదరాబాద్ నుండి పాలకొల్లుకు ప్రైవేటు బస్ చార్జి నాన్ ఎసి రూ.350 నుంచి రూ.500 వరకూ మొన్నటి వరకూ ఉండగా, ప్రస్తుతం రూ.1500 నుంచి రూ.రెండు వేలు వరకూ పలుకుతోంది. ఇక ఎసి బస్సు ఛార్జీ రూ.600 నుంచి రూ.వెయ్యి వరకూ ఉండేది. ఇప్పుడు అదనంగా మరో రూ.వెయ్యి వరకూ పెరిగింది. ఇక ఆర్‌టిసి ఆర్డినరీ బస్సులను సైతం ప్రత్యేక సర్వీసుగా బోర్డులు పెట్టి అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి గన్నవరం వచ్చే విమాన ప్రయాణికులు సాధారణ రోజుల్లో రూ.1800 నుంచి రూ.నాలుగు వేలు వరకూ చెల్లిస్తుంటే, శనివారం నాడే రూ.25 వేలు చెల్లించి టిక్కెట్ కొనాల్సి వచ్చిందని ఒక ప్రయాణికుడు ఆవేదన వ్యక్తం చేశారు.

సంక్రాంతి సందర్భంగా తూర్పుగోదావరి జిల్లాలోని బస్సు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిశాయి. ప్రైవేట్ బస్సు యాజమాన్యాలు ప్రయాణికులపై ఛార్జీల మోత మోగిస్తున్నాయి. రద్దీ ఎక్కువగా ఉండటంతో మూడు రెట్లు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి, రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు టిక్కెట్‌కు రూ.2,000 నుంచి రూ.3,000 వరకూ వసూలు చేస్తున్నాయి. ప్రయాణికులు తమ స్వగ్రామాలకు చేరేందుకు నానాతంటాలు పడుతున్నారు. ఈనెల 12 నుంచి 18 వరకూ జిల్లా నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, విజయవాడ, తిరుపతి వెళ్లే రైళ్లల్లో రిజర్వేషన్లు అన్నీ నిండిపోయాయి. చేసేది లేక చాలామంది నిల్చొనే ప్రయాణం చేస్తున్నారు. జిల్లాలో రాజమహేంద్రవరం, కాకినాడ, సామర్లకోట రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో నిండిపోయాయి.

విజయవాడ రైల్వేస్టేషన్ జనాలతో కిటకిటలాడింది. ఎక్కడ చూసినా జనాలు కనిపించారు. పిఎన్‌బిఎస్ బస్టాండులో కూడా జనసందోహం కనిపించింది. ఆదివారం నుంచి సెలవులు కావడంతో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు తమ ఊళ్లకు బయలుదేరారు. అదనపు బస్సులు నడుపుతున్నా ప్రయాణికుల రద్దీకి అవి సరిపోవడం లేదు.

ఏనుగుల దాడిలో గిరిజనుడు మృతి

ప్రజాశక్తి -కొమరాడ(విజయనగరం)

ఏనుగులు దాడిలో ఓ గిరిజన రైతు మృతి చెందిన ఘటన విజయనగరం జిల్లా కొమరాడ మండలం కెమిశీల పంచాయతీ నాయుడు వలసలో శనివారం చోటుచేసుకుంది. గత కొన్ని నెలలుగా ఏజెన్సీలో ఏనుగులు సంచరిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం బాసంగి, అర్తాం గ్రామాల వద్ద ఇద్దరు రైతులను గాయపరిచాయి. తాజాగా నాయుడువలసకు చెందిన నిమ్మక పకీర్ (62) శనివారం ఉదయం పొలంలో పని చేసుకుంటుండగా, వెనుక నుంచి వచ్చిన ఏనుగులు దాడి చేశాయి. స్థానికులు గమనించి అరుపులు, కేకలు వేయడంతో అవి అక్కడి నుంచి వెళ్లిపోయాయి. వెంటనే ఆ వృద్ధుడిని పార్వతీపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పకీరు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో ఆ గ్రామంలో విషాదం అలముకుంది. ఏనుగుల దాడిలో మృతి చెందిన పకీరు కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం నాయకులు కె. సాంబమూర్తి డిమాండ్ చేశారు.


బెలూన్ ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న బుద్ధప్రసాద్

నాగాయలంకలో సంక్రాంతి సంబరాలు

నేటి నుంచి నాటు పడవ పోటీలు

ప్రజాశక్తి - చల్లపల్లి

కృష్ణాజిల్లా నాగాయలంకలో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ, గ్రామ పంచాయతీ గ్రామ అభివృద్ధి కమిటీ (స్వచ్ఛ నాగాయలంక) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంబరాలను ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. మొదటిరోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గరగనృత్యాలు, టప్పిటగుళ్ళు, డప్పుకళాకారుల విన్యాసాలు, బుట్టబొమ్మల ప్రదర్శన, మిమిక్రీ, హాస్యవల్లరి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. దివిసీమలోని నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా నాగాయలంక ప్రధాన సెంటరు నుంచి కృష్ణాపుష్కరఘాట్ వరకూ కళాకారులు శోభాయాత్ర నిర్వహించారు. కళాకారులు వివిధ వేషధారణలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. కళాకారులు గరగ నృత్యాలు, టప్పిటగుళ్ళు, డప్పుకళాకారులు విన్యాసాలు చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. మండలి బుద్ధప్రసాద్ ర్యాలీలో బైక్ నడపటంతోపాటు ఎడ్లబండిపై ఎక్కటం ఆకర్షణగా నిలిచింది. కృష్ణానది మధ్యలో పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన నవలంకను బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఆ లంకను అందంగా తీర్చిదిద్దటంతో ఆకర్షణీయంగా నిలిచింది. అక్కడ జయపూర్ తరహాలో గుడారాలను ఏర్పాటుచేశారు. ఆదివారం నుంచి నాటుపడవ పోటీలు ప్రారంభమవుతాయి.

ప్రజలకు జగన్ అవసరం లేదు

మంత్రి నక్కా ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

అన్ని వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుంటే ఇక ప్రజలకు ప్రతిపక్ష నేత జగన్ అవసరం ఏముంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ప్రశ్నించారు. గుంటూరులోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014 వరకూ ఒక్కొక్కరికి రూ.200 మాత్రమే పింఛను అందించగా టిడిపి అధికారంలోకి రాగానే తొలుత రూ.వెయ్యికి పెంచామని, ఈ ఏడాది జనవరి నుంచి రూ.వెయ్యిని రెండు వేలకు, రూ.1500 పొందుతున్న వారికి రూ.మూడు వేలు ఇస్తామని చెప్పారు. ఈ రెండు అంశాలు వైసిపి నవరత్నాల హామీ నుంచి కాపీ కొట్టారనే వాదనను ఆయన ఖండించారు. వైసిపిని ప్రజలు పట్టించుకోవడం లేదని, జగన్‌తో తమకు అవసరం లేదని ప్రజలు భావిస్తున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. ఇంకా ప్రజలకు మేలు చేసే ఎన్నో నిర్ణయాలు సిఎం చంద్రబాబు త్వరలో తీసుకుంటారని చెప్పారు.

స్వైన్‌ఫ్లూతో యువకుడు మృతి

ప్రజాశక్తి-ఇంకొల్లు : ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలంలోని పూసపాడుకు చెందిన దుర్గాభవానీ స్వైన్‌ఫ్లూతో మృతి చెందిన నెల రోజుల్లోనే మరొకరు మృతి చెందారు. శుక్రవారం నీలకంఠం రామకృష్ణ (35) మరణించారు. పూసపాడు గ్రామానికి చెందిన రామ కృష్ణ గుంటూరు జిల్లా చిలకలూరి పేట పక్కన ఉన్న యడ్లపాడు మండలం గణపవరం గ్రామంలో నివాసముంటున్నారు. ఆయన పత్తి వ్యాపారి. 4వ తేదీన జ్వరం రావడంతో చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యం మెరుగవకపోవడంతో 9వ తేదీ నుంచి రెండ్రోజులు గుంటూరులో చికిత్స పొందారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందారు.

రాజధాని కార్మికుల వలస

- మంగళగిరి నియోజకవర్గం నుంచి ఇతర ప్రాంతాలకు
- ఇతర రాష్ట్రాల వారికే నిర్మాణ సంస్థల ప్రాధాన్యం
- స్థానికులకు దక్కని భాగస్వామ్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని పరిధిలో ఉన్న మంగళగిరి నియోజకవర్గంలో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడం లేదు. సిఆర్‌డిఎ ఆధ్వర్యంలో రూ.30 వేల కోట్లతో నిర్మాణాలు జరుగుతుండగా మరో రూ.ఐదారు వేల కోట్లతో ప్రయివేటు సంస్థలు నిర్మాణంలో ఉన్నాయి. రాజధాని నిర్మాణంలో భూములిచ్చిన రైతులకు, వారి పిల్లలకు, స్థానికంగా ఉన్న వృత్తిదారులను ప్రభుత్వం, సిఆర్‌డిఎ, నిర్మాణ సంస్థలు ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు. నిర్మాణ సంస్థలు ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది కార్మికులను తెచ్చుకుంటున్నారు. వీరిచేత ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ పనులు చేయిస్తున్నారు. తక్కువ జీతంతో ఎక్కువ పని చేయిస్తూ ఆయా నిర్మాణ సంస్థలు శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయి. ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, పశ్చిమ బంగ, జార్కండ్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులనే వినియోగిస్తున్నారు. కేవలం భవన నిర్మాణ కార్మికులే కాకుండా నిర్మాణ రంగంలో అనుబంధ పనులు చేసే కార్మికులను కూడా ఇతర ప్రాంతాల వారినే వినియోగిస్తున్నారు. దీంతో మంగళగిరి నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు పెరగడం లేదు. రాజధాని నిమిత్తం 33 వేల ఎకరాల పట్టాభూమి, మరో 17వేల ఎకరాల వరకూ వివిధ రకాల ప్రభుత్వ భూములు కలిపి మొత్తం రాజధానికి 50 వేల ఎకరాల వరకూ ప్రభుత్వం తీసుకుంది. 50 వేల ఎకరాల్లో వ్యవసాయం ఉపసంహరణ వల్ల దాదాపు 24 వేల మంది వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోయారు. రాజధానిలోని పేదలకు నెలకు రూ.2500 పింఛను కింద ఇస్తున్నా కుటుంబ అవసరాల కోసం ఈ సొమ్ము సరిపోక రాజధాని ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారు.



ఇతర ప్రాంతాల నుంచి వివిధ రకాల వృత్తిదారులు రాజధానికి వస్తుంటే ఇక్కడ వారు మాత్రం ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు. మూడు పంటలు పండే అవకాశం ఉన్న నిడమర్రులో వ్యవసాయకార్మికులు మిర్చి కోతల కోసం తాడికొండ, అమరావతి మండలాలకు వెళున్నారు. ఇటీవల నిర్మించిన విట్, ఎస్‌ఆర్‌ఎం వంటి ప్రయివేటు విశ్వవిద్యాలయాల్లోకి నీరుకొండ, బేతపూడి, నిడమర్రు గ్రామాలకు చెందిన దాదాపు 100 మంది మహిళలు నాల్గోతరగతి ఉద్యోగులుగా పనుల్లోకి చేర్చుకున్నారు. కృష్ణాయపాలెం, కురగల్లు కార్మికులకు ఎటువంటి ఉపాధి అవకాశాలూ లేవు. ఉండవల్లి, పెనుమాక, నవులూరు, కురగల్లు, యర్రబాలెంకు చెందిన అనేక మంది విజయవాడకు ఉపాధి నిమిత్తం నిత్యం రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఉపాధి హామీ ద్వారా ఉపాధి కల్పిస్తామని భూ సమీకరణ సమయంలో కొన్ని నర్సరీలు వేసినా వీటిల్లో పట్టుమని 100 మందికి కూడా ఉపాధి కల్పించడం లేదు. నర్సరీలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. ఇదిలా ఉండగా నిరుపేదలకు, వ్యవసాయ కార్మికులకు రాజధాని గ్రామాల్లో ఇస్తున్న పింఛన్లు రూ.2500 నుంచి ఏటా 10 శాతం పెంచుతామన్న సీఎం హామీ నెరవేరలేదని ఆయా గ్రామాల్లో పింఛన్లు పొందుతున్న వారు తెలిపారు. నిడమర్రు గ్రామ సమీపంలో హౌస్ ఫర్ ఆల్ పేరుతో టిడ్కో కార్పొరేషన్ నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణంలో కూడా సంబంధిత కాంట్రాక్టు సంస్థ ఈ ప్రాంత కార్మికులను వినియోగించడం లేదు.

పింఛను సొమ్ము సరిపోక చిన్న దుకాణం పెట్టుకున్నాం



వ్యవసాయ భూములను ప్రభుత్వం సమీకరణలో తీసుకుంది. దీని వల్ల వ్యవసాయ ఉపాధి కరువైంది. ప్రభుత్వం ఇచ్చే రూ.2500 పింఛను సరిపోవడం లేదు. కుటుంబ జీవన ఖర్చులు పెరిగిపోయాయి. నెల క్రితం చిన్న దుకాణం పెట్టుకున్నాం. ప్రస్తుతం వ్యాపారం ఆశాజనకంగా లేదు.

- కట్టెపోగు కోటేశ్వరరావు (నిడమర్రు)

ఉపాధి కోసం విజయవాడకు



నిడమర్రులో మూడు పంటలు పండే భూములున్నాయి. కానీ వీటిని మెట్ట భూములుగా పరిగణించి కౌలు ఇస్తున్నారు. గ్రామంలో 2700 ఎకరాల భూమి ఉండగా 300 ఎకరాలు సమీకరణలో ఇవ్వలేదు. గతంలో ఈ గ్రామానికి ఎంతో మంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పూలు కోసే వారు. వీరికి ఒక్కొక్కరికి రోజుకు రూ.600 వరకూ కూలి దక్కేది. ఇప్పుడు పూలతోటలు లేకపోవడం వల్ల స్థానికులకే పనుల్లేవు.

- గాదె వెంకటరెడ్డి

ఉపాధి కోసం వలసలు



రాజధాని ప్రాంతంలో ఉపాధి లేక వ్యవసాయకార్మికులకు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారు. భూ సమీకరణ తరువాత వ్యవసాయ కార్మికుల ఉపాధిపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. కేవలం ఒక్కో కుటుంబానికి రూ.2500 పింఛను ఇస్తున్నారు. పెరిగిన కుటుంబ ఖర్చులతో ఈ పింఛన్ సొమ్ము చాలక స్థానికంగా పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు.

- ఎం రవి, సిపిఎం రాజధాని ప్రాంత కార్యదర్శి

సంపాదకీయం

రైతు లోగిళ్లు వెలవెల


పండుగలు సమాజంలోని ఆచార వ్యవహారాల సమ్మేళనం. మనిషికీ సమాజానికీ మధ్య అనుబంధాల వారధులు. సాంస్కృతిక వికాసానికి సంకేతం. జగత్తును ఆవరించిన ఓ నిర్లిప్తతను పారద్రోలి, ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపే ఉత్ప్రేరకాలు. మత ప్రమేయం లేకుండా ప్రకృతితో, పర్యావరణంతో ముడివడి సకల మానవాళీ సమాదరించదగిన అసలు సిసలు పండుగ సంక్రాంతి. 'మంచు ముత్యాల సొగసు రాణించు తల్లి/ పంట రైతుల పాలి కల్పకము సర్వ/ భువన పర్వమ్ము చల్లని పుష్యలక్ష్మి/ వచ్చినను తియ్యని తలంపు విచ్చెనెడద'- అంటాడు బొడ్డు బాపిరాజు. ఈ పద్యంలో ప్రకృతికి మంచు ముత్యాల సొగసు రాణిస్తూవుందనీ, అది పంటలు పండించే రైతులకు కల్పవృక్షంలాంటిదనీ, చల్లని పుష్యలక్ష్మి భూమంతా విస్తరించి వ్యాపించి వస్తూ వుందనే తియ్యని తలపు తన మనసులో విప్పారిందని కవి భావన. వ్యవసాయ సంస్కృతీ సౌభాగ్యానికి పట్టం కడుతూ మట్టి వాసనను పట్టి చూపించే పండుగ ఇది. అసలు సంక్రాంతి అంటేనే పల్లె పండుగ. పండుగ వైభవ ప్రాభవాలన్నీ పల్లెల్లోనే వెల్లివిరుస్తాయి. గ్రామ జీవన ఆత్మీయానుబంధాలన్నింటినీ మనసు నిండుగ దృశ్యమానం చేసే కనుల పండుగ ఇది. ఆరుగాలం శ్రమిస్తూ నమ్ముకున్న భూమికే తన బ్రతుకును ముడుపు గట్టిన రైతులకు పంటలు చేతికొచ్చే కాలం. నట్టింటికి నడిచొచ్చే సిరిసంపదలను ఆహ్వానిస్తూ జరుపుకునే సంబరం. అందుకే అంటాడు కుందుర్తి- 'పసుపు కుంకుమలతో అలంకరించిన బసవన్నలను ప్రీతితో/ తమ గుండెల్లో దాచుకుంటారు రైతులు/ చిటికెల మీద తీరిపోతున్న నోటు పద్దులు చించేసి/ కొత్త ఊపిరి పీల్చుకుంటారు రైతులు' అని. ఇది అచ్చమైన జానపదుల వేడుక. పల్లీయుల ఉల్లాలను రంజిల్ల చేసే పండుగ. 'సంక్రాంతి అంటే- సందళ్ళ పుట్ట... సరదాల గుట్ట... జ్ఞాపకాల తుట్టె...' అని ఓ కవి అన్నట్టుగా... సరదాలు, సందళ్లతో పెనవేసుకొన్న జ్ఞాపకాలను పదిలపరచుకొని మళ్లీ ఏడాది వరకు నెమరువేసుకొనేవారు నిన్నామొన్నటి వరకు.

ఆధునిక జీవనాన్ని అలవాటు చేస్తోన్న పట్టణీకరణ... కార్పొరేటీకరణ దెబ్బకు పల్లెలు, వ్యవసాయం, సంస్కృతి కనుమరుగవుతున్నాయి. 'దేశానికి పల్లెలే పట్టుగొమ్మలని' జాతిపిత మహాత్మాగాంధీ చెబితే... ఆ పట్టుగొమ్మల జీవనాడిని పెకలిస్తున్నారు నేటి పాలకులు. సహజ వనరులను ఛిద్రం చేస్తోన్న దృశ్యం... మనకు నిత్యకృత్యం. ఓవైపు ఆనందాలు... సంతోషాలు... సంబరాలతో కళకళలాడుతుంటే, మరోవైపు భవితపై బెంగతో ఆందోళన చెందుతున్న రైతుల లోగిళ్లు వెలవెలబోతున్నాయి. ఆకలికి అన్నం పెట్టే రైతన్న కళకళలాడుతూ ప్రపంచమంతా వెలుగు నింపాలి. నేడు తానే కరువు కోరల్లో మగ్గుతున్నాడు. అప్పుల్లోకి నెట్టేస్తున్న వ్యవసాయంతో... చెట్టుకొమ్మకో, పురుగు మందుకో తమ జీవితాన్ని అర్పించుకొంటున్నాడు.

సంక్రాంతి పండుగ అంటే కళకళలాడే రైతు లోగిళ్లు, గొబ్బెమ్మలు, రంగురంగుల ముగ్గులు, గాలిపటాలు అన్నింటికి మించి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి సంతోషంగా జరుపుకునే వేడుక. ఇది మసకబారుతున్న గత వైభవం. ప్రకృతితోనూ, సమాజంతోనూ వున్న బంధం మెల్లమెల్లగా తెగిపోతోంది. వర్షాభావంతో వేసిన పంటలు పండక, అక్కడక్కడ కొద్దిపాటి పంట చేతికందినా గిట్టుబాటు ధర లేక... రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రాసం కరువై పశుసంపద నశించిపోతున్నది. వృత్తులు బరువై గ్రామీణ జీవనం ఛిన్నాభిన్నమైపోతున్నది. కార్పొరేటీకరణ పిడికిట బందీ అయిన రైతు లోగిళ్లు భవితపై బెంగతో బావురుమంటున్నాయి.

'పొలాల నన్నీ/ హలాల దున్నీ,/ ఇలాతలంలో హేమం పిండగ/ జగానికంతా సౌఖ్యం నిండగ/ విరామమెరుగక పరిశ్రమించే/ బలం ధరిత్రికి బలి కావించే/ కర్షక వీరుల కాయం నిండా/ కాలువకట్టే ఘర్మజలానికి,/ ఘర్మజలానికి ఖరీదు లేదోయ్' అని మహాకవి శ్రీశ్రీ చెపుతాడు. అయితే పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే... ప్రభుత్వం సంక్రాంతి సంబరాలు పేరుతో రాష్ట్రం సిరిసంపదలతో తులతూగుతున్నట్టుగా రంగుల అద్దాల్లో చూపిస్తూ సమస్యను పక్కదారి పట్టిస్తోంది. కవుల కలాలు గత వైభవం మళ్లీ రావాలన్న ఊహలకే పరిమితమౌతున్నాయి. టీవీ చానళ్లు ప్రసారం చేసే సంక్రాంతి సంబరాలను చూసి రైతుల ముఖాలు వెలవెలబోతున్నాయి. డబ్బున్న మారాజుల జూద క్రీడగా ఉన్న కోడిపందేలు సంక్రాంతి సంబరాలుగా చెలామణీ అయిపోతున్నాయి. ప్రజాప్రతినిధులే దగ్గరుండి నిర్వహించే సంస్కృతి ప్రబలింది. దానికి తోడు గోసంరక్షణ పేరిట మతోన్మాదుల దాడులూ రైతుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. 'నిరుపేదవాడు సంక్రాంతినాడు మహారాజు' అన్నాడు దాశరథి. ఆ ఒక్కరోజు కూడా పొయ్యిలో పిల్లిలేవని కుటుంబాలెన్నో... ఎన్నెన్నో. దాశరథి కృష్ణమాచార్య చెప్పినట్టుగా 'సంక్రాంతిలోని క్రాంతి/ సమతా వాది కవికి సంభ్రాంతి/ ఈ క్రాంతి పల్లెలో, పట్నంలో/ ఎల్ల యెడల పంటలా పండాలి'. కార్పొరేట్ల దాహానికి రైతన్నలను బలిపెట్టే విధానాలు పోయి 'రైతే రాజు' అన్నది వొట్టి మాటగా కాకుండా ప్రభుత్వ విధానానికి కేంద్ర బిందువుగా ఉన్నప్పుడే దేశానికి నిజమైన సంక్రాంతి.

ఇదీ విషయం



నర నరాల వేదనలో
తర తరాల రోదనలో
బక్కచిక్కి
బిక్కచచ్చి
పడిన బతుకు గోడలు
పాడుపడ్డ వాడలు !

- మహాకవి శ్రీశ్రీ

విశ్లేషణ

ఫెయిలయ్యేదెవరు?



ఈ సవరణ చట్టం అమల్లోకి వస్తే ఐదో తరగతిలో కొంతమంది, ఎనిమిదో తరగతిలో మరి కొంతమంది డిటెయిన్ (ఫెయిల్) కావాల్సి వస్తుంది. పరీక్షలు పెడితే కొంతమంది పాస్ అవుతారు. మరి కొంతమంది ఫెయిల్ అవుతారు. అయితే ఫెయిల్ అయిన వారిని డిటెయిన్ చేయాలనేది లక్ష్యం. అలా ఫెయిలయ్యేదెవరు అనేదే పరిశీలించాల్సిన అసలు విషయం.



నాగటి నారాయణ

విద్యాహక్కు చట్టంలోని ఆయువుపట్టు లాంటి విద్యార్థుల 'నో డిటెన్షన్' విధానానికి కేంద్ర ప్రభుత్వం తిలోదకాలు ఇస్తోంది. 'బడిలో ప్రవేశం పొందిన బాలలను ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పూర్తయ్యే వరకు ఏ తరగతిలోనైనా మళ్లీ కొనసాగించకూడదు, బడి నుండి తొలగించ కూడదు' అనే సెక్షన్ 16ను కింది విధంగా మార్చేసింది. 16(1) విద్యా సంవత్సరం చివరలో ఐదో తరగతికి మరియు ఎనిమిదో తరగతికి రెగ్యులర్ ఎగ్జామినేషన్ వుంటుంది. (2) సబ్ సెక్షన్ (1) లోని పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు అదనపు బోధ చేసి రెండు నెలల్లోగా మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పించాలి. (3) సబ్ సెక్షన్ (2)లోని రీ-ఎగ్జామినేషన్‌లో ఫెయిలైన విద్యార్థులను సదరు ఐదో తరగతిలో లేదా ఎనిమిదో తరగతిలో లేదా రెండు తరగతుల్లో నిలిపివేయటానికి (డిటెయిన్ చేయటానికి) ఆయా పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించవచ్చు లేదా అనుమతించకపోనూ వచ్చు. (4) ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (ఎనిమిదో తరగతి వరకు) పూర్తయ్యే దాకా విద్యార్థిని పాఠశాల నుండి తొలగించకూడదు.

గతేడాది జూలైలో లోక్‌సభ ఆమోదించిన ఈ బిల్లును ఈ నెల మూడో తేదీన రాజ్యసభ ఆమోదించింది. ఈ సవరణతో విద్యాహక్కు చట్టానికి విఘాతం కల్గుతుందని రెండు సభల్లోనూ వామపక్షాల సభ్యులు వ్యతిరేకించారు.

ఎందుకీ సవరణ?

నో డిటెన్షన్ పేరుతో పాస్, ఫెయిల్‌తో నిమిత్తం లేకుండా పై తరగతులకు ప్రమోట్ చేస్తుండటం వలన విద్యార్థుల్లో అలసత్వం పెరిగిపోయిందని, అభ్యసన సామర్థ్యాలు పడిపోతున్నాయని కొంతమంది మంత్రులు, అధికారులు, ఉపాధ్యాయులు అసహనంతో వున్నారు. విద్యా ప్రమాణాల కోసం సెక్షన్ 16ను తొలగించాలని 25 రాష్ట్రాలు కోరినట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి ప్రకాష్ జవదేకర్ చెప్పారు. అభ్యసన సామర్థ్యాలు అసంతృప్తిగా వున్నాయనటానికి 'యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్స్' (ఏఎస్ఈఆర్), 'నేషనల్ ఎడ్యుకేషన్ సర్వే' (ఎన్ఎఎస్)లను ఉటంకించారు. నిర్దేశిత అభ్యసన సామర్థ్యాలు అనేవి విద్యాహక్కు చట్టం కంటే ముందు కూడా లేవనే విషయాన్ని మాత్రం చెప్పలేదు. కేంద్ర ప్రభుత్వం కోరిక మేరకు ప్రథమ్ అనే సంస్థ 2006 నుండి 2016 వరకు ప్రతి ఏటా 'వార్షిక విద్యా స్థాయి నివేదిక'లు ప్రకటించింది. విద్యాహక్కు చట్టం అమల్లోకి రావడానికి ముందు ఐదు సంవత్సరాల నివేదికల్లో కూడా అభ్యసన సామర్థ్యాలు అరకొరగానే వున్నట్లు అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్‌లోని రీసర్చ్ స్కాలర్స్ అధ్యయనం తెలిపింది. ఎలిమెంటరీ (8 వ తరగతి) నుండి సెకండరీ (10 వ తరగతి)కి ఎంత నిలుపుదల వుందో, సెకండరీ నుండి సీనియర్ సెకండరీ (12వ తరగతి)కి కూడా దాదాపు అంతే వున్నట్టు 'ది బెటరిండియా.కామ్' సంస్థ పేర్కొంది. 'నో డిటెన్షన్ పాలసీ' అనేది విద్యాహక్కు చట్టంతోనే వచ్చిందని చెప్పటం మరీ అన్యాయం. దాదాపు ఇరవై రాష్ట్రాల్లో 2010 కంటే ముందు నుండే 'నో డిటెన్షన్' ఏదో ఒక స్థాయి వరకు అమల్లో వున్నట్లు 2015 లో 'కేంద్ర విద్యా సలహా సంస్థ' (కేబ్) సబ్ కమిటీ చెప్పింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1968 (కొఠారి కమిషన్ నేపథ్యం) నుండే ఏడవ తరగతి వరకు నో డిటెన్షన్ అమలవుతున్న విషయం తెలిసిందే. ఇంతకాలం లేని వ్యతిరేకత ఇప్పుడు ఎందుకు వచ్చిందంటే కేంద్రంలో మరియు మెజారిటీ రాష్ట్రాల్లోని నేటి పాలకుల సైద్ధాంతిక నేపథ్యమే.

ఇంతకీ ఫెయిలయ్యేదెవరు?

ఇప్పటిదాకా దేశమంతటా పాఠశాలల్లో చేరిన విద్యార్థులు అందరూ ఏడాదికో తరగతి చొప్పున ప్రాథమిక విద్య (8 వ తరగతి) వరకు నిరాఘాటంగా చదువుకుంటున్నారు. ఆ తర్వాత 9వ తరగతిలో 20 శాతం మంది, 10వ తరగతిలో మరో 20 శాతం మంది ఫెయిల్ అవుతున్నట్లు ప్రకాష్ జవదేకర్ చెప్పారు. ఈ సవరణ చట్టం అమల్లోకి వస్తే ఐదో తరగతిలో కొంతమంది, ఎనిమిదో తరగతిలో మరి కొంతమంది డిటెయిన్ (ఫెయిల్) కావాల్సి వస్తుంది. పరీక్షలు పెడితే కొంతమంది పాస్ అవుతారు. మరి కొంతమంది ఫెయిల్ అవుతారు. అయితే ఫెయిల్ అయిన వారిని డిటెయిన్ చేయాలనేది లక్ష్యం. అలా ఫెయిలయ్యేదెవరు అనేదే పరిశీలించాల్సిన అసలు విషయం. 'యు-డైస్' నివేదికల ప్రకారం దేశవ్యాప్తంగా 5వ తరగతిలో 2.50 కోట్ల మంది మరియు 8వ తరగతిలో 2.30 కోట్ల మంది మొత్తం 4.80 కోట్ల మంది విద్యార్థులు వుంటారు. 'అభ్యసన ఫలితాల' గురించి ఏఎస్ఈఆర్, ఎన్ఏఎస్ నివేదికల ప్రకారం వారిలో సగం మంది ఫెయిల్ అవుతారు. పాఠశాలలు పలు రకాలుగా వున్నందున విద్యార్థులకు అందే చదువులో అనేక అసమానతలు న్నాయి. నాణ్యమైన విద్య కొందరికే పరిమితం. అత్యధిక బాలబాలికలు నాసిరకమైన చదువుతోనే నలిగిపోతు న్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదివే విద్యార్థులు ఫెయిలైతే యాజమాన్యాలకు నష్టం గనక అందరినీ పాస్ చేస్తారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నవోదయ, కేంద్రీయ తదితర విద్యాలయాల్లోని విద్యార్థుల్లో ఎవరూ డిటెయిన్ కారు. రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణలోని రెసిడెన్షియల్, మోడల్, కేజీబీవీ పాఠశాలల్లోని విద్యార్థులు కూడా అందరూ పాస్ అవుతారు. కాగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లోని విద్యార్థుల్లోనే దాదాపు సగం మంది ఫెయిలయ్యే అవకాశం వుంటుంది.

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులే ఫెయిలవుతారా?

ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లోని విద్యార్థులకు సగం చదువే లభిస్తుంది. విద్యాసంవత్సరంలో వుండే 220 రోజుల్లో వెయ్యి గంటలకు సిలబస్ పాఠాలు కేటాయించబడతాయి. ఉపాధ్యాయులు వినియోగించు కునే అర్హతగల సెలవులు, ప్రభుత్వం నిర్వహించే సమావేశాలు శిక్షణా తరగతులకు హాజరవటం, ఎన్నికల విధుల్లో పాల్గొనటం మొదలగు వాటి వలన సగటున 180 రోజుల వరకే తరగతి గదిలో పాఠాలు చెప్పగలరు. ప్రాథమిక పాఠశాలల్లో సగటున ఇద్దరు లేక ముగ్గురు అంటే సగం మంది ఉపాధ్యాయులే పని చేస్తున్నారు. లక్షా పది వేల పాఠశాలలు సింగిల్ టీచర్‌తో నెట్టుకొస్తున్నవి. రోజుకు ఏడు పీరియడ్లలో ఐదు క్లాసుల్లో 21 సబ్జెక్టులకు బోధనాభ్యసన ప్రక్రియ జరగాలి. కానీ అందులో సగమే జరుగుతోంది. ఈ లెక్కన ఒకరు లేక ఇద్దరు, ముగ్గురు టీచర్లు పని చేసే పాఠశాలల్లోని విద్యార్థులకు చదువు వస్తుందా? అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లలో కూడా సబ్జెక్ట్ టీచర్ల కొరత తీవ్రంగానే వుంది. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల లేమి, పుస్తకాల కొరత, పడకేసిన పర్యవేక్షణ మున్నగు సమస్యలు కూడా పిల్లల చదువును దెబ్బతీస్తున్నాయి. బడిలో చెప్పే చదువుకి తోడు కొంతమంది తల్లిదండ్రులు తమ బిడ్డలను ట్యూషన్లకు పంపిస్తున్నారు. చదువుకున్న తల్లిదండ్రులైతే వారే హోమ్ వర్క్ చేయించడం, చదివించడం చేస్తున్నారు. కానీ గ్రామాల్లోని రైతులు, వ్యవసాయ కూలీలు మరియు పట్టణాల్లోని అసంఘటిత రంగంలోని కార్మికులు, అడ్డా కూలీలు, ఆటో డ్రైవర్లు వంటి వారు తమ బిడ్డల చదువుకు తోడ్పడలేరు. కనుక ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేదల పిల్లలే... సామాజికంగా చూస్తే దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల విద్యార్థుల్లోనే ఎక్కువ మంది ఫెయిలవుతారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో మనువాద సిద్ధాంతాన్ని ఎంత చాకచక్యంగా అమలు చేస్తుందో దీని ద్వారా అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వాల తప్పుకు పిల్లలు బలి కావాలా?

6-14 సంవత్సరాల వయసు గల బాలబాలికలకు ఎనిమిదవ తరగతి వరకు ఉచితంగా నిర్బంధంగా చదువు చెప్పి పాస్ సర్టిఫికేట్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 69 సంవత్సరాలు గడిచినా, విద్యాహక్కు చట్టం వచ్చి పదేళ్లు గడిచినా ఆ బాధ్యతను నెరవేర్చలేదు. జాతీయ స్థూల ఉత్పత్తి (జిడిపి)లో ఆరు శాతం నిధులను వెచ్చిస్తే అందరికీ నాణ్యమైన విద్యను అందించవచ్చనే 'కొఠారి కమిషన్' సిఫార్సు ఆచరణకు నోచుకోలేదు. ఏడాదికి రూ.43 వేల కోట్లు చొప్పున ఐదేళ్లు వెచ్చిస్తే విద్యాహక్కు చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయవచ్చు అని చెప్పిన 'మజుందార్ కమిటీ' సూచననూ పాటించలేదు. పైగా గడిచిన నాలుగేళ్లలో కేంద్ర బడ్జెటులో విద్యారంగానికి కేటాయింపులు పదిహేను శాతం తగ్గిపోయాయి. మోడల్ స్కూళ్లు, కంప్యూటర్ విద్య వంటి కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఆపి వేసింది. దేశవ్యాప్తంగా పదకొండు లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వున్నాయి. పాస్, ఫెయిల్‌తో నిమిత్తం లేకుండా పాఠశాల విద్యలో నిర్దేశిత అభ్యసన సామర్థ్యాల సాధనకు తోడ్పడే 'నిరంతర సమగ్ర మూల్యాంకనం' విషయంలో చేతులెత్తేశారు. ఇన్ని లోపాలు, వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ నిర్దోషులైన విద్యార్థులను శిక్షించ టానికి డిటెన్షన్ విధానాన్ని తెచ్చిపెట్టింది. ప్రస్తుతం ఐదవ, ఎనిమిదవ తరగతులకే అని చెప్పినా భవిష్యత్తులో అన్ని తరగతులకూ విస్తరించే అవకాశం వుంటుంది.

తెలుగు రాష్ట్రాల నిబద్ధత కొనసాగాలి

ఐదవ, ఎనిమిదవ తరగతుల్లో డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలా లేదా అనే విషయాన్ని రాష్ట్రాలే నిర్ణయించుకోవచ్చని సవరణ బిల్లులో వుంది. విద్య, రాజ్యాంగ ఉమ్మడి జాబితాలో వున్నందున ఆపాటి వెసులుబాటు ఇచ్చారు. అయితే బిజెపి పాలిత రాష్ట్రాలు ఈ పాటికే అమలు చేయడానికి సిద్ధమయ్యాయి. రాష్ట్రాల కోరిక మేరకే సవరణ బిల్లును ప్రతిపాదించినట్లు ప్రకాష్ జవదేకర్ చెప్పారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను తెలుగు రాష్ట్రాలు వ్యతిరేకిస్తూ నో డిటెన్షన్ పాలసీకే కట్టుబడి వుంటామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఉమ్మడి రాష్ట్రం నుంచే యాభై సంవత్సరాలుగా అమల్లో వుండటం వలన, రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ విద్యార్థి సంఘాల సూచనల వలన ప్రభుత్వాల వైఖరి అలా వుంది. అదే నిబద్ధత కొనసాగాలి. అదేవిధంగా తెలుగు రాష్ట్రాల్లో పాఠశాల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాల పెరుగుదలకు ప్రత్యేక కృషి జరగాలి.

(రచయిత విద్యారంగ విశ్లేషకులు, సెల్ : 9490300577)

ఎంత తేడా!



ఎ కోటిరెడ్డి

సమీక్ష

నైతిక సూత్రాలను పాటించటంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, న్యాయమూర్తి యుయు లలిత్, ప్రధాని నరేంద్రమోడీల మధ్య హస్తిమశకాంతరం ఉందని సిబిఐ డైరెక్టర్ అలోక్‌వర్మ కేసు విషయంలో స్పష్టమైంది. అలోక్‌వర్మ విషయంలో నిర్ణయం చేసేందుకు ప్రధాని నాయకత్వంలో హైపవర్ కమిటీ ఏర్పడడం తెలిసిందే. అయితే ఈ కేసులో తీర్పు చెప్పిన రంజన్ గొగోయ్, కమిటీ సమావేశంలో తాను పాల్గొనటం, నిర్ణయంలో భాగస్వామి కావటం అపోహలకు దారితీస్తుందని భావించి సమావేశానికి తన ప్రతినిధిని నియమించారు. అంతేకాదు, గతంలో యుపి ముఖ్యమంత్రి తరపున ఒక కేసు వాదించిన న్యాయమూర్తి యు యు లలిత్ తాను అయోధ్య కేసు విచారణలో పాల్గొనటం భావ్యం కాదని భావించి, ఆ కేసు విచారణ కోసం ఏర్పాటు చేసిన ధర్మాసనం నుండి తప్పుకున్నారు. ఈ రెండు సందర్భాలలో వీరిద్దరూ ఉన్నత ప్రమాణాలు పాటించారు. అయితే సిబిఐ డెరెక్టర్‌పై నిర్ణయం చేసేందుకు ఏర్పాటైన కమిటీ సమావేశంలో స్వయంగా ప్రధాని పాల్గొని, తొలగించాలన్న నిర్ణయంలో కూడా భాగస్వామి అయ్యారు. అలోక్‌వర్మపై సివిసి చేసిన ఆరోపణలను విచారించాల్సి ఉన్నందున, ఆరోపణల నిగ్గు తేల్చాలంటే ఆయన సిబిఐ ముఖ్య బాధ్యతలలో ఉండటం సరికాదన్నది మోడీ వాదన. మరి అదే సూత్రాన్ని తన వరకు వచ్చే సరికి ఎందుకు పాటించటం లేదు? అలోక్‌వర్మను అర్ధాంతరంగా తొలగించింది, రాఫెల్ కేసు తెరమీదకు వచ్చిన నేపథ్యంలోనే అనేది అందరికీ తెలుసు. అందులో ప్రథమ ముద్దాయి మోడీయేనన్నది కూడా తెలుసు. మరి పై కేసులలో సుప్రీం న్యాయమూర్తులు పాటించిన నైతిక సూత్రాన్ని ప్రధాని ఎందుకు పాటించలేదు? రాఫెల్ విషయంలో తనపై వచ్చిన అవినీతి ఆరోపణల నుండి బయటపడేందుకు ఎంతకైనా దిగజారతారనడానికి ఈ ఉదంతమే నిదర్శనం. నైతికతను పాటించడంలో న్యాయమూర్తులకు, ప్రధానికి ఎంత తేడా ఉన్నదో ఈ సంఘటనతో సుస్పష్టం.


ఒక పక్క రాఫెల్ కుంభకోణంలో మోడీ ప్రధాన పాత్రదారుడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారత ప్రభుత్వం అఫ్‌సెట్ భాగస్వామిగా రిలయన్స్‌ను ప్రతిపాదించిందని ఫ్రెంచ్ మాజీ అధ్యక్షుడు స్పష్టంగా ప్రకటించారు. రాఫెల్ విమానాల కొనుగోలులో ప్రధాని అవినీతికి పాల్పడ్డారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పార్లమెంటులోనూ, బయటా పదేపదే ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణలపై ప్రధాని ఇంతవరకు నోరు మెదప లేదు. కేంద్రమంత్రులు, బిజెపి నాయకుల సమర్థనలు సందేహాలను తొలగించకపోగా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. ఈ సందర్భంలోనే సిబిఐ డైరెక్టర్‌గా వున్న అలోక్ వర్మ, రాఫెల్ కొనుగోలులో జరిగినవని చెబుతున్న అక్రమాలపై విచారణ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇది తెలుసుకున్న కేంద్ర ప్రభుత్వం మోడీని కాపాడటం కోసం అలోక్‌వర్మను డైరెక్టర్ బాధ్యతల నుండి అర్ధరాత్రి తొలగించిందని అనేక మంది ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాఫెల్ కుంభకోణంలో ప్రధాన నిందితునిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మన ప్రధాని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పాటించిన నైతిక సూత్రాలను తానూ పాటించాలి. అంటే ప్రధాని పదవికి రాజీనామా చేసి, రాఫెల్‌పై నిష్పాక్షిక విచారణ జరిపించేందుకు సిద్ధం కావాలి. 56 అంగుళాల ఛాతీ గల మన ప్రధాని ఆ పని చేస్తారని ఆశించటం అవివేకమే!

కామన్‌సెన్స్

డార్విన్ సూత్రానికి నోబెల్ బహుమతి



'జీవ పరిణామమనగానే వేలవేల ఏళ్ల క్రితం అంతరించి పోయిన శిలాజాల అధ్యయనమని చాలా మంది అనుకుంటారు. కానీ, అలా కాకుండా పరిణామ చర్యలను రసాయనిక ప్రయోగశాలలో జరిపిస్తే మంచి ఫలితాలు వస్తాయేమో! పరిణామం అంటే అంతదాకా ఉన్న ఆలోచనలు మారతాయేమో! కొత్త ఫలితాలు వస్తాయేమో!'



డా॥ దేవరాజు మహారాజు

డార్విన్ సూత్రం ఆధారంగా చేసిన ప్రయోగాలకే 2018 సంవత్సరానికి స్వీడిష్ రాయల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్' నోబెల్ ప్రకటించింది. 3.7 బిలియన్ సంవత్సరాలకు ముందు ఈ భూమి మీద జీవం ఆవిర్భవించింది. వాతావరణానికి అనుగుణంగా తనను తాను మార్చుకుంటూ పరిణామం చెందుతూ వస్తూ వుందని డార్విన్ సూత్రం చెబుతోంది. ఉదాహరణకు ధృవప్రాంతాల్లో ఉన్న చేపల రక్తంలో 'యాంటీఫ్రీజ్ ప్రొటీన్' ఉండడం వల్ల, నీరు గడ్డకట్టి ఉన్నా అవి అక్కడ సులభంగా ఈదగలుగుతున్నాయి. ఇతర ప్రాంతాల్లోని సముద్రపు చేపలకు ఆ సౌలభ్యం ఉండదు. ఎందుకంటే వాటి రక్తంలో యాంటీ ఫ్రీజ్ ప్రొటీన్లు అభివృద్ధి కాలేదు. ధృవ ప్రాంతపు చేపల రక్తంలో ఆ పరిణామం జరిగిందన్నమాట!

మేరీ క్యూరీ 1911లో నోబెల్ సాధించిన తొలి మహిళా శాస్త్రవేత్త. ఆమె తర్వాత నోబెల్ స్వీకరించిన ఫ్రాన్సెస్ హెచ్ ఆర్నాల్డ్ ఐదవ మహిళ. ఈమె పరిశోధనల వల్ల మానవాళికి గొప్పమేలు జరగబోతోంది. నోబెల్ బహుమతికి ఇచ్చే ప్రయిజ్ మనీ తొమ్మిది మిలియన్‌ల స్వీడిష్ క్రోనాలో, సగభాగం ఫ్రాన్సెస్ హెచ్ ఆర్నాల్డ్(62)కు దక్కితే, జార్జ్ పి స్మిత్ (77), సర్ గ్రిగరీ పి వింటర్ (67) అనే మరో ఇద్దరు శాస్త్రవేత్తలకు మిగతా సగం డబ్బు సమానంగా పంచారు. దానితో 2018 సంవత్సరానికి రసాయనిక శాస్త్ర విభాగానికి నోబెల్ బహుమతి ముగ్గురికి లభించినట్లయ్యింది. మహిళా శాస్త్రవేత్త ఫ్రాన్సెస్ ఆర్నాల్డ్ అమెరికాలోని పసడినాలోని కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్. తొలి దశలో ఇంజనీర్‌గా సౌరశక్తిపై కృషి చేస్తుండేవారు. అప్పుడే వైజ్ఞానిక ప్రపంచంలో చాలా మంది పరిశోధకులు డిఎన్ఏ టెక్నాలజీ గురించి విరివిగా చర్చలు జరుపుతుండేవారు. ఇక భవిష్యత్తు అంతా డిఎన్ఏ పరిశోధనల మీదే ఉండబోతూ ఉందని గ్రహించిన ఆమె, జీవశాస్త్రం వైపు దృష్టి మరల్చారు. ఒక ఎయిర్‌స్పేస్ ఇంజనీర్ స్వయంగా జీవశాస్త్ర మూల సూత్రాలు తెలుసుకుని, అధ్యయనం చేసి, పరిశోధనలు చేసి, అందులో అత్యున్నత స్థాయికి చేరుకుని, నోబెల్ సాధించడం మామూలు విషయం కాదు. తొలి దశలో ఆమె అనుకున్న విధంగానే ఒక కొత్త సాంకేతిక విజ్ఞానాన్ని మానవాళికి అందించారు. తన ఇంజనీరింగ్ పరిజ్ఞానం ఎంజైముల ఇంజనీరింగ్‌కు అన్వయించి, నూతన ఎంజైముల ఆవిష్కరణకు దారులు వేశారామె.

ఇతర విషయాలలో చదువు కొనసాగించి, జీవశాస్త్రంలోకి రావడం వల్ల ఫ్రాన్సెస్ ఆర్నాల్డ్, ఇతర జీవ శాస్త్రవేత్తలు ఆలోచించిన విధంగా కాకుండా ఒక నూతన దృక్పథంతో జీవపరిణామాన్ని చూడగలిగారు. అలాగే పరిష్కరించగలిగారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రకృతి చర్యలకు విరుద్ధంగా ఉపయోగించకుండా వాటికి అనుగుణంగా పరిశోధనలు కొనసాగించడమే సబబు-అని ఆమె నిశ్చయించుకున్నారు. దానికి తోడు 'క్వాంట' పత్రికలో 'జీవ పరిణామమనగానే వేలవేల ఏళ్ల క్రితం అంతరించి పోయిన శిలాజాల అధ్యయనమని చాలా మంది అనుకుంటారు. కానీ, అలా కాకుండా పరిణామ చర్యలను రసాయనిక ప్రయోగశాలలో జరిపిస్తే మంచి ఫలితాలు వస్తాయేమో! పరిణామం అంటే అంతదాకా ఉన్న ఆలోచనలు మారతాయేమో! కొత్త ఫలితాలు వస్తాయేమో!' అని ఆర్నాల్డ్ పూర్వ విద్యార్థి జెస్సీ బ్లూమ్ రాసిన వ్యాసం ఆమెను ఆలోచనలో పడేసింది. పరిణామానికి దారి తీసే విలువైన ఏ అణువు కూడా ఏ రసాయనిక శాస్త్రవేత్త ఏ ప్రయోగశాలలో తయారు చేయలేదు. సహజ సిద్ధంగా ప్రకృతిలో జీవ ప్రపంచమే తయారు చేస్తూ వుంది. అంటే ప్రయోగశాలలో అయినా సరే, అణువుల తయారీ జీవులతోనే తయారు చేయించాలి-అనే వాస్తవాన్ని ఆమె గ్రహించారు.

1980లో ఫ్రాన్సిస్ ఆర్నాల్డ్ బాక్టీరియాకు చెందిన ఒక ఎంజైమ్ సబ్టిలిసిన్‌ను పునర్నిర్మించారు. అది నీటిలో లేక సంబంధించిన ఇతర ద్రవాలలో కాకుండా డి మిథైల్ ఫార్మాల్డిహైడ్ వంటి ఆర్గానిక్ ద్రావకాలలో కరిగే విధంగా చేశారు. ఇతర జీవశాస్త్రవేత్తల వలే జన్యు లిపి మార్చే ప్రయత్నం చేశారు. అయితే ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. తరువాత చేసిన ప్రయత్నాలలో ఎంజైమ్ జెనెటిక్ కోడ్‌లో 'రాండమ్ మ్యుటేషన్స్'ను సృష్టించారు. బాక్టీరియాలో వేల వేల రకాల సబ్టిలిసిన్‌లు తయారయ్యాయి. అలా చేయగా, చేయగా ఒక సబ్టిలిసిన్ రకం 256 రెట్లు డిఎంఎఫ్‌లో బాగా పని చేసింది. ఈ ప్రయత్నాల వల్ల జీవ పరిణామాన్ని మనం 'సూచించిన' విధంగా జరిపించొచ్చు అనే ధీమా ఆమెకు కలిగింది. అదే నిర్ధారించబడింది. డార్విన్ సూత్రాన్ని ప్రయోగ నాళికలో ప్రవేశపెట్టి సహజంగా చాలా ఆలస్యంగా జరిగే జీవ పరిణామాన్ని వెయ్యిరెట్లు వేగవంతం చేసి ఫలితం సాధించారన్నమాట! దీన్నే 'నిర్దేశించిన' పరిణామం అని అనొచ్చు. జన్యువుల ఎన్నికను, వాటి మార్పును నిర్దేశించి, అవసరమైన ప్రొటీన్లు అభివృద్ధి పరుచుకుని, ఎప్పుడో జరగబోయే పరిణామ దశలను నిర్దేశించి త్వరగా జరిగేట్లు చేయడమన్నమాట! విలియం పిసి స్టెమ్మర్ అనే డచ్ పరిశోధకుడు కూడా డిఎన్ఎ షఫ్లింగ్ చేసి, ఇవే ఫలితాలు సాధించారు. కానీ, ఆయన తన 56వ ఏట 2013లోనే కన్ను మూశారు. అందువల్ల ఆయనకు నోబెల్ తప్పి పోయింది.

డిఎన్ఎలను తిరగరాయడం వల్ల ఫ్రాన్సెస్ ఆర్నాల్డ్ ప్రయోగశాలలోని ప్రయోగనాళికలో అద్భుతమైన ఫలితాలను సాధించారు. పర్యావరణానికి ఏ మాత్రం హాని కలిగించని జీవ ఇంధనాలను తయారు చేయగలిగారు. అతి చల్లటి నీటిలో కూడా సమర్థవంతంగా పని చేయగల వాషింగ్ డిటర్జెంట్స్ ఉత్పత్తి చేయగలిగారు. అంత చేసినా ఆ విజయాన్ని ఆమె తన ఖాతాలో వేసుకోలేదు. 'ఇవి నేను స్వతహాగా సృష్టించిన నమూనాలేమీ కావు. ప్రకృతిని అర్థం చేసుకుని, ప్రకృతి నమూనాలకు ప్రతిరూపాలు చేయగలగడమే నేను సాధించిన విజయం' అని ఆమె ఎంతో వినమ్రంగా ప్రకటించుకున్నారు. ప్రకృతి సూత్రాలను అర్థం చేసుకోవడం ఒక ఎత్తయితే, దాని ద్వారా మానవాళికి మహోపకారం చేయగలగడం మరొక ఎత్తు. అంత చేసినా ప్రకృతికి ఒదిగి ఉండడం మరో గొప్ప సంస్కారం! తమకు తప్ప ఇతరులకు ఎవరికీ ఏ విధంగానూ ఉపయోగపడని పనులు చేసి గొప్ప మానవ సేవ చేస్తున్నామని ప్రకటించుకునే వారిని ఏమందాం? మనిషి అనాలోచితంగా ఎంత దుర్మార్గంగా ప్రవర్తించినా ప్రకృతి అన్నింటినీ చక్కబెట్టుకుంటూ వస్తూ వుంది. అందుకైనా మనుషులు ప్రకృతి పట్ల కృతజ్ఞతా భావంతో మసలుకోవాలి. భూమిలోనూ, పర్యావరణంలోనూ ఎక్కడా కలిసి పోని/కరిగిపోని ప్లాస్టిక్స్, ఫెస్టిసైడ్స్, హర్బిసైడ్స్, యాంటీ బయాటిక్స్ విపరీతంగా వదిలేస్తున్నాం. దానికి పరిష్కారమేమిటీ? వాటిని నిర్మూలించగలిగే ఒక కొత్త ఎంజైమ్‌ను ఈ శాస్త్రవేత్త కనుక్కోగలిగారు.

ఇదిలా వుండగా అమెరికాలోని కొలంబియా మిస్సోరి యూనివర్సిటీకి చెందిన జార్జ్ పి స్మిత్, బ్రిటన్‌లోని కేంబ్రిడ్స్-యం ఆర్ సి లేబరేటరీ ఆఫ్ మాలిక్యులర్ బయాలజీకి చెందిన సర్ గ్రిగరీ సి వింటర్ (67) వేరు వేరుగా రసాయనిక శాస్త్రంలో మరో అద్భుతాన్ని సాధించారు. బాక్టీరియా ఫాగీని రూపొందించారు. ఇది కొత్త ఎంజైములను రూపొందించుకోగలదు. ఈ బాక్టీరియాపై జరిగిన పరిశోధనలు వల్ల మందుల ఉత్పత్తిలో కొన్ని విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు చక్కని మందు తయారైంది. అది మార్కెట్లోకి కూడా వచ్చింది. కొన్ని రకాల క్యాన్సర్‌లకు ఉపశమనం లభించబోతోంది. కొన్ని రకాల విషపదార్థాల ప్రభావం శరీరంపై పడకుండా కాపాడబడతాయి. నోబెల్ బహుమతి స్థాపించిన ఆల్‌ఫ్రెడ్ నోబెల్ స్వయంగా ఒక రసాయనిక శాస్త్రవేత్త. ఆయన పేరుతో ఉన్న ఈ బహుమతిని మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు అందించిన ఇలాంటి రసాయనిక శాస్త్రవేత్తలకు అందడం చాలా సబబుగా వుంది. డార్విన్ సిద్ధాంతం పనికిరాదని, ఈ దేశంలోని విద్యా సంస్థల్లో దాన్ని పాఠ్యాంశంగా బోధించకూడదన్న గౌరవ ప్రభుత్వ మూర్ఖులకు ఈ నోబెల్ బహుమతి ఒక చెంపదెబ్బ!

(రచయిత బయాలజీ ప్రొఫెసర్, మెల్‌బోర్న్ నుంచి)

నేలన విరిసిన ఇంద్రధనుస్సులు



సాధారణ రోజుల్లో అయితే.. కళ్ళాపి జల్లిన వాకిళ్ళలో.. రెండు మూడు చుక్కలతో.. మొక్కుబడిగా చిన్న ముగ్గు కనపడొచ్చుగాక.. కానీ సంక్రాంతి రోజులు జొరబడ్డాక మాత్రం 'వీధి.. వీధి నాదే బ్రదర్..' అన్నట్టుగా హరివిల్లు విరిసినట్టుగా తెలుగింటి వాకిళ్ళన్నీ.. ఇంద్రధనస్సులా మారిపోతాయి. పొద్దుపొడవని ఊరుంటే ఉండొచ్చుగానీ.. ముగ్గుపడని ఊరుండదంటే అతిశయోక్తి కాదేమో! 'అసలు.. ఈ ముగ్గు ఎవరు కనిపెట్టారండీ బాబూ..?' అనే ప్రశ్న ఉత్పన్నమైనప్పుడు.. క్రీస్తుపూర్వానికి దాటివెళ్ళినా.. అంతుపట్టని ప్రశ్నగానే మిగిలిపోవచ్చు. ముగ్గు అల్లిక అనేది.. అసలు ముందుగా అతివల చేతుల్లో అల్లుకున్నదా? లేక పురుషుల మేధస్సులోంచి పుట్టిందా? అనేది కచ్చితంగా చెప్పనే చెప్పలేం. చరిత్ర పుస్తకాలు తిరగేస్తే.. నాగరికత ఆరంభంలో కుడ్య చిత్రాల్లోనూ ఈ ముగ్గుల అల్లికల ఛాయలు కనపడతాయి. గిరిపుత్రుల గూడులో అలంకారపు ముద్రలుగానూ ముగ్గుల్ని పోలిన కళాకృతులు తారసపడతాయి. ఇలా కొండ.. కోనలు దాటి.. అనేక రూపాల్లో విస్తరించి.. నాగరికత నేర్చిన బొమ్మగా మారిన ముగ్గుల అల్లిక తరతరాల అనుబంధానికి ప్రతీక. దేశానికి రాణియైనా ముగ్గు అంటే.. ముగ్ధురాలవ్వకుండా ఉండరు. పదండి.. సంక్రాంతి సంబరాల వేళ.. ముగ్గుల అల్లికల్లో నిలువు, అడ్డగీతల చుక్కలు చెప్పే చక్కని జ్ఞాపకాలను నెమరేసుకుందాం!

మన ఇంటి వాకిట ముగ్గును తదేకంగా చూస్తే.. మనందరి మదిలో అనేకానేక ఊహలు కదలాడతాయి. ఆ ఊహల్లో నీలిగగనపు అంచున తేలియాడే కథలు.. ఆ కథలు చెప్పే అనుభవాలు.. ఆ అనుభవాల్లోంచి గుప్పెడు ఇంద్రధనస్సు సోయగాలు.. రంగులమయమై కళ్ళకు కట్టకమానవు.

నేలపై వాలిన హరివిల్లులా ...

బహుశా.. మన పెద్దలు ఇంటివాకిట విరిసిన రంగవల్లుల్ని హరివిల్లుగా అభివర్ణించడానికి కారణాలు ఇవే కావొచ్చు. అందుకే సంక్రాంతి ముగ్గును.. కేవలం పిండివన్నెలు దిద్దిన సాదాసీదా ముగ్గుగానే చూడలేం. ఇంకా ఏదో దాగుంది. ఎంతగా అంటే 'ఆకాశాన వేలాడే నక్షత్రాలను సైతం నేలపైకి దించేస్తున్నామేమో..' అని సంబర పడేంతగా మనం ముగ్గుల్లో తరిస్తాం. అందుకు కారణాలు లేకపోలేదు. నిజానికి ముగ్గు ఎవరు కనిపెట్టారనే విషయం తేలినా తేలకపోయినా.. నేనైతే 'ముగ్గు' అనే ఈ అద్భుత కళను.. మా అమ్మే కనిపెట్టిందంటాను. నేనే కాదూ.. మీరూ మీ అమ్మలు తీర్చిదిద్దిన అనేక ముగ్గుల్లో తరించినవారే. ముగ్గు అనగానే.. నాటి వాకిలే మన కళ్ళముందుకు వస్తుంది. అదిగో అమ్మ.. ఇంటివాకిట ముగ్గేస్తుంది. అవును ఊహ తెలిసినప్పటి నుంచీ ముగ్గేస్తుంది. ఇంటి వాకిట్లోనే తనకు తెలిసిన కళాత్మక లయవిన్యాసాన్ని కళ్ళకు కడుతుంది.

చుక్కలు తెంచి.. అద్భుతాలు పంచి

కాసేపు అలా నిన్నటి బాల్యంలోకి వెళ్ళిపోదాం.. 'అదిగో.. అదిగో.. ఆ ముగ్గు చూడ్డానికి ఎంత బావుంది. ఏమని వర్ణించాలి? అమ్మకు ఇంతలా అద్భుతాలు చేయడం ఎలా తెలుసబ్బా?!' అలా.. అమ్మ ఒక ముగ్గమ్మలా మనల్ని ఆశ్చర్యాలకు గురిచేస్తూ.. నేలపై అద్భుతాలు చేస్తున్నప్పుడే మన చేతివేళ్ళూ అలా నేలపై కదలాడి.. చుక్కల ముగ్గులేయడానికి ఆరాటపడ్డాయి. ఆనక ఆరితేరిన ముగ్గులయ్యాయి. సీతాలు, సుబ్బలక్ష్మి, కవిత, లలిత, భవానీ, కుమారి, ఫాతిమా, పద్మ మాత్రమే కాదు; తమ్ముడు శీను, చందు, ఉదయశంకర్, కొత్త పెళ్ళికొడుకు ప్రభాకర్ ... ఇలా మనమంతా.. నాడు అమ్మతో కలిసి ముగ్గులేయాలని పరివిధాలుగా తపించ లేదా? అది మాటలకందని అనుభవం. ఇలా చెప్పుకుంటూపోతే.. ముగ్గుల జ్ఞాపకాల దొంతరలు ప్రతి ఒక్కరి జీవితంలోనూ అనేకం.

గణాంకాలకు దొరకని అల్లిక

ఇంటివాకిట్లో.. అక్కాచెల్లెలో.. కళ్ళాపు చల్లి.. అమ్మనో, చెల్లాయినో, అక్కనో ముగ్గేస్తుంటే.. ఇంటిగేటు పట్టుకుని వేలాడే అబ్బాయిలకు భలే సంబరం. ఆకాశాన ఉండే చుక్కలు నేలమీదకు ఎలా వాలిపడ్డాయబ్బా?.. ఇలా అనేకానేక డౌటులు కూడా. అదే సీక్రెట్ మరీ. బహుశా అమ్మకు బోల్డన్ని లెక్కలు వచ్చుండొచ్చు.. వందల చుక్కల్ని కలిపి.. ఒడిసిపట్టి.. గీతలన్నింటితో నాట్యం చేయించే ఏదైనా గొప్ప కళ తెలుసుండొచ్చు. ఆ గుట్టేదో.. అమ్మమ్మనో.. నాయినమ్మనో అడగాల్సిందే. ఇది అమ్మ నుంచి వారసత్వంగా వస్తున్న మాయాజాలపు కళ.

రంగవల్లులు అద్దే ఎవరైనా సరే.. చేయి తిరిగిన చిత్రకారులే. ఆమాటకొస్తే అంతకుమించి కూడా. పిండి చుక్కల్లో ఎన్నెన్ని చిత్రాలు. పరిమళించే పూలు, పలకరించే హంసలు, కొక్కొరోకో కోడిపుంజులు.. బుజ్జి బుజ్జి బాతులు.. భారీ అంబారీలు.. పురివిప్పే మయూరాలు, ఒంపులు తిరిగే లతలు, పారిజాతాలు, మిలమిల్లాడే మీనాలు.. ఇలా చెప్పుకుంటూ పోతే.. ముగ్గుల్లో ఒదిగిపోయే ప్రకృతి పరవశం అంతా ఇంతా కాదు. అమ్మ, అక్క, చెల్లి, భార్య, వదిన, అత్తమ్మ, బామ్మ.. ఆలోచనల్లో మెరిసే.. విరిసే ముగ్గులన్నీ ప్రపంచ అద్భుతాలే!

రథంపై.. వీధుల్లో చక్కర్లు

'అదిగో.. మన పొరుగింటావిడ పెట్టిన ముగ్గు ఎంత బావుందో.. చూశారూ? ఏమైనా సరే.. ఆవిడ కంటే మంచి ముగ్గు పెట్టాల్సిందే. వీధి వీధంతా.. నా ముగ్గు గురించి చెప్పుకోవాల్సిందే..!' అనే పోరాటపటిమ చూస్తే.. ముగ్గులు సైతం సరదాగా.. చిక్కగా నవ్వుకుంటాయేమో? ఒకరికిమించి ఒకరు వేసిన ముగ్గు అదిరిపోవాలనే కళాత్మకమైన కసి ఉంది చూశారు... ఆ ముగ్గుల పోటీలో ఉండే రోషమే వేరబ్బా! అది నేలపై చుక్కలు పెట్టి.. వంగి వంగి రేఖల్ని గీస్తేనే అర్థమవుతుంది. ఇలా పొరుగింటి ఇళ్ళను.. ఆ ఇళ్ళల్లోని మనుషులను.. సరదాగా.. కొంచెం అసూయగా.. ఇంకొంచెం రోషంగా కలగలుపుతూ అల్లుకుపోయే రథం ముగ్గు గురించి ఎన్ని చెప్పినా తక్కువే. అప్పుడైతే డ్రోన్ కెమెరాలు లేవు. ఉంటేనా.. ఆ అద్భుతాలన్నీ ఏకబిగువున బంధించేవాళ్ళం. ఈతరం పిల్లలకి.. నాడు ఊరంతా తిరిగొచ్చిన రథం ముగ్గు గొప్పతనాన్ని టీవీ తెరలపై.. తెరలు తెరలుగా చూపించేవాళ్ళం. ఇప్పుడు సెల్ఫీలొచ్చాయి. ముగ్గుల్లోనూ స్వార్థం పెరిగింది. ఎవరి గుమ్మాల్లో వాళ్ళే సెల్ఫీలు దిగుతున్నారు. రథం ముగ్గును కలిపే తీరిక ఉండటం లేదు కానీ.. నాటి అనుబంధపు చుక్కల్ని మళ్ళీ కలపాలి... కలగలుపుకోవాలి..

ఒకటి మాత్రం నిజమబ్బా..! తెలుగోళ్ళు, మలయాళపోళ్ళు, తమిళోళ్ళు.. హిందీవోళ్ళు.. ఇలా ఎవరెలా ముగ్గులు గీసినా.. ఆ.. అరవిరిసిన గీతల్లో వణుకుండదు. ఆ ఒంపుల్లో తిరిగే మెలికల్లో తడబాటుండదు. ఇంతకంటే ఘనాపాటి చిత్రకారులు ఇంకెవరుంటారు?! ముగ్గు కేవలం.. నేలపై విచ్చుకునే సంప్రదాయం మాత్రమేకాదు; ఊరిలో ఆ చివరి నుంచి ఈ చివరిదాకా మనల్ని, మన మనసుల్ని.. కలగలిపే సామాజిక రథం. అందుకే మన 'జీవన' రమణుల రంగవల్లికలకు వెయ్యాలి వేలవేల వీరనారీతాళ్ళు!

- గంగాధర్ వీర్ల
















జీవన చిత్రం
ఫొటో : టి.వి. రమణ

జీవన సౌరభం

క్షమాపణ కోరడమంటే మనం తప్పు చేసినట్లు కాదు. మనం మన బంధానికి ఎక్కువ విలువిస్తూ ఉన్నామని అర్థం.

మీకోసం

పేస్టులో, బేకింగ్ సోడా వేసి కలిపి పళ్లపై రాసి, పావుగంట తర్వాత నీళ్లతో పుక్కిలిస్తే తళతళ మెరుస్తాయి.



19 చుక్కలు,19 వరుసలు





మద్దుల పద్మావతి,
కొత్తపేట,
తెనాలి,
గుంటూరు జిల్లా.

రూ.33వేల దిగువన పసిడి..

న్యూఢిల్లీ : వరుసగా రెండో రోజూ పసిడి ధర తగ్గి రూ.33వేల దిగువన చోటు చేసుకుంది. శనివారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.155 తగ్గి వరుసగా 32,875, రూ.32,725 వద్ద నమోదయ్యింది. ఇంతక్రితం సెషన్‌లోనూ కూడా స్వల్పంగా రూ.40 తగ్గింది. అంతర్జాతీయంగా న్యూయార్క్‌లో ఒక్క ఔన్స్ పసిడి ధర స్వల్పంగా తగ్గి 1,287.80 డాలర్లుగా నమోదయ్యింది. తాజాగా కిలో వెండిపై రూ.600 క్షీణించి రూ.39,850గా పలికింది.

కెనాన్ ఇండియా కొత్త మెషిన్..

ప్రముఖ ఇమేజింగ్ ప్రింటింగ్ సంస్థల్లో ఒక్కటైన కెనాన్ ఇండియా తొలిసారి హైదరాబాద్‌లోని ఐకార్డ్స్ ప్రింటర్స్‌లో మొదటి 80పి పిఎం ఇమేజ్ ప్రెస్ సి8000 విపి ని ఏర్పాటు చేసింది. దీన్ని కెనాన్ ఇండియా ప్రొఫెషనల్ ప్రింటింగ్ ప్రొడక్ట్స్ డైరెక్టర్ పునీత్ దత్తా ప్రారంభించారు. డిజిటల్ కలర్ ప్రింటింగ్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ మెషిన్ దోహదం చేస్తుందన్నారు.



ప్రత్యేక ప్రణాళికలతో రుణ రికవరీ..

సిండికేట్ బ్యాంకు సిఇఒ వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

నిరర్థక ఆస్తుల సమస్యను పరిష్కరించుకొనేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్టుగా సిండికేట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ గత సెప్టెంబరు నాటికి బ్యాంక్ 12.9 శాతం స్థూల, 6.8 శాతం నికర నిరర్థక ఆస్తులను కలిగి ఉందని తెలిపారు. అయితే మార్చి ముగింపు నాటికి వీటిని తగ్గించుకొనేందుకు సమ్మిళితంగా తాము ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్టుగా ఆయన తెలిపారు. ఇందులో భాగంగా 1500 మంది ఉద్యోగులతో రుణ వసూలు బృందాలను తయారు చేసినట్టుగా మహాపాత్ర వెల్లడించారు. దీనికి తోడు ఎనిమిది ప్రత్యేక శాఖలు రుణ రికవరీ కోసం ప్రత్యేకంగా పని చేస్తున్నట్టుగా ఆయన వివరించారు. ఈ ప్రత్యేక శాఖలు నేరుగా కార్పొరేట్ కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతు రుణ రికవరీ ప్రక్రియను ముందుకు తీసుకుపోతున్నట్టుగా ఆయన వివరించారు. వచ్చే మూడు నుంచి ఆరు నెలల కాలంలో నిరర్థక ఆస్తుల నుంచి దాదాపు రూ.1500 కోట్ల రుణాలను రికవరీ చేయగలమన్న విశ్వాసాన్ని ఆయన ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. ఎన్‌సిఎల్‌టి, ఎన్‌సిఎల్‌టి యేతర మార్గాల ద్వారా రుణాల రికవరీ జరపనున్నట్టుగా ఆయన వివరించారు.

బిగ్‌సిలో సంక్రాంతి వినూత్న ఆఫర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ రిటైల్ మొబైల్ సంస్థ బిగ్‌సి సంక్రాంతి పండుగ సందర్భంగా వినూత్న ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్లలో భాగంగా ఎంపిక చేసిన మొబైళ్లపై విలువైన బహుమతులతోపాటు సున్న శాతం వడ్డీ, డౌన్‌పేమెంట్‌లు, ప్రాసెసింగ్ ఫీజు వంటి ఆకర్షణీయమైన రుణ సదుపాయాన్ని అందచేస్తున్నామని బిగ్‌సి ఒక ప్రకటనలో తెలిపింది. వీటితోపాటు బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసిన ప్రతి మొబైల్‌పై 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్, స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.2,200 వరకు జియో క్యాష్ బ్యాక్, 30 జిబిల డాటాను ఉచితంగా అందిస్తున్నది. ఎంపిక చేయని మొబైళ్లు కొనుగోలు చేసిన వారికి కూడా ఒకసారి స్క్రీన్ రీప్లేస్‌మెంట కల్పిస్తోంది. సామ్‌సంగ్ గెలాక్సీ జె6, జె6 ప్లస్, ఏ7 మొబైళ్ల కొనుగోళ్లపై 10 శాతం క్యాష్‌బ్యాక్, బజాజ్ ఫైనాన్స్ ఇఎంఐ సదుపాయం, టీవీఎస్ క్రెడిట్ సులభంగా ఈఎంఐ లభించనున్నది. ఒప్పో ఎఫ్9 ప్రొ మొబైల్‌పై రైస్‌కుక్కర్, అన్ని వివో మొబైళ్లపై సర్‌ప్రైజ్ గిఫ్ట్, రూ.1,590 విలువైన కార్బన్ కె3 బూమ్ మ్యాక్స్ మొబైల్‌ను రూ.2,500 విలువైన పెడెస్టాల్ ఫ్యాన్‌ను ఉచితంగా అందిస్తున్నది. ప్రతి మొబైల్ కొనుగోలుపై ఒక కచ్చితమైన బహుమతి కూడా అందిస్తున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది.

ఫోన్‌పేలో లక్ష ఆఫ్‌లైన్ రిటైలర్లు

హైదరాబాద్ : డిజిటల్ చెల్లింపుల వేదిక ఫోన్‌పే తెలుగు రాష్ట్రాల్లో 1.4 లక్షల రిటైల్ వర్తకులను నమోదు చేసిందని ఆ సంస్థ వెల్లడించింది. ఇందులో చిన్న, మధ్య తరహా స్టోర్లు ఎక్కువగా ఉన్నాయని ఫోన్‌పే ఆఫ్‌లైన్ ఆర్గనైజుడ్ బిజినెస్ హెడ్ యువరాజ్ సింగ్ షెకావత్ పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి యుపిఐ, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్లు తదితర బహుళ పద్ధతుల చెల్లింపులను ఫోన్‌పే అంగీకరిస్తుందన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో క్యూఆర్ కోడ్ ఇతర సమీకృత చెల్లింపుల పరిష్కారాలను ఆమోదిస్తుందన్నారు. ముఖ్యంగా కిరాణ, ఇంధన, మెడిసిన్ తదితర ఆర్గనైజుడ్ అవుట్‌లెట్లలో భారీగా పెరిగామన్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా రోజుకు కోటి పైగా లావాదేవీలు జరుగుతున్నాయని అనార్గనైజుడ్ బిజినెస్ హెడ్ వివేక్ లొచ్చెబ్ పేర్కొన్నారు. 2019 మార్చి నాటికి నాలుగు రెట్లు పెరిగి 40 మిలియన్ లావాదేవీలకు చేరొచ్చన్నారు.



ఎయిరిండియా ఆదాయంలో వృద్ధి

- 2018-19 క్యూ3లో 20% పెరుగుదల
- 55 లక్షల ప్రయాణికుల నమోదు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా ఆదాయంలో పెరుగుదల చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో కంపెనీ రెవెన్యూలో 20 శాతం వృద్ధి నమోదయ్యింది. కాగా ప్రయాణికుల సంఖ్యలో మాత్రం 4 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. ఉన్న విమానాలను చక్కగా, ప్రయోజనకరంగా ఉపయోగించుకోవడం వల్ల ఈ ఆదాయం పెరిగిందని ఎయిరిండియా ఉన్నతాధికారి ఒక్కరు తెలిపారు. 2018-19 క్యూ3లో ప్రయాణికుల నుంచి రూ.5,538కోట్ల రెవెన్యూ వచ్చిందన్నారు. 2017-18 ఇదే డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.4,615కోట్ల ఆదాయం నమోదయ్యిందన్నారు. ఇదే సమయంలో 53.28లక్షల ప్రయాణికులను గమ్యానికి చేర్చామని, కాగా 2018-19 క్యూ3లో ప్రయాణికుల సంఖ్య 55.27లక్షలుగా నమోదైందన్నారు. దీంతో ప్రయాణికుల సంఖ్యలో 4శాతం పెరుగుదల చోటు చేసుకుందన్నారు.

క్రితం డిసెంబర్ త్రైమాసికంలో కొత్తగా 15 విమాన సర్వీసులను ప్రారంభించినట్లు ఆ అధికారి వెల్లడించారు. సంస్థ మొత్తం ఆదాయంలో 65శాతం అంతర్జాతీయ మార్గాల ద్వారా నుంచి లభిస్తోందన్నారు. మిగితా ఆదామం దేశీయ రూట్ల నుంచి నమోదవుతుందన్నారు. ఎయిరిండియా దాదాపు రూ.48వేల కోట్ల అప్పుల్లో ఉంది. గతేడాది ఎఐలోని 74 శాతం వాటా విక్రయానికి మోడీ సర్కార్ ప్రయత్నం చేసినప్పటికీ.. ఈ వాటా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు.

ఇకపై ఎఐకి అప్పులు పుట్టడం చాలా కష్టమని శుక్రవారం నాడు పౌర విమానయాన శాఖ మంత్రి సురేష్ ప్రభూ పేర్కొన్నారు. ఇక అప్పులైన, వడ్డీలైనా ఎయిరిండియా తన రెవెన్యూ నుంచే భరించుకోవాలన్నారు. అప్పుల సమస్యల వల్ల ఎఐ ఎప్పుడూ లాభదాయకతలో లేదన్నారు. ఈ సంస్థ అప్పుల సమస్య పరిష్కారానికి తాము ఆర్థిక మంత్రిత్వ శాఖతో కలిసి పని చేస్తామన్నారు. ప్రస్తుతం 122 విమానాలు ఉన్న ఎఐ గత 2007లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌ను విలీనం చేసుకుంది. అప్పటి నుంచి ఈ సంస్థ నష్టాలను చవి చూస్తుంది. ఎఐని కొత్త అంచుల్లోకి తీసుకెళ్లడానికి మేనేజ్‌మెంట్ విధానంలో మార్పులు చేయనున్నామని మంత్రి తెలిపారు.

వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20)లో ఎఐకి చెందిన రూ.7,000 కోట్ల ఆస్తులను విక్రయించడానికి మోడీ సర్కార్ మరోమారు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఎఐకి చెందిన అనుబంధ సంస్థల్లోని వాటాలను వచ్చే సెప్టెంబర్ తర్వాత ఉపసంహరించుకోవడానికి కసరత్తు జరుగుతుందన్నారు. ఇప్పటికే ముంబయిలోని ఎయిర్‌లైన్స్ హౌస్, ఢిల్లీ, వసంత్‌విహార్, బాబా ఖరక్‌సింగ్ మార్గ్, కన్నాట్ ప్రాంతాల్లోని ఆస్తులను విక్రయించడానికి మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. అదే విధంగా దేశవ్యాప్తంగా 70 నివాస, వాణిజ్య స్థలాల విక్రయం ద్వారా రూ.700-800కోట్లు సమీకరించాలని ఎఐ యోచనగా ఉంది.

20 నుంచి అమెజాన్‌లో గ్రేట్ ఇండియన్ సేల్

హైదరాబాద్ : ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు గ్రేట్ ఇండియన్ సేల్‌ను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఇందులో ఎలక్ట్రానిక్స్‌పై 60 శాతం వరకు తగ్గింపును అందించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే పలు ఉత్పత్తులపై నో కాస్ట్ ఇఎంఐ, ఎక్స్‌చేంజ్ సదుపాయాలను ప్రకటించింది. సేల్‌లో భాగంగా హెచ్‌డిఎఫ్‌సి కార్డులతో ఐటమ్స్‌ను కొనుగోలు చేస్తే అదనంగా మరో 10 శాతం రాయితీ కూడా అందిస్తుంది. అదే విధంగా వన్‌ప్లస్ 6టి, హానర్ 8ఎక్స్, రెడ్‌మీ వై2, హువావే నోవా 3ఐ, వివో వై9 ప్రొ ఫోన్లపై డిస్కౌంట్లను ఆఫర్ చేస్తుంది. ఈ సేల్‌లో హార్డ్ డిస్కులు, హెడ్‌ఫోన్లు, గేమింగ్ యాక్ససరీలపై 60 శాతం వరకు డిస్కౌంట్‌ను ఇస్తారు. అలాగే ల్యాప్‌టాప్‌లపై రూ.35వేల భారీ డిస్కౌంట్, కెమెరాలపై రూ.5వేల డిస్కౌంట్, యాక్టివిటీ ట్రాకర్లు, స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్ టీవీలు, లార్జ్ స్క్రీన్ ఎల్‌ఈడీ టీవీలపై 50 శాతం వరకు డిస్కౌంట్లను అందివ్వనున్నారు. వీటితోపాటు ప్రింటర్లు, స్పీకర్లు, ట్యాబ్లెట్ పిసిలపై 40 శాతం, సౌండ్ బార్స్‌పై 30 శాతం వరకు రాయితీలను అందిస్తున్నట్లు పేర్కొంది.

సిటీ బ్యాంకుకు ఆర్‌బిఐ జరిమానా

న్యూఢిల్లీ : అమెరికా ప్రధాన కేంద్రంగా సేవలు అందించే సిటీ బ్యాంకుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) రూ.3 కోట్లు జరిమానా విధించింది. సమర్థులైన డైరెక్టర్లను నియమించడానికి రూపొందించిన 'ఫిట్-అండ్-సబ్జెక్ట్ క్రైటీరియా' నిబంధనలను పాటించకపోవడంతో ఆర్‌బిఐ ఈ నిర్ణయం తీసుకుంది. డైరెక్టర్ల నియామకంలో నిబంధనలు పాటించకపోవడంతో 2019 జనవరి 3న రూ.3 కోట్ల జరిమాన విధించింది. భారత్‌లో 115 ఏళ్లుగా సేవలందిస్తున్న సిటీ బ్యాంకుకు ఇక్కడ 35 శాఖలున్నాయి.

ఐడిఎఫ్‌సి బ్యాంకు పేరు మార్పు

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని ఐడిఎఫ్‌సి బ్యాంకు పేరును ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు లిమిటెడ్‌గా మార్చారు. ఈ మార్పు జనవరి 12 నుంచే అమల్లోకి వచ్చిందని శనివారం ఆ బ్యాంకు బిఎస్‌ఇ ఫైలింగ్‌లో తెలిపింది. పేరు మార్పునకు రిజిస్ట్రర్ ఆఫ్ కంపెనీస్ అనుమతి కూడా తీసుకున్నట్లు పేర్కొంది. ఐడిఎఫ్‌సి బ్యాంకు, బ్యాంకింగేతర విత్త సంస్థ కాపిటల్ ఫస్ట్ క్రితం డిసెంబర్ 18న విలీనం అవుతున్నట్లు ప్రకటించాయి. దీంతో ఇరు సంస్థల ఉమ్మడి రుణ పుస్తకం రూ.1.03 లక్షల కోట్లకు చేరింది. విలీన సంస్థకు కాపిటల్ ఫస్ట్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ వి వైద్యనాథన్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒగా వ్యవహరించనున్నారు.

ఆ వినియోగదారులకు ఎయిర్‌టెల్ ఊరట

న్యూఢిల్లీ : వివిధ దేశాలు తిరిగే తమ ప్రయాణికులకు భారతీ ఎయిర్‌టెల్ ఉపశమన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఇంటర్నేషనల్ రోమింగ్ యాక్టివేషన్ రుసుమును నిలిపివేస్తున్నట్టు తెలిపింది. ఇది ప్రీ పెయిడ్, పోస్ట్‌పెయిడ్ చందాదారులకు వర్తిస్తుందని ఆ కంపెనీ సిఇఒ గోపాల్ విట్టల్ పేర్కొన్నారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు



కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు,
సెల్ : 9440262072

భారతదేశం మౌలికంగా సమాఖ్యరాజ్యం, ఫలితంగా దేశంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, అనే రెండురకాల ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం పరిధి మొత్తం దేశానికి వర్తిస్తే, రాష్ట్రాల పరిధి సంబంధిత ప్రాంతాలకు వర్తిస్తుంది. ఈ రెండు ప్రభుత్వాల అధికార పరిధులు, బాధ్యతలు, వాటి మధ్య సంబంధాలు మొదలైన విషయాలను రాజ్యాంగం తన వివిధ అధికరణల్లో సమగ్రంగా వివరించింది. ఈ రెండు స్థాయిల ప్రభుత్వాల మధ్య సంబంధాలకు స్పష్టమైన ప్రాతిపదికను ఏర్పరచింది. రాజ్యాంగం 7వ షెడ్యూల్లోని కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీని వివరించే కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలు కేంద్ర రాష్ట్రాల మధ్య సంబంధాలకు ప్రాతిపదిక. ఈ విధంగా, కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలను రాజ్యాంగ స్పష్టంగా ఏర్పరచినప్పటికీ ఆచరణలో ఈ సంబంధాలు రాజ్యాంగం ఆశించినదానికి భిన్నంగా రూపొందాయి. అనేక రాజకీయ, సామాజిక, ఆర్థిక, కారణాల వల్ల కేంద్ర, రాష్ట్రాల మధ్య అనేక విభేదాలు ఏర్పడి, వాటి మధ్య సంబంధాలు క్షీణించాయి. క్రమంగా కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలు క్షీణించడం వల్ల ఈ అంశం దేశంలో ఒక వివాదాస్పదమైన అంశంగా రూపొందింది. ఈ విషయంలో కేంద్రం తీవ్రమైన విమర్శలకు ప్రధాన బిందువైంది. దేశంలో సంభవించిన అనేక రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిణామాల ప్రభావం వల్ల కేంద్ర, రాష్ట్ర సంబంధాలను తొలిదశలో సామరస్య పూరితంగా కొనసాగిన కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో తరువాత దశలో విభేదాలు, ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. అయితే 1990 దశాబ్దంలో దేశంలో సంకీర్ణ రాజకీయాల యుగం ప్రారంభంతో కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో నూతన ధోరణులు తలెత్తాయి. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకోవలసిన అవసరం కలిగింది. కొందరు రాజనీతి శాస్త్రవేత్తలు కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో నాలుగు దశలను గుర్తించారు. అవి..

1. ఐక్యత, జాతీయ సమైక్యతల చట్టం పరిధిలో భాషా సంస్కృతుల భిన్నత్వ దశ (1947-67)
2. రాష్ట్రాల నుంచి ఎదురైన అనేకరకాల సమస్యల నేపథ్యంలో అధికార కేంద్రీకరణ దశ (1967-77)
3. అధికార సమతుల్యతను కేంద్రం వైపుకు మొగ్గు కనబరిచేలా చేసేందుకు ప్రయత్నించిన దశ (1977-84).
4. సంకీర్ణ రాజకీయాల యుగం-కేంద్ర-రాష్ట్రాల మధ్య సహజీవనం ప్రారంభమైన దశ (1985 నుంచి నేటి వరకు)

భారతదేశంలో కేంద్ర-రాష్ట్రాల సంబంధాలను మూడు శీర్షికలుగా విభజించవచ్చు. అవి. 1.కేంద్ర, రాష్ట్ర శాసన నిర్మాణ సంబంధాలు, 2. కేంద్ర, రాష్ట్ర పరిపాలన సంబంధాలు, 3. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాలు.

కేంద్ర, రాష్ట్ర శాసన నిర్మాణ సంబంధాలు

భారత రాజ్యాంగంలో పొందుపరిచిన కేంద్ర, రాష్ట్ర శాసన సంబంధాలను పథకం ప్రకారం కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన నిర్మాణ అధికారాలుగా విభజించి, వాటిని మూడు జాబితాలలో పొందుపరిచారు. అవి.

1. కేంద్ర జాబితా, 2.రాష్ట్ర జాబితా, 3.ఉమ్మడి జాబితా

కేంద్ర జాబితా (యునియన్ లిస్ట్)

కేంద్ర జాబితాలో మొత్తం 100 అంశాలు ఉన్నాయి. ఈ అంశాల్లో రక్షణ, సైనిక దళాలు, సాయుధ దళాలు, విదేశీ వ్యవహారాలు, రైల్వేలు, నౌకాయానం, నౌకానిర్మాణం, విమానయానం, విదేశీ ఋణాలు, బ్యాంకింగ్, విదేశీ వ్యాపారం, కరెన్సీ పరిశ్రమల నియంత్రణ, తంతితపాలా, జాతీయ మ్యూజియంల నిర్వహణ, జనాభా లెక్కల సేకరణ, కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఎన్నికల సంఘం, సుప్రీం కోర్టు, హైకోర్టులు ప్రధానమైనవి. ఈ అంశాలన్నీ దేశంలోని మొత్తం ప్రజల ఉమ్మడి ప్రయోజనం చేకూర్చేవి కావడం వల్ల వాటిపై దేశం మొత్తానికి వర్తించే శాసనాలు అవసరం. అందుచేత కేంద్ర జాబితాలో మొత్తం అంశాలపై శాసనాలు చేసే అధికారం కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉంది.

రాష్ట్ర జాబితా (స్టేట్ లిస్ట్)

రాష్ట్ర జాబితాలో 61 అంశాలు ఉన్నాయి. ప్రాంతీయ ప్రయోజనాల ఆధారంగా ఈ అంశాలను ఎంపిక చేసి, రాష్ట్ర జాబితాలో చేర్చారు. ఈ అంశాలపై విభిన్న ప్రాంతాలలో విభిన్న శాసనాలు అవసరం అని గుర్తించారు. ఈ జాబితాలలో చేర్చిన అంశాలపై రూపొందించిన శాసనాల పరిధి ఆధారంగా భారతదేశంలో సమాఖ్య సూత్రం పరిధిని నిర్ధారించవచ్చు. రాష్ట్ర జాబితాలలోని అంశాలలో శాంతి భద్రతలు, పోలీస్, న్యాయపాలన, జైళ్లు, స్థానిక ప్రభుత్వం, ప్రజా ఆరోగ్యం, మద్యపాన నిషేధం, వ్యవసాయ మధ్య పశుగణాభివృద్ధి, అడవులు, మత్స్య సంపద, నీటిపారుదల, వ్యాపారం, వాణిజ్యం, మార్కెట్లు, వడ్డీ వ్యాపారం, సినిమాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ప్రభుత్వ సర్వీసులు, భూమిశిస్తు మొదలైనవి ప్రధానమైనవి. ఈ అంశాలపై చట్టాలను రూపొందించే అధికారం రాష్ట్ర శాసనసభలకు ఉంది.

ఉమ్మడి జాబితా (కాంన్కరెంట్ లిస్ట్)

ఉమ్మడి జాబితాలోని 52 అంశాలపై దేశం మొత్తానికి వర్తించే సారూప్యత కలిగిన శాసనాలు చేయడం అభిలషణీయమే తప్ప తప్పనిసరికాదు. అందుచేత ఈ అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెండింటి పరిధిలో చేర్చారు. ఉమ్మడి జాబితాలోని అంశాలలో ప్రధానమైనవి: వివాహాలు, విద్య, వ్యవసాయం భూములు కాక మిగతా ఆస్తుల బదిలీ, సివిల్ ప్రొసీజర్, ట్రస్టులు, ట్రస్టీలు, సాంఘిక భద్రత, స్టాంప్ డ్యూటీలు, కార్మిక సంఘాలు, వార్తాపత్రికలు, కార్మిక సంక్షేమం, విద్యుచ్ఛక్తి, పుస్తకాలు, వారపత్రికలు, వైద్య, న్యాయవాద వృత్తులు, ఫ్యాక్టరీలు మొదలైనవి. ఈ అంశాలపై శాసనాలు రూపొందించే అధికారాన్ని కేంద్ర, రాష్ట్రాలు ఉమ్మడిగా కలిగి ఉన్నాయి. ఉమ్మడి జాబితాలోని అంశంపై పార్లమెంట్ శాసనాలను రూపొందించవచ్చు. ఆ అంశాలపై పార్లమెంటు శాసనాలను రూపొందిస్తే రాష్ట్ర శాసనసభ రూపొందించిన చట్టాలు రద్దవుతాయి. అయితే ఈ నియమానికి ఒక మినహాయింపు ఉంది. దీని ప్రకారం ఉమ్మడి జాబితాలోని ఏ అంశమైనా ముందుగా రాష్ట్ర శాసనసభ చట్టాన్ని చేసి, దానికి రాష్ట్రపతి ఆమోదం పొందితే.. తర్వాత పార్లమెంటు చట్టం చేసినా.. ముందుగా శాసనసభ చేసిన చట్టమే చెల్లుబాటు అవుతుంది. ఉమ్మడి జాబితా వినూత్నమైన సహజమైన లక్షణం. ఈ లక్షణం ఉమ్మడి జాబితాలోని ఏ అంశంపైనైనా అమలులో ఉన్న పార్లమెంట్ చట్టం పరిధిలో.. మరింత ప్రయోజనకరమైన చట్టాన్ని రూపొందించే అవకాశాన్ని రాష్ట్ర శాసనసభకు కల్పిస్తుంది.



ఉమ్మడి జాబితా భావన 1935 భారత ప్రభుత్వ చట్టం నుండి గ్రహించింది.

ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను మూడు సమగ్రమైన జాబితాలుగా విభజించి, వాటి అధికార పరిధిని స్పష్టంగా ఏర్పరచడం ద్వారా రాజ్యాంగ నిర్మాతలు మూడు ప్రయోజనాలను ఆశించినట్లు గుర్తించవచ్చు. ఒకటి, రాష్ట్రాలకు తగిన స్వయంప్రతిపత్తి కల్పించి, వాటి చొరవను ప్రోత్సహించడం. రెండు జాతీయ సమైక్యతను కాపాడేందుకు అవసరమైన పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలలో జోక్యం కల్పించుకునే అధికారాన్ని పార్లమెంట్‌కు కల్పించడం. మూడు ఆవశ్యక రంగాలలో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉమ్మడి చర్యలను, సంప్రదింపులను ప్రోత్సహించడం.

ఈ విధంగా కేంద్ర, రాష్ట్రాలు నిర్వహించే అంశాలతో సమగ్రమైన జాబితాలను రూపొందించడం ద్వారా, రాజ్యాంగం అవశిష్ట అధికారాల సంఖ్యను పరిమితం చేసింది. అయితే ఏ ప్రభుత్వానికి చెందిన అవశిష్ట శాసన నిర్మాణ అధికారాలు లేవని చెప్పడం సరికాదు. రాజ్యాంగంలోని 248వ అధికరణ అవశిష్ట అధికారాన్ని కేంద్రం పార్లమెంటుకు దత్తం చేసింది. దీని ప్రకారం రాష్ట్ర ఉమ్మడి జాబితాలలో లేని ఏ అంశంపై అయినా శాసనాలు చేసే అధికారం పార్లమెంటుకు ఉంది.

రాష్ట్రాలకు రాష్ట్ర జాబితాలో చేర్చిన అంశాలపై సంపూర్ణమైన శాసన నిర్మాణ అధికారం ఉన్నప్పటికీ దీనికి రెండు మినహాయింపులు ఉన్నాయి. అవి..

1. రాజ్యాంగంలోని 249వ అధికరణ ప్రకారం జాతి ప్రయోజనాల దృష్ట్యా అవసరమని భావించి, రాజ్యసభకు హాజరైన సభ్యులలో రెండింట మూడొంతుల మెజారిటీతో ఒక తీర్మానాన్ని ఆమోదిస్తే, రాష్ట్ర జాబితాలోని ఏ అంశంపైనైనా పార్లమెంటు శాసనం చేయవచ్చు. ఈ శాసనం మొత్తం దేశానికి, లేదా ఏ ప్రాంతానికైనా వర్తిస్తుంది. ఈ తీర్మానం ఒక సంవత్సరం పాటు అమలులో ఉంటుంది. అందుచేత పార్లమెంటు చేసిన చట్టం కూడా ఒక సంవత్సరం పాటు మాత్రమే అమలులో ఉంటుంది.
2. రాజ్యాంగం 250వ అధికరణ ప్రకారం దేశంలో అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు రాష్ట్ర జాబితాలోని ఏ అంశంపైనైనా చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉంది. ఈ అధికారం అత్యవసర పరిస్థితి ఉన్నంతకాలం అమలులో ఉంటుంది. అత్యవసర పరిస్థితిని రద్దు చేసినప్పటికీ ఈ చట్టం ఆరు నెలలపాటు అమలులో ఉంటుంది.

పైన వివరించిన రెండు సందర్భాలతో పాటు మరో సందర్భంలో కూడా పార్లమెంటు రాష్ట్ర జాబితాలోని అంశాలపై చట్టాలను నిర్మించే అధికారాన్ని కలిగి ఉంటుంది. 252వ రాజ్యాంగ అధికరణ ప్రకారం రెండు లేదా అంతకన్న ఎక్కువ రాష్ట్రాల శాసనసభలు అవసరమని తీర్మానిస్తే రాష్ట్ర జాబితాలోని ఏ అంశంపైనైనా శాసనం చేసే అధికారాన్ని పార్లమెంటు కలిగి ఉంది. ఈ చట్టాన్ని పార్లమెంటు సంబంధిత శాసనసభ కోరిక ప్రకారం సవరించవచ్చు లేదా పూర్తిగా రద్దు చేయవచ్చు. రాజ్యాంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఉమ్మడి జాబితాలో ఎక్కువ అంశాలను చేర్చడం వల్ల రెండు ప్రయోజనాలు ఉన్నాయి. ఒకటి, ఈ ఏర్పాటు ప్రగతి శీలక, ముందుచూపు కలిగిన రాష్ట్రాలు ఉమ్మడి జాబితాలోని అంశాలపై శాసనాన్ని చేసే అవకాశాన్ని కల్పిస్తుంది. రెండు, ఉమ్మడి జాబితాలోని ఏ అంశంపైనైనా అప్పటికే పార్లమెంట్ చట్టం ఉన్నా ఏవైనా రాష్ట్రాలలో ప్రత్యేకమైన పరిస్థితులు నెలకొన్నప్పుడు వాటికి అనుగుణంగా ప్రత్యేక ఏర్పాటుకు అవకాశం ఉంది. రాష్ట్ర జాబితా స్థానిక ప్రయోజనాల ప్రాతిపదికగా, కేంద్రజాబితా జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించబడ్డాయి. ఉమ్మడి జాబితాలోని వివిధ అంశాలను కేంద్ర, రాష్ట్ర జాబితాలలో పొందుపరిచి నట్లయితే వాటిమధ్య సంఘర్షణ తలెత్తే అవకాశం ఉంది. ఉమ్మడి జాబితా ఊహించని అత్యవసర పరిస్థితులలో తమ పరిధులను దాటి వ్యవహరించే అవకాశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటికీ కల్పించింది. ఈ వాస్తవం గత ఐదు దశాబ్దాల కాలంలో నిరూపితమైంది.

మొత్తంమీద కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసననిర్మాణ అధికారాల పంపిణీని పరిశీలిస్తే కేంద్రీకృత ధోరణి వ్యక్తమవుతుంది. కొందరు ఈ విధానం ప్రపంచంలోని అన్ని సమాఖ్య రాజ్యాల్లో వ్యక్తమవుతున్న కేంద్రీకృత ధోరణికి అనుగుణంగా ఉందని సమర్థించారు. వారి వాదనకు భిన్నంగా ఇతరులు ఈ పంపిణీ సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా వ్యతిరేకమైనది. సమాఖ్య రూపంలో ఏకకేంద్రం రాజ్యాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నం అని విమర్శించారు. ★

కేంద్ర, రాష్ట్ర పరిపాలన సంబంధాలు

సమాఖ్య రాజ్యాలలో తలెత్తే సమస్యల్లో కేంద్ర, రాష్ట్రాల మధ్య పరిపాలనా సంబంధాలను నిర్ధారించడం అత్యంత కీలకమైనది. రాజ్యాంగంలో స్పష్టమైన ఏర్పాట్లు లేని పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమపాలనా విధులను నిర్వర్తించడంలో అనేక సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని, భారత రాజ్యాంగ నిర్మాతలు పరిపాలనా రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంఘర్షణ తలెత్తకుండా నివారించే ఏర్పాట్లను రాజ్యాంగంలో పొందుపరిచారు. ఈ విషయం భారత రాజ్యాంగం 1935 భారత ప్రభుత్వం చట్టం ఏర్పరచిన విధానాన్ని అనుసరించింది.

రాజ్యాంగంలోని 256వ అధికరణ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు పార్లమెంటు చట్టాలకు అనుగుణంగా మాత్రమే తమ కార్యనిర్వహణ అధికారాలను వినియోగించాల్సి ఉంటుంది. దేశ అంతరంగిక ప్రయోజనాల పరిరక్షణకు రాష్ట్రాలకు అవసరమైన ఆదేశాలను జారీచేసే స్వేచ్ఛ, అధికారాలు కేంద్ర ప్రభుత్వానికి ఉన్నాయి. ఈ అధికారంతో పాటు రాజ్యాంగం 257వ అధికరణ ప్రకారం తన కార్యనిర్వాహక అధికారానికి అవరోధం కల్పించే చర్యలను చేపట్టవద్దని రాష్ట్రాలను ఆదేశించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంది. దీని ప్రకారం ఏదైనా రాష్ట్రంలో కేంద్ర సంస్థలు తమ కార్యకలాపాలను నిర్వర్తించడంలో అవరోధాలను ఎదుర్కొంటే వాటిని తొలగించమని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించవచ్చు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలకు ఈ కింది అంశాలు వర్తిస్తాయి. 1. జాతీయ లేదా రక్షణ దళాలకు ప్రాధాన్యత కలిగిన రవాణా మార్గల నిర్మాణం, నిర్వహణ. 2. రాష్ట్రంలోని రైల్వేల ఆస్థుల పరిరక్షణ.

రాజ్యాంగం రాష్ట్ర ప్రభుత్వం ఆమోదంతో తన పరిధిలోని విధులలో ఏ విధులనైనా ఆ రాష్ట్ర ప్రభుత్వానికి లేదా ఆ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అప్పగించే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పించింది. ఇదే విధంగా పార్లమెంటు చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు విధులను అప్పగించవచ్చు. 261వ రాజ్యాంగ అధికరణ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల చర్యలకు, కోర్టులకు, న్యాయవ్యవస్థల తీర్పులకు దేశం మొత్తం ప్రాంతాలలో ప్రజల విశ్వాసాన్ని, విధేయతను కనబరచాలని ఆదేశిస్తుంది. రాజ్యాంగంలోని 262వ అధికరణ నదీ జలాల, నదీ లోయల వినియోగం, పంపిణీ, నియంత్రణలలో వివిధ రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను, విభేదాలను పరిష్కరించే చట్టాలను రూపొందించే అధికారాన్ని పార్లమెంటుకు కల్పించింది. ఈ అధికరణకు అనుగుణంగా 1956లో పార్లమెంటు అంతర్‌రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టం ఫలితంగా నదీ జలాలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించేందుకు ఒక కేంద్ర ట్రిబ్యునల్ ఏర్పాటైంది. నదీజలాల వినియోగంపై తలెత్తిన వివాదాలపై వివాదాలపై ఈ ట్రిబ్యునల్ తీర్పు అంతిమమైంది.

చివరగా మొత్తం దేశంలో పరిపాలనా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసేందుకు రాష్ట్రాలకు, కేంద్రం మధ్య వివిధ రాష్ట్రాల మధ్య విధానాల అమలులో సమన్వయ సాధనకు రాజ్యాంగం 263వ అధికరణ ఒక అంతరాష్ట్ర మండలిని నియమించే అధికారాన్ని రాష్ట్రపతికి కల్పించింది. ఈ మండలిని ఏర్పాటు చేసే అధికారంతో పాటు ఈ మండలి వ్యవస్థీకరణ, పని పద్ధతులను, విధుల స్వభావాన్ని నిర్ధారించే అధికారం కూడా రాష్ట్రపతికి ఉంది.

మొత్తం మీద రాజ్యాంగం నిర్ధారించిన కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన నిర్మాణ, పాలన సంబంధాలను విశ్లేషిస్తే భారత దేశ సమాఖ్య కొన్ని విశిష్ట లక్షణాలను గుర్తించవచ్చు. అవి.

1. కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల విభజన విస్తృతమైనది, సమగ్రమైనది.
2. భారతదేశంలో కేంద్ర, రాష్ట్రాలకు కలిపి ఒకే రాజ్యాంగం ఉంది. భారత యూనియన్‌లోని అన్ని రాష్ట్రాలకు ఒకేరకమైన రాజ్యాంగం ఉంది.
3. భారత సమాఖ్యలో రాష్ట్రాల భౌగోళిక హద్దులను మార్పు చేయవచ్చు. ఉన్న రాష్ట్రాలను రద్దు చేయవచ్చు. కొత్త రాష్ట్రాలను సృష్టించవచ్చు.
4. భారత రాజ్యాంగం పౌరులందరికీ ఒకే పౌరసత్వాన్ని కల్పించింది.
5. భారత రాజ్యాంగం దేశంలో ఏకీకృత న్యాయవ్యవస్థను ఏర్పాటు చేసింది. సివిల్, క్రిమినల్ చట్టాలను కేంద్రీకరించడమే కాక, అవి దేశమంతటికీ సమానంగా వర్తిస్తాయి. ★

పదో రోజూ పారిశుధ్య కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విజయనగరం జిల్లా ఎస్.కోట మేజర్ పంచాయతీలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె శనివారానికి పదో రోజుకు చేరింది. వీరి సమ్మెకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా కార్మికులకు వేతనాలివ్వకుండా ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సమక్షంలో జరిగిన చర్చల్లో పండగ నేపథ్యంలో ఒక్కో కార్మికుడికి రూ.10 వేలు ఇచ్చేందుకు పంచాయతీ ప్రత్యేకాధికారి, తహశీల్దార్ అరుణకుమారి అంగీకరించారు. ప్రస్తుతం రూ.5 వేలు మాత్రమే అందజేస్తామని చెప్పడంతో కార్మికులు అంగీకరించకుండా సమ్మెను కొనసాగిస్తున్నారు. తమకు ఆరు నెలల వేతనాలు ఇచ్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని ఈ సందర్భంగా కార్మికులు తెలిపారు.

ధర్నా

అనంతపురం టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద కో ఆర్డినేషన్ ఆఫ్ బ్యాంక్ పెన్షనర్స్, రిటైరీస్ ఆర్గనైజేషన్స్, ఆల్ ఇండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నాయకులు



ప్రతి పిఆర్‌సికీ పెన్షన్ సవరణ

విశ్రాంత బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రతి పిఆర్‌సికి పెన్షన్ సవరణ చేసి విశ్రాంత ఉద్యోగులకు చేయూతనివ్వాలని ఆలిండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ దేశవ్యాప్తంగా ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు వివిధ రూపాల్లో నిరసనకు కార్యచరణ రూపొందించామన్నారు. అందులో భాగంగా శనివారం అనంతపురం టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద కో ఆర్డినేషన్ ఆఫ్ బ్యాంక్ పెన్షనర్స్, రిటైరీస్ ఆర్గనైజేషన్స్, ఆల్ ఇండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నాయకులు ఆర్‌హెచ్‌వి రమణ, పి.చంద్రశేఖర్, సి.కమలాకర్, డి.శివప్ప మాట్లాడారు. దేశవ్యాప్తంగా పెన్షన్ పై ఆధారపడి జీవిస్తున్న 5 లక్షల మంది బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు అవిశ్రాంతంగా పోరాడుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వాలకు, యాజమాన్యాలకు వ్యతిరేకంగా నిరసన తెలపడం తప్ప సమ్మె చేయలేని దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు.రిజర్వ్ బ్యాంక్ ఫ్యామిలీ పెన్షనర్లకు 30 శాతం మూల వేతనంతో పెన్షన్ చెల్లిస్తున్నారని, కాని మిగతా బ్యాంకుల్లో 15 శాతం మూల వేతనంతో మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి కేంద్ర ప్రభుత్వ, రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగులతో సమానంగా కుటుంబ పెన్షన్ పెంచాలన్నారు. 15 సంవత్సరాల పాటు పని చేసి రాజీనామా చేసిన ఉద్యోగులకు పెన్షన్ ప్రయోజనాలు వర్తింపజేయాలన్నారు.

వంతెన నిర్మాణ జాప్యంపై వినూత్న నిరసన

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

రాష్ట్రంలో పాలన సాగిస్తున్న తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితం అవుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాల్సిన ప్రభుత్వ పెద్దలు శిలాఫలకాలు వేసి చేతులు దులుపుకుంటున్నారని, అదే అభివృద్ధి అంటూ మాట్లాడుతున్న తీరు నమ్మించి ప్రజలను మోసం చేయడమేనంటూ మండిపడ్డారు. నగరంలోని సెంట్రల్ నియోజకవర్గం ఒకటో డివిజన్‌లో నున్న - గుణదల రోడ్‌లో గుణదల లెవల్ క్రాసింగ్ 8 వద్ద ఆర్ అండ్ బి నిధులతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో జాప్యంను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు ధర్నా నిర్వహించారు. బ్రిడ్జి నిర్మాణానికి వేసిన శిలాఫలకానికి పూలదండ వేసి అంజలి ఘటించి, శిలాఫలకం వేసిన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలంటూ ప్లకార్డులు చూపుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ 2009 ఫిబ్రవరి 19వ తేదీన రూ.36 కోట్ల అంచనా వ్యయంతో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని వేసి వదిలేశారే తప్ప బ్రిడ్జి నిర్మాణాన్ని పాలకులు మరిచారన్నారు. ఇప్పటికి శంకుస్థాపన చేసి 3322 రోజులు అయ్యిందని గుణదల వాసులకు శిలాఫలకం రాయే మిగిలింది తప్ప బ్రిడ్జి నిర్మాణం కలగానే మిగిలిపోయిందని అన్నారు. ఉన్న బ్రిడ్జి సైతం కూలి పోయి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, ఈ ప్రాంతంలో ఉన్న మిగిలిన బ్రిడ్జిలు సైతం కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

టిడిపి నాయకుని దౌర్జన్యం

విద్యుత్ మీటర్ రీడర్‌కు తుపాకితో బెదిరింపు

ప్రజాశక్తి - రాజుపాలెం (గుంటూరు జిల్లా)

విద్యుత్ బిల్లు తీయడానికి వెళ్లిన యువకునిపై తెలుగు యువత నాయకుడు దాడి చేయడంతోపాటు తుపాకీతో బెదిరించిన ఘటన గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం నెమలిపురిలో (స్పీకర్ కోడెల శివప్రసాదరావు ప్రాతినిధ్యం వహిస్తున్న సత్తెనపల్లి నియోజకవర్గం) శనివారం చోటుచేసుకుంది. ఇది ముమ్మాటికి కుల, అధికార దురంహకారమేనని పలువురు మండిపడుతున్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని వివరాల ప్రకారం.. రాజుపాలెం ఆర్ఆర్ సెంటర్‌కు (పులిచింతల నిర్వాసిత కాలనీ) చెందిన గిరిజన యువకుడు మెరుగు గౌరీశంకర్ విద్యుత్ శాఖలో మీటర్ రీడింగ్ పని చేస్తున్నారు. తన విధుల్లో భాగంగా నెమలిపురిలోని తెలుగు యువత మండల అధ్యక్షులు ముప్పాళ్ల బాలకృష్ణ ఇంటికి వెళ్లి మీటర్ రీడింగ్ తీశాడు. అయితే రీడింగ్ ఎక్కువగా వచ్చిందని ఆగ్రహంతో గౌరీశంకర్‌పై బాలకృష్ణ దుర్భాషలాడుతూ దాడికి దిగాడు. గౌరీశంకర్ సెల్‌ఫోన్‌ను లాక్కుని నేలకేసి కొట్టాడు. అంతటితో ఆగక తన వద్ద ఉన్న తుపాకిని తెచ్చి చంపుతానని బెదిరించాడు. ఇది గమనించిన స్థానికులు గౌరీశంకర్‌ను అక్కడి నుండి తప్పించారు. ఇది తెలిసిన విద్యుత్ ఐక్యవేదిక మాచర్ల డివిజన్ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ మాచర్ల డివిజన్ అధ్యక్షులు బలరామకృష్ణ, సిఐటియు గుంటూరు పశ్చిమ జిల్లా అధ్యక్షులు ఎస్.ఆంజనేయులు నాయక్ రాజుపాలేనికి చేరుకున్నారు. బాధితుడైన గౌరీశంకర్‌తో మాట్లాడారు. అనంతరం సిఐ ఎంవి సుబ్బారావు, ఎస్ఐ అశోక్‌కు ఫిర్యాదు చేశారు. గిరిజన యుకకుడిపై బాలకృష్ణ కుల, అధికార దురహంకారంతోనే దాడి చేశాడని, గతంలోనూ ఇద్దరు, ముగ్గురిపై ఇలా తుపాకితో బెదిరింపులకు పాల్పడ్డారని నాయకులు పేర్కొన్నారు. బాలకృష్ణ తుపాకి లైసెన్సును రద్దు చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కింద అరెస్టు చేయాలని కోరారు. అధికార పార్టీ అండ చూసుకుని రెచ్చిపోయిన బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని వైసిపి మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు.

ప్రజ్ఞ

జవాబులు

1. జిఎస్టీ
2. మేరికోమ్
3. విరాట్ కోహ్లీ
4. ముంబాయి
5. నికోలస్ మదురో

టిడిపి, వైసిపి డ్రామాల వల్లే లాకౌట్!

విజయనగరంలో చారిత్రాత్మకమైన నెల్లిమర్ల జూట్ మిల్లు అక్రమ లాకౌట్‌తో మూతపడింది. మిల్లు అక్రమ లాకౌట్ వెనుక రాజకీయకోణాలున్నట్లు పలు అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో నెల్లిమర్ల జ్యూట్ మిల్లుది వందేళ్ల పైబడిన చరిత్ర. వేలాది కార్మికులకు అండగా నిలిచిన పరిశ్రమ. అలాంటి పరిశ్రమ నేడు కొంత మంది నేతల కబంధహస్తాల మధ్య పడరాని పాట్లు పడుతోంది. అందులో భాగంగానే నెల్లిమర్ల జ్యూట్ మిల్లు యాజమాన్యం అక్రమ లాకౌట్‌తో కార్మికులను రోడ్డున పడేసింది. అయితే సంక్రాంతి పండుగ ముందు మిల్లు మూతపడటంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


- నెల్లిమర్ల జ్యూట్ మిల్లు కార్మికులు బలి
- కార్మిక కుటుంబాల్లో కానరాని సంక్రాంతి



పజాశక్తి-విజయనగరం ప్రతినిధి

నెల్లిమర్ల జ్యూట్ మిల్లు పరిశ్రమలో సుమారు 1500 మంది పర్మినెంట్ కార్మికులు, 2 వేల మంది దినసరి కార్మికులు పని చేస్తున్నారు. గత కొంత కాలంగా యాజమాన్యం కార్మికులకు నష్టం కలిగించేలా నిర్ణయాలను అమలు చేస్తోంది. మరోవైపు ప్రతిపక్ష పార్టీకి చెందిన సీనియర్ నేత కనుసన్నల్లో ఉన్న ఈ పరిశ్రమ యాజమాన్యం అటు లాభాల కోసం, రాజకీయ పార్టీ లబ్ధి కోసం అక్రమ లాకౌట్ విధించిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. లాకౌట్ విధించి, కార్మికులను రోడ్డున పడేస్తే దాని ప్రబావం అధికార పార్టీపై పడుతుందనే ఉద్దేశంతో ఆ రాజకీయ నేత యాజమాన్యాన్ని ఉసుగొలిపినట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల థామస్‌పేటలో కార్మికుల ఇళ్లు కాలిపోవడంతో ఆ ప్రాంత టిడిపి నాయకుడు కార్మికులను తమ వైపు తిప్పుకునేందుకు వారికి ఇళ్ల రేకులు అందజేశారు. అంతేకాకుండా తన పుట్టిన రోజు సందర్భంగా పలు గ్రామాల్లో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దీంతో జీర్ణించుకోలేని వైసిపి నాయకులు లాకౌట్‌కు యాజమాన్యాన్ని ఉసిగొల్పినట్లు తెలిసింది. కొన్ని రోజులుగా యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలను కార్మికులు వ్యతిరేకిస్తూ వస్తున్నారు. పని భారాన్ని పెంచే కుట్రలను కార్మికులు అంగీకరించలేదు.

మరోవైపు కార్మికులు చేసిన ఉత్పత్తిని తూకం వేసి అప్పగించాలని యాజమాన్యం కొత్త నిబంధనను తీసుకొచ్చింది. దీన్ని కార్మికులంతా వ్యతిరేకించారు. కార్మికులు చనిపోతే యాజమాన్యానిదే బాధ్యతని కార్మికులు చెబుతున్నారు. దీంతో కంపెనీ యాజమాన్యం, కార్మికులపై పలు ఆరోపణలు చేస్తూ లాకౌట్ నోటీసులో పేర్కొంది. అయితే యాజమాన్యం చెబుతున్న కారణాలు సమంజసం కాదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు 400 మంది రిటైర్డు కార్మికులకు గ్రాట్యుటీ బకాయిలు యాజమాన్యం చెల్లించడం లేదు. పైగా కార్మికులపై పని భారం పెంచి నాణ్యతలేని ముడిసరుకుతో ఉత్పత్తిని పెంచాలని చెబుతోంది. దీన్ని ప్రశ్నించడంతో లాకౌట్ విధించిందని కార్మికులు అంటున్నారు. ఐదుగురి పనిని ఇద్దరితో చేయిస్తూ పర్మినెంట్ కార్మికుల సంఖ్యను కుదించింది. 1989 నుంచి ఇప్పటి వరకు పలుమార్లు అక్రమ లాకౌట్లు విధించింది. అప్పటి నుంచి కార్మికుల నుంచి రూ.5, రూ.10లు రుణంగా తీసుకుని తిరిగి చెల్లించడానికి ఒప్పందం చేసుకుంది. తిరిగి 2009లో బిఐఎఫ్ఆర్ పేరుతో లాకౌట్ ప్రకటించి వేతన కోతను రూ.18కు పెంచింది. అదే సంవత్సరంలో అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే సాంబశివరాజు సమక్షంలో చర్చలు జరిపి రూ.18 వేతనం కోతలో కొంత తిరిగి చెల్లించేలా యాజమాన్యం ఒప్పందాలు చేసింది. అంతకుముందు 1994లో అక్రమ లాకౌట్‌ను నిరసిస్తూ కార్మికులు పెద్దఎత్తున ఉద్యమించారు. ఆ సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఐదుగురు కార్మికులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. అప్పటి నుంచి ఏదోవిధంగా కార్మికులను భయపెట్టి ఇప్పటి వరకు పని చేయించుకుని కోట్లాది రూపాయల లాభాలు పొందిన యాజమాన్యం దినసరి కూలీల వేతనాల్లో కోత విధించి మరిన్ని లాభాలను ఆర్జించింది. సిక్‌లీవ్, సర్వీసు సెలవు వంటి హక్కులను కార్మికులు కోల్పోయారు. ఇన్ని నిబంధనల నడుమ అంతంత మాత్రంగా జీవనం సాగిస్తున్న కార్మిక కుటుంబాలు ప్రస్తుత లాకౌట్‌తో రోడ్డున పడ్డారు. ప్రభుత్వం స్పందించి మిల్లును తెరిపించాలని కోరుతున్నారు.



వైఎస్ఆర్‌కు నివాళులర్పిస్తున్న జగన్, విజయమ్మ, కుటుంబ సభ్యులు

వైఎస్ఆర్‌కు జగన్ ఘన నివాళి

ప్రజాశక్తి-పులివెందుల/వేంపల్లి

ప్రతిపక్ష నేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శనివారం కడప జిల్లాలోని పులివెందుల, వేంపల్లి, ఇడుపులపాయలో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో జగన్‌కు ప్రజలు నీరాజనం పలికారు. తొలుత పులివెందులలోని ఆర్‌టిసి బస్టాండు నుంచి సిఎస్ఐ చర్చి వరకు రోడ్‌షో నిర్వహించారు. అనంతరం ఆయన సిఎస్ఐ చర్చిలో ఏర్పాటు చేసిన ప్రార్థన కూటమిలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ మత గురువులు జగన్‌కు ఆశీస్సులు అందించారు. అనంతరం వేంపల్లికి చేరుకుని గండిక్షేత్రంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్ఆర్ ఘాట్ వద్దకు చేరుకుని తన తండ్రి రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పించారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పాదయాత్ర పూర్తి చేసుకుని మొదటిసారి ఇడుపులపాయకు వస్తుండటంతో వైసిపి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ఇడుపులపాయలో జగన్ సమక్షంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా వైసిపిలో చేరారు. అనంతపురం మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తన అనుచరులను వైసిపిలో చేర్చారు. వీరన్నగట్టుపల్లి వద్ద మాజీ మంత్రి డి.ఎల్.రవీంద్రారెడ్డి అనుచరులు జగన్‌ను కలిశారు. ఆయా కార్యక్రమాల్లో జగన్ తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతి, కడప మాజీ ఎంపి వైఎస్. అవినాష్‌రెడ్డి, వైసిపి ఎమ్మెల్యేలు, వైఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చీరాలలో వృద్ధురాలు హత్య

ప్రజాశక్తి-చీరాల రూరల్ : చీరాల మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో వృద్ధురాలు జంగిలి కుమారి(60) ఊరు చివర ఉన్న పొలంలోని ఇసుక దరువులో చంపి పాతిపెట్టిన ఘటన శనివారం వెలుగులోకొచ్చింది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాలు ప్రకారం.. మృతురాలు జంగిలి కుమారికి ముగ్గురు పిల్లలు. వయస్సు మీద పడటంతో కొడుకు నాగ మల్లేశ్వరావు వద్దే ఉంటోంది. శుక్రవారం వేకువ జామున బహిర్భూమికి వెళ్లింది.ఆ సమయంలో గుర్తు తెలియని కొందరు ఆ వృద్ధురాలిపై దాడి చేసి హతమార్చారు. కొందరు గ్రామస్తులు బహిర్భూమికి వెళ్లడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం పోలీసులకు చేరడంతో రంగంలోకి దిగారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

22ఎ నుంచి మినహాయించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ 58వ వార్డు పరిధిలో గల సిద్ధార్థనగర్‌ను 22ఎ నుంచి మినహాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిహెచ్‌పివి ఎంప్లాయిస్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఫర్ వీకర్ సెక్షన్స్ అండ్ మైనారిటీ గ్రూపుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన సిద్ధార్థనగర్‌లో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985లో స్థలం కొని వుడా అప్రూవల్ ద్వారా గృహాలను నిర్మించారని, 2016లో కావాలనే కొంత మంది అధికార పార్టీ నాయకులు సిద్ధార్థనగర్ కాలనీని '22ఎ'గా మార్చారని తెలిపారు. ఇంటిపన్ను, విద్యుత్ మీటర్లు, 1990 నుంచి కాలనీవాసులు ప్రభుత్వానికి చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్య మంత్రికి, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీకి, ఉన్నతాధికారులకు నివేదించి వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడామన్నారు. రికార్డులు లేవని అధికారులు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. బలిరెడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం నగరకమిటీ నాయకులు వివిఎస్.పద్మనాభరాజు, కెఎం.శ్రీనివాస్, డివిజన్ నాయకులు ఎ.విశ్వనాధం, స్థానిక నాయకులు వీరాస్వామి, రామస్వామి, అసోసియేషన్ ప్రతినిధులు నర్సింహనాయక్ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న మధు, నర్సింగరావు

పాత వడ్లపూడి సర్వేనెంబర్ 11/2లో ఆక్రమణకు గురైన భూమిని మధు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల భూమిని ఆక్రమిస్తే సహించేదిలేదని ప్రభుత్వాన్ని, అధికార పార్టీ నాయకులను హెచ్చరించారు.

ట్రిపుల్ ఐటి సిబ్బంది ధర్నా




ధర్నా చేస్తున్న సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ కార్మికులు

ప్రజాశక్తి - నూజివీడు

తమకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతూ నూజివీడు ట్రిపుల్ ఐటి కార్మికులు శనివారం ట్రిపుల్ ఐటి గేటు ముందు ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కృష్ణాజిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటిలో పనిచేస్తున్న సుమారు 700 మంది సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్, అవుట్ సోర్సింగ్ కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు నూజివీడు పట్టణ కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ కాంట్రాక్టరు పనికి ఇచ్చే ప్రాధాన్యత కార్మికులకు జీతాలు చెల్లించే విషయంలో చూపడంలేదని విమర్శించారు. ట్రిపుల్ ఐటి యాజమాన్యం కూడా కాంట్రాక్టరుకు వంత పాడటం బాధాకరమన్నారు. సాధారణంగా నెల మొదటి రోజునే కాంట్రాక్టరుకు కార్మికులకు అందించాల్సిన జీతాల చెక్కును యాజమాన్యం ఇస్తుందన్నారు. అయితే సంబంధిత కాంట్రాక్టరు మాత్రం 10 రోజులు గడిచినా జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం బ్యాంకులకు సెలవు కావడంతో పండుగ రోజున పస్తులు తప్పవనే ఆందోళనతో కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎడ్ల పందేల్లో గుంటూరు జిల్లా హవా



పోటీలో పాల్గొన్న గుంటూరు జిల్లా ఎద్దులు

ప్రజాశక్తి - గుడివాడ

కృష్ణాజిల్లా గుడివాడలో ఎన్‌టిఆర్ 2 వైఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో జరుగుతున్న బండలాగుడు పోటీలలో శనివారం నాలుగు పళ్ల విభాగంలో గుంటూరు జిల్లాకు చెందిన ఎద్దులు సత్తా చాటాయి. నాలుగు పళ్ల విభాగంలో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పాతమల్లాయిపాలెంకు చెందిన సిద్ధంశెట్టి సామ్రాజ్యం ఎడ్ల జత 5485.1 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం, తెలంగాణా రాష్ట్రం సూర్యాపేట తమేళ్ళచెరువుకు చెందిన వీరంరెడ్డి మల్లిఖార్జునరెడ్డి మెమోరియల్‌కు చెందిన జత, గుంటూరు జిల్లా మయకుమల్లెకు చెందిన ముండ్ర జీవప్రసాద్ జత 5400 అడుగుల దూరం లాగి సంయుక్తంగా ద్వితీయ స్థానం, గుంటూరు జిల్లా రాజుపాలెంకు చెందిన బండికల్లు రమ్యానాయుడు, ప్రకాశం జిల్లా కురిచేడు మండలం ముష్ట గంగవరంకు చెందిన దేవినేని వెంకటేశ్వర్లుల ఎడ్లు 5390.3 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం సాధించాయి. తెలంగాణా రాష్ట్ర హుజూర్‌నగర్‌కు చెందిన సుంకే సురేంద్రరెడ్డి ఎడ్ల జత 5200.2 అడుగుల దూరం లాగి నాల్గో స్థానం, గుంటూరు జిల్లా ముప్పాళ్ళ మండలం మాదలకు చెందిన జవ్వాజి మేగనాథ్ నాయుడు ఎడ్లు 5181.6 అడుగుల దూరంతో ఐదో స్థానం, కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలం యలమర్రుకు చెందిన వల్లభనేని భాను ప్రకాశరావు, నాగాయలంకకు చెందిన తలసిల సత్యనారాయణల ఎడ్లు 5108.5 అడుగుల దూరంతో సంయుక్తంగా ఆరో స్థానంలో నిలిచాయి. పిఠాపురం మండలం కండ్రికకు చెందిన భాస్కర్ కోటేశ్వరరావు, గుంటూరు జిల్లా, నర్సారావుపేటకు చెందిన చందోలు వెంకటయ్యల ఎడ్ల జతలు సంయుక్తంగా ఏడో స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన బోలా దశరథరెడ్డి, పులగం అప్పిరెడ్డిల ఎడ్ల జతలు ఎనిమిదో స్థానం, కర్నూలు జిల్లా బేతంచర్ల మండలం ముసలాయచెరువుకు చెందిన కె.రామేశ్వరరెడ్డి ఎడ్లు తొమ్మిదో స్థానంలో నిలిచాయి. ఆయా ఎడ్ల జతలకు నగదు పురస్కారాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు.

పాక్‌కు ఐరాస అధ్యక్షురాలు

ఐరాస : పాక్‌తో మరింతగా సత్సంబంధాలు మెరుగు పర్చుకునేందుకు, వివిధ సంస్థలతో అనుసంధానాన్ని పెంపొందించుకునేందుకు లక్ష్యంగా ఐక్యరాజ్య సమితి అధ్యక్షురాలు మరియా ఫెర్నాండా ఎస్పినోసా వచ్చే వారం పాకిస్తాన్‌ను సందర్శించనున్నారు. పాక్ ఆహ్వానం మేరకు ఈ నెల 18 నుండి 22 వరకు మరియా పర్యటించనున్నారని ఐరాస అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్‌లో ఐరాస అధ్యక్షురాలిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మరియాకు ఇది మొదటి అధికారిక పర్యటన కావడం విశేషం. ఈక్వెడార్ విదేశాంగ వ్యవహారాల మాజీ మంత్రి మరియా జూన్‌లో జరిగిన ఎన్నికల్లో ఐరాస జనరల్ అసెంబ్లీకి 73వ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఎన్నికైన అధ్యక్షుల్లో ఆమె నాల్గవ మహిళ. ఈ పర్యటనలో పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, అధ్యక్షుడు ఆరిఫ్ అల్వి, విదేశాంగ మంత్రి షా మహ్మద్ ఖురేషీలతో ఆమె భేటీకానున్నారని ఐరాస కార్యాలయం తెలిపింది.

నిరసన : యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ సినిమాకు వ్యతిరేకంగా ముంబైలోని ములుండ్‌లో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు




ఎన్ఆర్‌సి కమిటీకి నాయకత్వం వహించటానికి తిరస్కరించిన బెజ్‌బారువా

గువహటి : అసోం ఒప్పందంలోని 6వ క్లాజును అమలు చేసేందుకు తగిన మార్గాలను సూచించడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన తొమ్మిది మంది సభ్యుల కమిటీ నేతృత్వం వహించడానికి మాజీ ఐఎఎస్ అధికారి ఎంపి బెజ్‌బారువా నిరాకరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కమిటీ తగిన సంసిద్ధత గానీ, నిర్దిష్ట రూపం గానీ లేదని అన్నారు. కమిటీలోని పలువురు సభ్యులను ఎంపిక చేసిన అనంతరం హోం మంత్రికి తన నిర్ణయం తెలిపానని బెజ్‌బారువా అన్నారు. 1985 నాటి అస్సాం ఒప్పందంలో క్లాజ్ 6 ను అమలు చేసేందుకు అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ఈ నెల మొదట్లో కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. అయితే అది పూర్తిగా అమలు కాలేదని హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. జాతీయ పౌరసత్వ రిజిస్టర్(ఎన్‌ఆర్‌సి)ని నవీకరణ చేసే సమయంలోనే దానికి అనుసంధానంగా బిల్లును రూపొందించేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ బిల్లుపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఈ కమిటీ నుండి ముగ్గురు అధికారులు వైదొలిగారు.

సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు మోహార్ సింగ్ మృతి

పొలిట్ బ్యూరో సంతాపం



ఇండియా న్యూస్ నెట్‌వర్క్-న్యూఢిల్లీ : సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు, ఆ పార్టీ హిమాచల్ ప్రదేశ్ మాజీ కార్యదర్శి మోహార్ సింగ్ శుక్రవారం మృతి చెందారు. ఆయన వయస్సు 68 ఏళ్లు. మోహార్ సింగ్ మృతిపై పార్టీ పొలిట్ బ్యూరో సంతాపం వ్యక్తం చేసింది. విద్యార్థి కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన మోహార్ సింగ్ హిమాచల్ ప్రదేశ్‌లో ప్రజా ఉద్యమాలను నిర్మించారని పొలిట్ బ్యూరో ఒక ప్రకటనలో గుర్తు చేసింది. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా 1991 నుంచి 2004 వరకూ మోహార్ సింగ్ కొనసాగారు. రాష్ట్రంలో ప్రముఖ నేతల్లో ఒకరుగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన రాష్ట్రంలో పార్టీ విస్తరణలో కీలక పాత్ర పోషించారు. 1974లో పార్టీలో చేరిన మోహార్ సింగ్ 1977లో హోల్‌టైమర్‌గా మారారు. పార్టీ కేంద్ర కమిటీలో 1998 నుంచి 2005 వరకూ సభ్యులుగా ఉన్నారు. మోహార్ సింగ్ మృతితో ఒక విలువైన నాయకుడ్ని పార్టీ కోల్పోయిందని పొలిట్ బ్యూరో విచారం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు హృదయపూర్వక సానుభూతి తెలిపింది.

'పనిచేయని' ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాయి

ప్రతిపక్షాలపై మోడీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : కేంద్రంలో పనిచేయని ప్రభుత్వాన్ని ప్రతిపక్ష పార్టీలు కోరుకుంటున్నాయని, బిజెపి మాత్రం సంపూర్ణ అభివృద్ధి కోసం పనిచేసే ప్రభుత్వాన్ని కోరుకుంటుందని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. రెండు రోజుల బిజెపి జాతీయ సమావేశాల్లో మోడీ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ ఏర్పడ్డ పార్టీలన్నీ ఇప్పుడు కాంగ్రెస్‌తో చేతులు కలుపుతున్నాయని అన్నారు. పనిచేయని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షపార్టీలన్నీ ఒక తాటిపైకి వస్తున్నాయని, బిజెపి యేతర కూటమి ఒక విఫల ప్రయోగమని మోడీ వ్యాఖ్యానించారు. దేశ చరిత్రలో మొదటిసారిగా తమ ప్రభుత్వపాలనలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని చెప్పారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రంలో యుపిఎ ప్రభుత్వం ఎన్ని వేధింపులకు పాల్పడినా, అమిత్‌షాను అరెస్టు చేసినా సిబిఐని నిషేధం విధించలేదని, కానీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు సిబిఐపై నిషేధం విధించాయని మోడీ చెప్పారు. పేదరికం కారణంగా యువత అవకాశాలు కోల్పోకూడదనే అగ్రవర్ణాల్లోని పేదలకు 10 రిజర్వేషన్ల బిల్లును తీసుకుని వచ్చినట్టు మోడీ తెలిపారు. అయోధ్య సమస్యను కాంగ్రెస్ ఎప్పటికీ పరిష్కరించలేదని, న్యాయవాదుల ద్వారా సమస్య పరిష్కారానికి ఇబ్బందులు సృష్టిస్తోందని చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడుతూ రాఫెల్ ఒప్పందంతో వేల కోట్ల రూపాయలను మోడీ ఆదా చేసారని తెలిపారు. కాగా, రెండు రోజుల ఈ సమావేశాలు శనివారంతో ముగిసాయి. కాగా, ఈ సమావేశాల్లో తొలి రోజున అమిత్‌షా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలను కోరుతూ, ఎన్నికల్లో బిజెపి ఓడిపోతే పానిపట్టు యుద్ధంలో మరాఠీలు ఓడిపోయినట్లే అని వ్యాఖ్యానించారు.

ఐదో రోజుకి చేరిన బెస్ట్ కార్మికుల సమ్మె

ముంబయి : బ్రిహన్‌ముంబయి ఎలక్ట్రిసిటీ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్ట్ (బెస్ట్) కార్మికులు చేపడుతున్న సమ్మె ఐదోరోజుకి చేరుకుంది. బెస్ట్‌కు చెందిన బడ్జెట్‌ను బ్రిహన్ మునిసిపాలిటీ కార్పోరేషన్ (బిఎంసి)కు చెందిన 'ఎ' బడ్జెట్‌తో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులు సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు పాఠశాలలకు చెందిన రెండు వేల ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేసినట్లు స్కూల్ బస్ ఓనర్స్ అసోసియేషన్ అధికారులు తెలిపారు. వెయ్యి పాఠశాల బస్సులను, మరో వెయ్యి ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పది కిలోమీటర్లకు రూ. 20 మించి వసూలు చేయమని అసోసియేషన్ డైరెక్టర్ అనిల్ గార్గ్ తెలిపారు. కాగా, ముంబయిలోనే లోకల్ ట్రైన్స్ తరువాత బెస్ట్ రెండో అతి పెద్ద రవాణా యంత్రాగం కావడం విశేషం. రోజుకి సుమారు 70 లక్షల మంది ప్రయాణికులు బెస్ట్ బస్సుల ద్వారా ప్రయాణాలు కొనసాగిస్తుంటారు.

మకరజ్యోతి కోసం భారీ భద్రతా ఏర్పాట్లు

18 లక్షల భక్తులు వస్తారని అంచనా

తిరువనంతపురం: శబరిమలలో ఈ నెల 14న జరిగే మకరజ్యోతి ఉత్సవం కోసం కేరళ పోలీసులు తరలివెళ్లారు. సోమవారం జరిగే ఈ ఉత్సవం కోసం సుమారు 18 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఇందుకోసం 6 వేల మంది పోలీసుల అధికారులతో భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మనోజ్ అబ్రహం విలేకరులకు తెలిపారు, భక్తులకు భద్రత కల్పించడంతో పాటు తొక్కిసలాట జరగకుండా, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా, వ్యక్తులు తప్పిపోకుండా పోలీసులు ఏర్పాట్లు చేస్తారని తెలిపారు. పథనంతిట్ట, కొల్లాం వద్ద ఇప్పటికే ఆర్మడ్ కంపెనీలు, రిజర్వ్ పోలీసుల బలగాలు మోహరించాయని తెలిపారు. ఇండియా రిజర్వ్ బాటాలియన్‌కు చెందిన కమెండోలు కూడా ఈ భద్రతా ఏర్పాట్లుల్లో పాల్గొంటారని తెలిపారు. అంతర్జాతీయ తీవ్రవాదుల కుట్రలు ఆలయంపైనా, భక్తులపై జరగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కూడా తెలిపారు. అలాగే భారత వాయుసేన, నౌకదళాలకు చెందిన మి-17, వి-5 యుద్ధవిమానాలు కూడా భద్రత ఏర్పాట్లులో పాలుపంచుకుంటాయని తెలిపారు. ఎరుమెల్లి, ఎలవంకల్, లెహ, వదసెరికర వద్ద పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. నిలకల్ వద్ద కేవలం 7,500 వాహనాలు పార్కింగ్‌కు సౌకర్యం మాత్రమే ఉందని తెలిపారు. గత ఏడాది వరదలతో పంపా వద్ద పార్కింగ్ స్థలాలు కోల్పోయినట్లు తెలిపారు. కాగా గత మకరజ్యోతి ఉత్సవం కోసం 19 వేల కార్లు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అలాగే పార్కింగ్ జోన్ల నుంచి కేరళ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైన్ సర్వీసులు నడపనుందని అంచనా.

తొందరపాటు చర్య : శివసేన వ్యాఖ్యలు


ముంబై : అలోక్‌వర్మను సిబిఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగించడాన్ని శివసేన తప్పుపట్టింది. ఈ మేరకు పార్టీ సామ్నా పత్రిక తాజా సంపాదకీయంలో శనివారం వ్యాఖ్యానించింది. ఇది కేంద్ర ప్రభుత్వ తొందర పాటు చర్యగా అభివర్ణించింది. తనపై వచ్చే ఆరోపణలను సమర్థించుకునేందుకు అన్ని వేదికలను వాడుకునే ప్రధాని మోడీ ఆ అవకాశాన్ని అలోక్‌వర్మకు ఎందుకు ఇవ్వలేదని శివసేన ప్రశ్నించింది. రాఫెల్ కుంభకోణంలో కేంద్ర ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణతో భయపడ్డ మోడీ ఇటువంటి చర్యలకు పూనుకున్నారన్నారు.

అలోక్ వర్మను తొలగించడం అసమంజసం : సుబ్రమణ్య స్వామి

న్యూఢిల్లీ : నరేంద్రమోడీ నేతృత్వంలోని అత్యున్నతస్థాయి కమిటీ సిబిఐ డైరెక్టర్ పదవి నుండి అలోక్ వర్మను తొలగించడం అన్యాయమని బిజెపి నేత సుబ్రమణ్యస్వామి శనివారం విమర్శించారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి) ముందు తన వాదనను వినిపించుకునేందుకు ఆయనకు అవకాశం ఇచ్చి ఉండాల్సిందని వ్యాఖ్యానించారు.

త్రిపురలో 12 గంటల బంద్

స్తంభించిన జనజీవనం



అగర్తలాలో ర్యాలీ

అగర్తలా : జాతీయ పౌరసత్వ(సవరణ) బిల్లును 2016ను వ్యతిరేకిస్తూ ఈ నెల 8న ఆందోళనలు చేపడుతున్న ప్రజలపై పోలీసులు జరిపిన నిర్బంధకాండ, కాల్పులకు నిరసనగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 12 గంటల బంద్‌కు ఆరు గిరిజన పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ బంద్ పిలుపుతో త్రిపుర ట్రైబల్ ఏరియా అటానమస్ డిస్ట్రిక్ కౌన్సిల్(టిటిఎఎడిసి) ప్రాంతం మొత్తం స్థంభించిపోయింది. ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మెలో ఇండిజీనియస్ నేషనలిస్ట్ పార్టీ ఆఫ్ త్రిపుర(ఐఎన్‌పిటి), ఇండిజీనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపిఎఫ్‌టి), త్రిపురాలాండ్ స్టేట్ పార్టీ(టిఎస్‌పి), టిపిఎఫ్, నేషనల్ కాన్ఫరెన్స్ త్రిపుర(ఎన్‌సిటి), డివైబితో పాటు త్రిపుర స్టూడెంట్ ఫెడరేషన్(టిఎస్‌ఎఫ్) పాల్గొన్నాయి. లోక్‌సభలో ఈ బిల్లును ఆమోదానికి ప్రయత్నించిన ప్రధాని నరేంద్రమోడీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా, ముఖ్యమంత్రికి విప్లవ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సాధుపొరా వద్ద మద్దతుదారులతో బంద్‌లో పాల్గొన్న ఐఎన్‌పిటి ప్రధాన కార్యదర్శి జగదీష్ దేబ్బర్మ, ఎన్‌సిటి అధ్యక్షుడు అనిష్ దేబ్బర్మ నిరసనలకు నాయకత్వం వహించారు. ఉత్తర త్రిపుర జిల్లా, సెపహిజల, దక్షిణ త్రిపుర,గోమతి, దలాయి జిల్లాలతో పాటు పలు ప్రాంతాల్లో నిరసనలు మిన్నంటాయి. ఈ బంద్‌కు గిరిజనలతో పాటు, రాష్ట్ర ప్రజలంతా మద్దతునిచ్చారని దేబ్బర్మ అన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా మంగళవారం టిటిఎఎడిసి ప్రధాన కార్యాలయం నుండి అగర్తలాకు నార్త్ ఈస్ట్ స్టూడెంట్ యూనియన్ నిరసనలు చేపట్టింది.. ఖుముల్వాంగ్ వద్దకు వచ్చే సరికి పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురికి బుల్లెట్ గాయాలవ్వగా, సుమారు 15 మంది క్షతగ్రాతులయ్యారు.

ఆందోళనకారులపై 'ఖాకీ' జులుం

అంబులెన్స్‌లు అడ్డుకుని దాడి

త్రిపురలో ఆందోళనకారులపై 'ఖాకీ'ల కాఠిన్య వైఖరికి సంబంధించిన వీడియో ఒకటి నెట్టింట్లో చక్కర్లు కొడుతుంది. కేంద్ర ప్రభుత్వ పౌరసత్వ(సవరణ) బిల్లును 2016ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. రాష్ట్ర పశ్చిమ భాగంలోని ఓ ప్రాంతంలో నిరసనలు తెలుపుతున్న ఆందోళనకారులను అదుపుచేయడానికి పోలీసులు తుపాకులకు పనిచెప్పారు. దీంతో అక్కడ చోటుచేసుకున్న ఘర్షణల్లో ఇద్దరికి బుల్లెట్ గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా రాష్ట్ర పోలీసులు అడ్డగించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో బహిర్గతమైంది. ఈ వీడియోలో రాష్ట్ర రైఫిల్ బృందం వ్యాన్ డ్రైవర్‌పై దాడి చేయగా అతడు అక్కడ నుండి పరారయ్యారు. పోలీసులు అనంతరం అంబులెన్స్ అద్దాన్ని పగలకొట్టి విధ్వంసం సృష్టించారు. బుల్లెట్ గాయలైన ఇద్దరు వ్యక్తులు భయ భాంత్రులకు గురైనట్లు రికార్డైన మరో వీడియోపై పోలీసులను ప్రశ్నించగా. పోలీసులు గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకెళుతున్నారని, అంబులెన్స్‌పై దాడి చేయలేదని అదనపు డైరెక్టర్ జనరల్ రాజీవ్ సింగ్ ఫోన్‌లో సమర్థించుకున్నారు. ఈ ఘటనను ప్రతిపక్షాలు ఖండించగా..ఎన్‌డిఎ కూటమిలో భాగస్వామి, రాష్ట్రంలో బిజెపికి మద్దతునిచ్చిన ఇండిజీనస్ నేషనలిస్ట్ పార్టీ ఆఫ్ త్రిపుర కూడా ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనపై సిట్టింగ్ హైకోర్టు జడ్జి నేతృత్వంలోని న్యాయవిచారణ చేయాలని, క్షతగ్రాతుల కుటుంబాలకు 20 లక్షల నష్టపరిహారంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. బిల్లుకు వ్యతిరేకంగా మంగళవారం ప్రజాస్వామిక పద్ధతిలో నిరసనలు తెలుపుతున్న ఆందోళనకారులపై పోలీసులు కాల్పులు నిరంకుశమని, దీనికి నిరసనగా త్రిపురలో 12 గంటల పాటు బంద్‌ను నిర్వహించినట్లు ప్రతిపక్షపార్టీలు పేర్కొన్నాయి.

ఈబీసీ రిజర్వేషన్ రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ : అగ్రవర్ణాల్లో(ఈబీసీలు) ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉద్దేశించిన '10 శాతం రిజర్వేషన్' బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కొవింద్ శనివారం ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. మంగళవారం ఈ రిజర్వేషన్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలుపగా, బుధవారం రాజ్యసభలో ఆమోదం పొందింది. అయితే ఆ బిల్లుకు సంబంధించి ప్రతిపక్షాలు పలు విమ ర్శలు చేశాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బిజెపి చేస్తున్న గిమ్మిక్కుగా అభివర్ణించాయి. స్వతంత్ర సంస్థలు ఇచ్చిన నివేదిక ప్రకారం.. గత 15 నెలల కాలంలో దేశంలో డిసెంబర్‌లో నిరుద్యోగిత పెరిగింది. ఇది వచ్చే ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపే అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు. తాజా రాజ్యాంగ సవరణతో ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ కళాశాలల్లో ఈబీసీలు 10 శాతం రిజర్వేషన్లు పొందనున్నారు. దీనికి గానూ సంవత్సరం ఆదాయం, రూ.8 లక్షలు, 5 ఎకరాల పొలంలోపు ఉన్నవారు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయి ంచింది.

'రాళ్ల దెబ్బలకు ఎకె 47తో బదులిస్తా'

జగత్ సింగ్ వ్యాఖ్య

రామ్‌ఘర్ /జైపూర్ : రాజస్తాన్‌లోని బహుజన సమాజ్‌వాది పార్టీనేత జగత్ సింగ్ చేసిన బెదిరింపు వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వివాదాస్పద మయ్యాయి. 'రాళ్ల దెబ్బలకు తాను ఎకె 47తో సమాధానమిస్తాను' అని సీనియర్ కాంగ్రెస్ నేత నట్వర్ సింగ్ కుమారుడు జగత్ సింగ్ రామ్‌ఘర్‌లో చేపట్టిన ర్యాలీలో వ్యాఖ్యానించారు. బిజెపి ప్రభు త్వంలో కాంగ్రెస్ కార్యకర్తలకు ఆపద కలుగుతోం దని, వారిని రక్షించేందుకు తాను వెళతానని జగత్ పేర్కొన్నారు. వారు కాల్పులకు దిగినా ఎదురు నిలబడతానని అన్నారు. నరేంద్రమోడీ, వసుంధరా రాజే, అశోక్ గెహ్లాట్‌ల రాళ్ల దాడికి తాను ఎకె 47తో అందరిని ఆప్రాంతం నుండి తరిమేస్తానని అన్నారు. కాగా, ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని బిజెపి నేత రాజేంద్ర రాథోర్ అన్నారు. జగత్ బిజెపిలో ఉన్న సమయంలో మోడీజీ, వసుంధరాజీ అని గౌరవంగా పిలిచేవారని అన్నారు. బిజెపిని వీడి బిఎస్‌పిలో చేరిన అనంతరం 'ఆయా రామ్ గయా రామ్' లాగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో రామ్‌ఘర్ ప్రజలు ఆయనను తిరస్కరిస్తారని అన్నారు.

పాకిస్తాన్ బోట్‌ను అదుపులోకి తీసుకున్న భారత బిఎస్‌ఎఫ్

గాంధీనగర్ : పాకిస్తాన్‌కు చెందిన ఫిషింగ్‌బోట్‌ను అదుపులోకి తీసుకున్నట్లు గుజరాత్ సరిహద్దు భద్రతా అధికారులు (బిఎస్‌ఎఫ్) తెలిపారు. అంతర్జాతీయ సరిహద్దు నిబంధనలను ఉల్లంఘించి భారత జలాల్లోకి ప్రవేశించడంతో బోట్‌తో పాటు మత్స్యకారులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా, గతేడాది ఇదేవిధంగా ఒక పాకిస్తాన్ బోట్‌తో పాటు ఏడుగురు సిబ్బందిని గుజరాత్ తీర ప్రాంతంలో సంబంధిత అధికారులు బంధించిన సంగతి తెలిసిందే.

ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ : స్థానిక ప్రగతి విహార్‌లో ఉన్న సిబిఓ కాంప్లెక్స్‌లో శనివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బ్లాక్-14లో మంటలు చెలరేగడంతో దాదాపు 15 అగ్నిమాపక యంత్రాలతో మంటలను ఆర్పేందుకు సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

ఎన్ఐఎ అదుపులో మరో యువకుడు

న్యూఢిల్లీ/మీరట్: ఐసిస్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ హర్కుత్-ఉల్- హర్బ్-ఇ-ఇస్లాం సంస్థపై విచారణలో భాగంగా నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఎ) అధికారులు శనివారం మరొకరిని అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో మహమ్మద్ అబ్సార్ అనే 24 ఏళ్ల యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంస్థకు సంబంధించిన వారు ఢిల్లీ, ఉత్తర భారతదేశంలోని మరికొన్ని ప్రాంతాల్లో బాంబు పేలుళ్ల, ఆత్మాహుతి దాడులు, ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ నాయకులే లక్ష్యంగా కుట్ర పన్నినట్లు ఎన్ఐఎ అధికారులు వెల్లడించారు.

బిజెపి పాలనలో అసహనం పెరిగింది

రాహుల్ వ్యాఖ్య



దుబాయ్ : మోడీ సర్కార్ నాలుగున్నరేళ్ల పాలనలో అసహనం, ఆగ్రహం పతాక స్థాయికి చేరుకుందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన ఐఎంటి దుబాయ్ యూనివర్శిటీ విద్యార్థులతో ముఖాముఖీ చర్చలో పాల్గొంటూ, భారత్ ప్రజలపై ఒకే రకమైన ఆలోచనలను రుద్దదని, విభిన్న భావజాలాన్ని ఇముడ్చుకోగలదని అన్నారు. భారత్ వినూత్న భావజాలాన్ని ప్రోత్సహిస్తుందని, తద్వారా అభివృద్ధికి నాంది పలుకుతుందని రాహుల్ పేర్కొన్నారు. దేశ సంస్కృతిలో సహనం ఒక ప్రధానాంశమని. కానీ మోడీ సర్కార్ నాలుగున్నరేళ్ల పాలన విద్వేషాగ్ని, సామాజిక వర్గాల మధ్య విభజనలు పెంచిందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ గళాలు విప్పుతున్న పాత్రికేయులు, ప్రజలపై కాల్పులు జరిపిన భారత్ వద్దని, దాన్ని మార్చాలని తాము సన్నద్ధమౌతున్నామని, రానున్న ఎన్నికల్లో ఇది తమకు అతిపెద్ద సవాలు కానుందని అన్నారు. రానున్న రోజుల్లో ఆరోగ్య సంరక్షణలో ప్రపంచ దేశాలకు భారత్ మార్గదర్శకంగా మారుతుందని, రానున్న 10-15 సంవత్సరాల్లో చికిత్స, ఆరోగ్య సదుపాయాలు మెరుగవుతాయని అన్నారు. భారత్ తన బ్యాంకింగ్ వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని, తద్వారా చిన్న, మధ్యతరహా సంస్థల అభివృద్ధికి వనరులు అందుబాటులోకి వస్తాయని రాహుల్ అన్నారు.

ఆ మూడు నకిలీ ఎన్‌కౌంటర్‌లే

గుజరాత్ ఎన్‌కౌంటర్లపై నివేదిక సమర్పించిన కమిటీ

న్యూఢిల్లీ: గుజరాత్‌లో 2002 నుంచి 2006 మధ్య జరిగిన 17 పోలీసు ఎన్‌కౌంటర్లలో మూడు నకిలీవిగా వెల్లడైంది. ఈ ఎన్‌కౌంటర్ కేసులను దర్యాప్తు చేసిన ఒక కమిటీ సుప్రీంకోర్టుకు ఈ విషయాన్ని తెలిపింది. ఈ ఎన్‌కౌంటర్‌లపై దర్యాప్తు చేసే పర్యవేక్షణ కమిటీ చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ జడ్జి హెచ్‌ఎస్ బేడీని నియమించింది. నిందితులను నిర్బంధించి హత్య చేసి ఎన్‌కౌంటర్లుగా ప్రకటించిన మూడు ఘటనలకు సంబంధించి తొమ్మిది మంది పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని బేడి నేతత్వంలోని కమిటీ కోర్టుకు సిఫార్సు చేసింది. 229 పేజీల తుది నివేదికను గత ఏడాది ఫిబ్రవరిలో సీల్డ్ కవర్‌లో అత్యున్నత న్యాయస్థానానికి అప్పగించింది. ఈ నివేదికలో సమీర్‌ఖాన్, కాసమ్ జాఫర్, హాజీహాజీ ఇస్మాయిల్ అనే వ్యక్తులను నిర్బంధించి, నకిలీ ఎన్‌కౌంటర్‌లో హత్య చేసినట్లు తగిన సాక్ష్యాలు ఉన్నట్లు తెలిపింది. ఈ కేసులపై ఐపిఎస్ అధికారి విచారణకు ఈ కమిటీ సిఫార్సు చేయలేదు.

ప్రత్యేకం

ఆర్థిక ఏడాది పూర్తికాకుండానే

ఉపాధి హామీ నిధులు ఖాళీ

పథకానికి అదనపు నిధులు ఇవ్వండి • ప్రధానికి ఎంపిలు, ఎమ్మెల్యేల లేఖ



న్యూఢిల్లీ : 2018-19 ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా మూడు నెలల సమయం ఉన్నా.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి (ఎంఎన్ఆర్‌ఈజిఎ) కేటాయించిన నిధులు దాదాపుగా ఖాళీ (99.62 శాతం) అయ్యాయి. అయినా ఇప్పటి వరకూ అదనపు నిధులను కూడా కేటాయించలేదు. దీంతో ఈ పథకానికి అదనపు నిధులు కేటాయించాలని వివిధ రాష్ట్రాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రధాని మోడీకి లేఖ రాసారు. ఈ లేఖపై ప్రముఖ ఉద్యమకారులు, విద్యావేత్తలు, ఇతర ప్రముఖులు సంతకాలు చేశారు. ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని వారు విమర్శించారు. 'బడ్జెట్ కేటాయింపుల్లో అక్రమంగా ఆంక్షలు విధించడం, వేతనాలు చెల్లింపుల్లో ఆలస్యం చేయడం, వేతనాలు తక్కువగా ఇవ్వడం..' వంటి కారణాలతో ఈ పథకాన్ని నీరుకారుస్తున్నారని ఈ లేఖలో పేర్కొన్నారు.

ఎంఎన్ఆర్‌ఈజిఎ పథకానికి క్రమపద్ధతిలో నిధులు ఇవ్వాలని, ఈ పథకంలో వేతనాలు కనీస వేతనాలకంటే తక్కువ ఉండకూడదని, కార్మికులకు సకాలంలో చెల్లింపులు జరపాలని ఈ లేఖలో డిమాండ్ చేశారు. కొన్ని సంవత్సరాల నుంచి బడ్జెట్‌లో ఈ పథకానికి నిధులు కేటాయింపులు తగ్గుతూ వస్తున్నాయని ఈ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వేతనాలు చెల్లింపుల్లో జాప్యం జరగడం వలన గత ఏడాది చెల్లింపులకు ఈ ఏడాది బడ్జెట్ కేటాయించాల్సి వస్తోందని తెలిపారు. ఉదాహరణకు ప్రస్తుత బడ్జెట్ కేటాయింపుల్లో 28 శాతం నిధులను పాత బకాయిలకే ఖర్చు చేశారని వెల్లడించారు. ప్రస్తుత కరువు సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం అవసరం ఎంతో ఉందని, కాబట్టి వెంటనే నిధులు కేటాయించాలని ప్రజాప్రతినిధులు ఈ లేఖలో మోడీకి విజ్ఞప్తి చేశారు.

సంక్షిప్తం

ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్ : దక్షిణ కాశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. జిల్లాలోని కతపోరా గ్రామం వద్ద భద్రతా సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఈ ఎన్‌కౌంటర్ ఘటన సంభవించింది. తీవ్రవాదులుగా అనుమానిస్తున్న వారు ముందుగా కాల్పులకు దిగడంతోనే తాము ఎదురుకాల్పులు ప్రారంభించామని భద్రతా సిబ్బంది తెలిపారు. కాగా, ఎన్‌కౌంటర్ జరగడంతో స్థానిక యువకులు భద్రతా సిబ్బందిపై రాళ్లదాడికి దిగారు. దీంతో నిరసనకారులను చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది టియర్ గ్యాస్ ఉపయోగించారు.

వంతెనకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న మహిళ

రాంచీ : జార్ఖండ్‌లోని ధన్‌బాద్ రైల్వేస్టేషన్‌లోని రెండు ఫ్లాట్‌ఫాంలను అనుసంధానించిన పాదచారుల వంతెనకు ఒక మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోసుకున్న ఘటన చోటు చేసుకుంది.. నాలుగు, ఐదవ ఫ్లాట్‌ఫాంలకు అనుసంధానంగా ఈ కాలినడక వంతెన ఉందని, ఆమె తన చీరతో ఉరివేసుకొని ప్రాణాలు విడిచిందని పోలీసులు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి చివరి రైలు వెళ్లిన అనంతరం ఈ ఘటన జరిగి ఉండవచ్చునని, శనివారం ఉదయం పారిశుధ్య కార్మికులు గమనించి తమకు విషయాన్ని తెలియజేశారని వెల్లడించారు. ఘటనాస్థలంలో ఒక చలికోటు, బ్యాగ్, పర్సును గుర్తించామని అన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని పోలీసులు చెప్పారు.

అక్రమ రవాణా నుంచి 669 మంది చిన్నారులను రక్షించాం

గౌహతి : 2018లో ఈశాన్య భారత సరిహద్దు రైల్వే పరిధిలో 669 మంది చిన్నారులను అక్రమ రవాణా నుంచి కాపాడామని ఈశాన్య సరిహద్దు రైల్వే ప్రతినిధి శనివారం తెలిపారు. బాలబాలికలను ఇతర రాష్ట్రాలను తరలిస్తున్న 9 మందిని అరెస్టు చేశామన్నారు. గత నెలలో నాగాలాండ్‌లోని దిమాపూర్ ప్రాంతానికి చెందిన ఐదుగురు చిన్నారులు ఇంటి నుంచి పారిపోయిన ఘటనకు సంబంధించి ముగ్గురిని బ్రహ్మపుత్ర మెయిల్లో, ఇద్దరిని జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో గుర్తించి వారి కుటుంబసభ్యులకు అప్పజెప్పామన్నారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తా

డెమోక్రాట్ ప్రతినిధి తులసి గబ్బార్డ్



వాషింగ్టన్ : వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తానని డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధి, అమెరికా కాంగ్రెస్‌లో మొట్టమొదటి హిందూ సభ్యురాలు తులసి గబ్బార్డ్ తెలిపారు. వచ్చే వారం దీనిపై లాంఛనప్రాయంగా ఒక ప్రకటన చేయాలని నిర్ణయించినట్లు ఆమె చెప్పారు. ఇరాక్ యుద్ధంలో పాల్గొన్న, ప్రస్తుతం విదేశీ వ్యవహారాల కమిటీలో పనిచేస్తున్న 37ఏళ్ళ గబ్బార్డ్ మాట్లాడుతూ, తన ఎన్నికల ప్రచారంలో యుద్ధం, శాంతి ప్రధాన అంశాలుగా వుంటాయన్నారు. అమెరికన్లు ఎదుర్కొంటున్న పలు సవాళ్ళు తనను చాలా ఆందోళనకు గురి చేస్తున్నాయని అన్నారు. వాటిని పరిష్కరించడంలో తాను సాయపడాలని భావిస్తున్నట్లు చెప్పారు. అందరికీ ఆరోగ్య సంరక్షణ, క్రిమినల్ జస్టిస్ సంస్కరణలు, వాతావరణ మార్పులు వంటి పలు అంశాలను ఆమె ప్రస్తావించారు. మరో వైపు డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి తాను కూడా బరిలోకి దిగనున్నట్లు హౌసింగ్, పట్టణాభివృద్ధి శాఖ మాజీ మంత్రి జులియన్ కాస్ట్రో సూచనప్రాయంగా వెల్లడించారు. టెక్సాస్‌లోని తన సొంత పట్టణం ఆంటోనియో నుంచి డెమొక్రటిక్ పార్టీ తరపున పోటీ చేసేందుకు ఆయన సిద్దమవుతున్నారు. ఇందుకు సంబంధించి ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ఆయన ప్రకటన చేయనున్నారు.



పారిస్‌లో పేలుడు

ముగ్గురు మృతి 46 మందికి గాయాలు

పారిస్ : సెంట్రల్ పారిస్‌లోని బేకరీ వద్ద శనివారం జరిగిన పేలుడులో ముగ్గురు మృతి చెందారు మరో 46 మంది గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గ్యాస్ లీక్ వల్లే పేలుడు సంభవించి వుంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. పారిస్‌లోని గ్రాండ్స్ బోలెవార్డ్స్ జిల్లాలోని రూ ట్రెవైజ్ వద్ద గల బేకరీ ఉదయం 9గంటల సమయంలో పేలుడు సంభవించింది. వెంటనే మంటలు సమీప భవనాలకు కూడా వ్యాపించాయి. పేలుడు ధాటికి బేకరీ గ్రౌండ్ ఫ్లోర్ పూర్తిగా నేలమట్టమైంది. ఆ ప్రాంతమంతా శిధిలాలు చెల్లాచెదురుగా కనిపిస్తున్నాయి. మంటలను అదుపుచేసేందుకు అగ్నిమాపక యంత్రాలు ప్రయత్నిస్తున్నాయి. బేకరీ, చుట్టుపక్కల భవనాలు బాగా దెబ్బతిన్నట్లు సోషల్ మీడియా చిత్రాల ద్వారా తెలుస్తోంది. ఈ పేలుడుకు సంబంధించి అధికార సమాచారం ఇంకా తెలియాల్సి వుంది. కాగా గత 9 వారాలుగా జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా వుంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులో వుందని హోం మంత్రి క్రిస్టోఫ్ తెలిపారు. 200మంది మంటలతో పోరాడుతున్నారని చెప్పారు.



ట్రంప్‌పై 2017లోనే దర్యాప్తు మొదలైంది

న్యూయార్క్ టైమ్స్ కథనం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా తరపున పనిచేస్తున్నారా లేదా అని నిర్ధారించేందుకు ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్విస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) 2017లోనే విచారణ ప్రారంభించిందని న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. 2017 మేలో ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా జేమ్స్ కామేను అధ్యక్షుడు తొలగించిన వెంటనే ఈ దర్యాప్తు ఆరంభమైంది. ఈ దర్యాప్తులో ప్రధానంగా రెండు అంశాలు వున్నాయి. ఒకటి ట్రంప్ కార్యకలాపాలపై నిఘా విధించడం, రెండవది క్రిమినల్ కోణం వుందా లేదా అని నిర్ధారించడం ఈ దర్యాప్తులో ముఖ్యమైన భాగం. ట్రంప్ తెలిసి కానీ తెలియక కానీ అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకంగా రష్యా తరపున పనిచేస్తున్నారా లేదా అలాగే ట్రంప్ దేశ భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్నారా లేదా అని విచారించడం ఇందులో కీలకమని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. కామేను తొలగిస్తూ ట్రంప్ తీసుకున్న చర్య వెనుక క్రిమినల్ కోణం వుందా అనేది కూడా విచారిస్తున్నారు. 2016 ఎన్నికల ప్రచారం సందర్భంగా రష్యాతో ట్రంప్‌కు సంబంధాలు వున్నాయని ఎఫ్‌బిఐ అనుమానిస్తోంది. కాగా రాబర్ట్ ముల్లర్ సాగిస్తున్న దర్యాప్తును తనను 'వెంటాడి వేధించడం'గా ట్రంప్ విమర్శిస్తున్నారు. అధ్యక్షుడిగా తనకు గల చట్టబద్ధతపై ఇదొక మరక వంటిదని వ్యాఖ్యానిస్తున్నారు.

వరుసగా తొమ్మిదో వారమూ యెల్లో వెస్ట్స్ నిరసనలు



పారిస్: మాక్రాన్ పొదుపు చర్యలకు వ్యతిరేకంగా వరుసగా తొమ్మిదో శనివారం కూడా నిరసనలు కొనసాగాయి. ఫ్రాన్స్‌లో పలు ముఖ్యమైన కేంద్రాల్లో యెల్లోవెస్ట్స్, కార్మికులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో గుమి కూడి నిరసన ప్రదర్శనలు జరిపారు. నిరసనకారులను అణచివేసేందుకు మాక్రాన్ ప్రభుత్వం పెద్దయెత్తున పోలీసులు మోహరించింది. పోలీసులకు సహాయంగా 80 వేల మంది ఏజెంట్లను నియమించింది. ఒక్క పారిస్‌లోనే 5వేల మంది ఏజెంట్లను పెట్టింది. శనివారం తెల్లవారేసరికే పారిస్‌లోని డిస్ చాంప్స్ ఎలీస్ ఎవెన్యూ వద్ద బ్యారికేడ్లను ఛేదించుకుని ప్రదర్శకులు రోడ్లపైకి వచ్చారు. దీంతో అధికారులు ట్రాఫిక్‌ను ఇతర మార్గాల గుండా మళ్లించారు. యెల్లో వెస్ట్స్ బోర్జెస్ పట్టణంలో ఓ సభను నిర్వహించారు. ఆంతరంగిక భద్రతా శాఖ మంత్రి న్యూనెజ్ ట్విట్టర్ ద్వారా నిరసనకారులను హెచ్చరించారు. అల్లర్లకు పాల్పడినవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. పారిస్ వాసులైనా, ఫ్రాన్స్‌లోని ఇతర ప్రాంతాలకు చెందినవారైనా హింసకు దిగితే కఠినంగా అణచివేస్తామని చెప్పారు. నిరసనల ముందు రోజున అంటే శుక్రవారం నాడు అధ్యక్షుడు మాక్రాన్ ఆందోళనకారులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఫ్రాన్స్ బలమైన దేశంగా తిరిగి ఎదిగేందుకు చేస్తున్న కృషిని మతిమాలినతనంతో అడ్డుకోజూస్తున్నారని నిరసనకారులను నిందించారు. గత వారం అంటే జనవరి 6న నిరసనలు జరిగిన అనంతరం ప్రధాని ఎడ్వర్డ్ ఫిలిప్పి ఒక ప్రకటన చేస్తూ, నిరసనలు, ఆందోళనలపై ప్రభుత్వం ఆంక్షలు విధిస్తూ ఒక డిక్రీని జారీ చేస్తుందన్నారు. దాదాపు 50 వేల మంది యెల్లో వెస్ట్స్ ప్రదర్శకులు శనివారం ఆందోళనలో పాల్గొన్నారు.

తూర్పు గాజాలో ఘర్షణలు

పలువురు పాలస్తీనియన్లకు గాయాలు

గాజా : తూర్పు గాజాలో వందలాదిమంది పాలస్తీనా ప్రదర్శకులు, ఇజ్రాయిల్ సైనికుల మధ్య శుక్రవారం మధ్యాహ్నం ఘర్షణలు చెలరేగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇజ్రాయిల్ సరిహద్దుకు సమీపంలో వున్న ఈ ప్రాంతంలో ఇజ్రాయిల్ సైనికుల తూటాలకు, రబ్బర్ బుల్లెట్లకు, బాష్పవాయు గోళాలకు అనేకమంది పాలస్తీనియన్లు గాయపడ్డారని వారు తెలిపారు. గతేడాది మార్చి నుండి ప్రతి వారం జరుగుతున్న ఇజ్రాయిల్ వ్యతిరేక ప్రదర్శనల్లో భాగంగా శుక్రవారం నాటి నిరసనలు సాగాయి. గత 42 శుక్రవారాలుగా ఈ ఘర్షణలు కొనసాగుతున్నాయి.. పాలస్తీనా పతాకాలు చేబూని, ఇజ్రాయిల్ వ్యతిరేక నినాదాలు చేస్తూ వందలాదిమంది ఆందోళనకారులు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. 'దిగ్బంధనాన్ని అతిక్రమించే శుక్రవారం' అని నినదిస్తూ ర్యాలీలు, ప్రదర్శనల్లో చేతులు కలపాల్సిందిగా పలువురు ఆందోళనకారులు పిలుపిచ్చారు. ఈ ఆందోళనలు ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు 240 మంది పాలస్తీనియన్లు మరణించారు. 25వేల మందికి పైగా గాయపడ్డారు.

22వ రోజుకు చేరిన షట్‌డౌన్

అమెరికా అంతటా నిరసనలు

వాషింగ్టన్ : ప్రభుత్వ షట్ డౌన్ రోజుల తరబడి కొనసాగుతుండడంతో అమెరికన్ ఫెడరల్ ఉద్యోగుల్లో అలజడి అంతకంతకూ పెరుగుతోంది. ఎనిమిది లక్షల మంది లాక్డ్ అవుట్, అన్ పెయిడ్ ఫెడరల్ కార్మికులు శనివారం కూడా నిరసనలు కొనసాగించారు. ఫ్లోరిడాలో వీరికి మద్దతుగా డెమొక్రాట్లు కూడా వీధుల్లోకి వచ్చారు. ట్రంప్ బలవంతంగా రుద్దిన ఈ షట్‌డౌన్ వల్ల ఫెడరల్ కాంట్రాక్టు ఉద్యోగులు రోజుకు 20 కోట్ల డాలర్ల మేర వేతనాన్ని నష్టపోతున్నట్లు బ్లూమ్‌బర్గ్ పత్రిక తెలిపింది. లాకౌట్ ముగిసినా వీరికి ఈ మొత్తాన్ని ప్రభుత్వం తిరిగి చెల్లించే పరిస్థితి లేదని అది వివరించింది. ఫెడరల్ ఉద్యోగం అంటే ఒక భద్రత కలిగిన జాబ్ అని అనుకునేవాళ్లు. ఇప్పుడీ షట్‌డౌన్ తరువాత దీనికి కూడా గ్యారంటీ లేకుండా పోయిందని ప్రధాన కార్మిక సంఘం ఎఎఫ్‌ఎల్-సిఐఓ నేత పేర్కొన్నాయి. షట్‌డౌన్ దెబ్బకు తీవ్రంగా నష్టపోతున్నది ఉద్యోగులు, కార్మికులే. వేతనాలు ఆగిపోవడం వల్ల వంట గ్యాస్‌కి డబ్బుల్లేవు. మోటారు వాహనాలకు ఇంధనం నింపాలంటే డబ్బుల సమస్య. నిత్యావసర సరుకులు కొనుక్కోవడానికి డబ్బులుండవు. ప్రభుత్వం అందించే ప్రాథమిక సదుపాయాలన్నీ స్తంభించిపోయాయి వెరసి. సాధారణ ప్రజా జీవనాన్ని ఇది చిన్నాభిన్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో షట్‌డౌన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు గత రెండు రోజులుగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నా అధ్యక్షుడు ట్రంప్ వైఖరిలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. షట్ డౌన్ 22వ రోజుకు చేరుకుని చరిత్రలో అతి సుదీర్ఘమైన షట్‌డౌన్‌గా రికార్డుకెక్కింది.

క్యూబా విప్లవ 60వ వార్షికోత్సవానికి ఇరాన్ కమ్యూనిస్టు పార్టీ జేజేలు

టెహ్రాన్: క్యూబా విప్లవ 60 వ వార్షికోత్సవాల సందర్భంగా క్యూబన్ కమ్యూనిస్టు పార్టీకి ఇరాన్ కమ్యూనిస్టు పార్టీ (తుదే పార్టీ) అభినందనలు తెలిపింది. క్యూబా కమ్యూనిస్టు పార్టీ ప్రథమ కార్యదర్శి రావుల్ కాస్ట్రోకు ఈ మేరకు ఒక సౌహార్ద సందేశాన్ని మంగళవారం పంపింది. తుడే పార్టీ తరపున, పార్టీ మద్దతుదారులు, ప్రగతిశీల శక్తుల తరపున, యావత్ ఇరాన్ ప్రజల తరుపున క్యూబా ప్రజలకు , క్యూబన్ కమ్యూనిస్టు పార్టీకి తమ పూర్తి సంఘీభావాన్ని తెలియజేసింది.' నిరంకుశ బటిస్టా ప్రభుత్వాన్ని కూలదోసి, క్యూబాపై అమెరికా ఆధిపత్యానికి అంతం పలికి, క్యూబా ప్రజల సోషలిస్టు భవిష్యత్తు నిర్మాణానికి నాంది పలికిన విప్లవానికి 2019 జనవరి1 నాటికి అరవై ఏల్లు పూర్తయ్యాయి. ఈ పరివర్తనా కాలంలో క్యూబా సిసలైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సోషలిస్టు పంథాతో ముందుకు సాగింది. 60 ఏళ్ల ప్రస్థానంలో క్యూబా విప్లవం అనేక ఒడుదుడుకులను, సవాళ్లను అధిగమించేందుకు దృఢ నిశ్చయంతో పోరాడింది. అరవై ఏళ్లుగా మీరు ఎదుర్కొంటున్న ఆర్థిక దిగ్బంధనాలు, ఆంక్షలు, దురాక్రమణపూరిత దాడులు, విద్రోహకర చర్యలు, వరుసగా వచ్చిన అమెరికా ప్రభుత్వాల నేతృత్వంలో విప్లవ ప్రతీఘాత శక్తులు సంఘటితంగా, ఆర్థికపరంగా సాగించిన కుట్రలు వీటన్నిటినీ అధిగమించి నూతన సోషలిస్టు క్యూబా నిర్మాణానికి మీ పార్టీ అకుంఠిత దీక్షతో సాగించిన కృషి మరువరానిది. క్యూబాపై మాదిరిగానే ఇరాన్‌పై కూడా అమెరికా ఆంక్షలు విధిస్తోంది. మేము ఈ ఆంక్షల విధింపును ఖండిస్తున్నాము. క్యూబాపై ఆర్థిక దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని, అన్ని దేశాల మధ్య మామూలు సంబంధాలు వుండాలని కోరుకుంటున్నాము. అమెరికా తీవ్రమైన ఆర్థిక దిగ్బంధనాన్ని విధించినప్పటికీ విప్లవ క్యూబా విద్య, వైద్యం, సాంస్కృతిక, శాస్త్ర, సాంకేతిక, సామాజిక సమారస్యం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ శాంతిని కాపాడడం, అంతర్జాతీయవాదాన్ని పెంపొందించడం, మహిళలు, వృద్ధుల స్థితిగతులను గణనీయంగా మెరుగుపరచడం, ఎలాంటి వివక్షకు తావు లేకుండా పౌరులందరికీ సమాన హక్కులు కల్పించడంలో క్యూబా అద్భుతాలు సాధించిందనే విషయం ప్రత్యర్థులు సైతం అంగీకరించక తప్పని స్థితి. క్యూబా కామ్రేడ్లు రికార్డు స్థాయిలో సాధించిన ఈ విజయాలు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాల మధ్య నిజమైన సౌహార్ధతను పెంపొందించడంలో క్యూబా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని క్యూబన్ విప్లవ ప్రభుత్వం నిర్వహించిన పాత్ర అనన్యసామాన్యమైనది' అని తుడే పార్టీ కేంద్ర కమిటీ తన సందేశంలో కొనియాడింది.

మొదటి పేజీ తరువాయి

బాబూ ధాన్యం కొనండి

కొలబద్దల (పారామీటర్స్)ను సాకుగా చూపి అటు మిల్లర్లు, వ్యాపారులు ఇటు పౌరసరఫరాల శాఖ, సెర్ప్ గ్రూపులు నిర్ద్వందంగా తిరస్కరిస్తున్నాయి. గత్యంతరం లేని బాధిత రైతులు అయినకాడికి తెగనమ్ముకొని నష్టపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)పై కొనుగోలు చేయాలంటూ పదకొండు రోజుల పాటు ప్రభుత్వం నిర్వహించిన 'జన్మభూమి- మా ఊరు' గ్రామసభల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారులకు అన్నదాతలు మొరపెట్టుకున్నారు. నిరసనలకు దిగారు. అయినా సర్కారులో స్పందన కరువైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేంటంటే కొలబద్దల మార్పు కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని, కేంద్రం నుంచి ఎలాంటి సమాచారం లేదని రాష్ట్రం తప్పించుకుంటోంది. అటు కేంద్రం సైతం రాష్ట్రం పంపిన అభ్యర్థనపై మీనమీషాలు లెక్కిస్తోంది. తొలుత రాష్ట్రం పౌరసరఫరాల శాఖ ద్వారా రైతుల నుంచి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తర్వాత కేంద్రంతో మాట్లాడుకొనేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఎపి సర్కారు అటు వైపు ఆలోచించట్లేదని రైతులు వాపోతున్నారు.

రెండు దెబ్బలు

ఈసారి ఖరీఫ్‌ను రెండు తుపాన్లు కబళించాయి. అక్టోబర్ రెండో వారంలో శ్రీకాకుళం జిల్లాను తిత్లీ తుపాను అతలాకుతలం చేసింది. విజయనగరంలోని కొన్ని ప్రాంతాలపై సైతం తుపాను ప్రభావం ఉంది. రెండు జిల్లాల్లో కలిపి నాలుగు లక్షల ఎకరాల్లో వరి దెబ్బతిన్నదని సర్కారే ప్రకటించింది. ఇక డిసెంబర్ మూడవ వారంలో విరుచుకుపడ్డ పెథాయి తుపాను వలన కురిసిన భారీ వర్షాలకు శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకు ఏడు జిల్లాల్లో 1.31 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఈ ఏడాది పంట దిగుబడులపై వేసిన మొదటి ముందస్తు అంచనాల ప్రకారం ఎకరానికి రెండు వేల కిలోలు (రెండు టన్నులు) ధాన్యం దిగుబడి లభిస్తుంది. ఆ లెక్కల ప్రకారం చూస్తే తిత్లీ తుపాను వలన ఎనిమిది లక్షల టన్నులు, పెథాయి తుపాను వలన మరో రెండున్నర లక్షల టన్నుల మేర ధాన్యం దెబ్బతిన్నదని తెలుస్తోంది. కాగా సర్కారు పంట నష్టం అంచనాలేసేటప్పుడు 33 శాతం నష్టాలను మాత్రమే నమోదు చేస్తోంది. అంతకంటే తక్కువ నష్టాలను పరిగణనలోకి తీసుకోవడంలేదు. 33 శాతం లోపు దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా లెక్కిస్తే తడిచిన, దెబ్బతిన్న ధాన్యం పరిమాణం ఇంకా పెరుగుతుంది.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఆదివాసీలకు తీవ్ర నష్టం

చింతకాయల బాబూరావు ప్రారంభించారు. మాజీ ఎంపీ మిడియం బాబూరావు గిరిజన సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జితేంద్రచౌదరి మాట్లాడుతూ దేశంలో ఆదివాసీల జీవనం, సంస్కృతి, ఆచారాల పరిరక్షణలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తోందని విమర్శించారు. గిరిజన, ఆదివాసీలున్న కొద్ది రాష్ట్రాల్లోనే వారి అభివృద్ధికి, సంక్షేమానికి ప్రత్యేక నిధులున్నా, వాటిని వినియోగించడంలో కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆదివాసీల భాష, సంస్కృతి అభివృద్ధి జరిగితే వారి జీవన విధానం మారుతుందన్నారు. ఆదివాసీల అభివృద్ధిలో విద్య, వైద్యంతోపాటు సంప్రదాయాల పరిరక్షణ ముఖ్యమన్నారు. త్రిపుర రాష్ట్రం దేశంలోనే అతితక్కువ జనాభా కలిగి, వైశాల్యం తక్కువ ఉన్నా గత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ హయాంలో ఆదివాసీల విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. త్రిపురలో త్రిపురి తెగవారు అత్యధికంగా ఉన్నారన్నారు. బ్రిటీషు వారికంటే ముందు 1300 సంవత్సరాలు పాలించిన రాజులు, జమీందారులకు వ్యతిరేకంగా భాషాభివృద్ధి కోసం జనవిముక్తి పరిషత్ ఆధ్వర్యాన ఆందోళనలు జరిగాయన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఐదో షెడ్యూలు అమలవుతుంటే త్రిపుర రాష్ట్రంలో ఆరో షెడ్యూలు అమలవుతుందన్నారు. ఈ ఆరో షెడ్యూల్ వల్ల ఆదివాసీల భూపరిరక్షణ, స్వయంపాలన జరుగుతుందన్నారు. ఆదివాసీలలో ఉన్న మూఢ నమ్మకాలను పోగొట్టేలా, విద్య, వైద్యం విషయంలో వెనుకబాటు లేకుండా ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం శ్రద్ధ తీసుకుందని చెప్పారు. త్రిపురలో విహెచ్‌పి, భజరంగదళ్, వనవాసీ కల్యాణ పరిషత్ పేరుతో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఆదివాసీల మనుగడకు ముప్పు తెస్తున్నాయన్నారు. ఆదివాసీలకు సబ్‌ప్లాన్ నిధులు జనాభా ప్రాతిపదికన అమలు చేయాల్సి ఉండగా, ప్రభుత్వాలు సక్రమంగా వినియోగించడం లేదని చెప్పారు. దేశవ్యాప్తంగా ఆదివాసీల మనుగడను దెబ్బతీసేలా ఉన్న ప్రభుత్వాల విధానాలపై ఆందోళనలతోపాటు, విద్య, వైద్యం, ఉపాధి వంటి సామాజిక కార్యక్రమాల్లో ఆదివాసీ విజ్ఞానకేంద్రం మరింత అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తెల్లం రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రవి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రాష్ట్రాల హక్కులపై జాతీయ స్థాయిలో చర్చ

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎయిర్‌పోర్టులో దాడి ఘటన గురించి పోలీసులకు సమాచారమివ్వని వ్యక్తికి ఏం బాధ్యత ఉందనుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఇక్కడ ఫిర్యాదు ఇవ్వని వ్యక్తికి మీరు షెల్టర్ ఇస్తారా? ఇది రాజకీయం కాదా అని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర అధికారాలు తీసుకోవడానికి మీకున్న హక్కేంటని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. ఈ విషయం మీద ప్రధాని దేశ ప్రజలకు సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. ఇది మన ఒక్క రాష్ట్రం సమస్య కానే కాదని, 29 రాష్ట్రాల సమస్య అన్నారు. ఈ విషయంపై ప్రధానికి లేఖ రాశానని, దాడి కేసు ఎన్ఐఎకు ఇవ్వడమంటే రాష్ట్రాల హక్కులను హరించడమేనన్నారు. ఈ విషయంపై జాతీయ స్థాయిలో చర్చ పెట్టి నిగ్గుతేలుస్తామని చంద్రబాబు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వంపై అనేక ఆరోపణలున్నాయని, వాటిపై అంతర్జాతీయ న్యాయస్థానానికి వెళతామంటే కేంద్రం ఒప్పుకుంటుందా అని ఆయన ప్రశ్నించారు. మోడీ గుజరాత్ సిఎంగా ఉన్నప్పుడు ఎన్ఐఎ జోక్యాన్ని తప్పుపట్టి ఇప్పుడు సమర్ధించడమేమిటన్నారు. మోడీ చేసే పనులను ప్రజలు ఛీ కొడుతుంటే మన ప్రతిపక్షనేత ఆయన పక్కన చేరుతున్నాడని విమర్శించారు. కేంద్రప్రభుత్వం విచ్ఛిన్నం చేసిన వ్యవస్థల గురించి ఒక్క రోజైనా మాట్లాడారా? అని జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వారిచ్చేది నవరత్నాలు కాదు అవి నవగ్రహాలని సిఎం వ్యాఖ్యానించారు. పాదయాత్ర ముగింపు సభలో రాష్ట్రానికి ప్రత్యేకహోదా కావాలని డిమాండ్‌ను ప్రస్తావించలేదన్నారు. రూ.43వేల కోట్లు అవినీతి చేశారని 10 చార్జిషీట్లు వేసిన వ్యక్తిని కాపాడుతూ బ్యాంకులను దివాలా తీసిన వ్యక్తులను దేశాలు దాటించిన మీరు అవినీతి గురించి మాట్లాడుతున్నారా? అని ప్రధానిని ప్రశ్నించారు.అలోక్ వర్మ వ్యవహారంపై జస్టిస్ ఎకే పట్నాయక్ తాజా వ్యాఖ్యల్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. రిజర్వేషన్ల అంశాల్లో అన్ని రాష్ట్రాల అభిప్రాయాల్ని తీసుకుని అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని చంద్రబాబు అన్నారు. ఏపీలో కాపు రిజర్వేషన్లు, తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్ల గురించి కేంద్రం ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు.

విధి వశాత్తు రెండు చేతులు కోల్పోయిన వికలాంగులకు నెలకు రూ.10వేలు పించన్ ఇవ్వాలని నిర్ణయించామని, ఈ విషయంపైన అభ్యర్థనలు వచ్చాయని, మానవీయ కోణంలో సహాయం చేయాలనుకున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇటువంటి వ్యక్తులు తమ పనులు చేసుకోవాలన్నా ఇతరులపై ఆధారపడాల్సి ఉంటుందని ఇది ఎంతో బాధాకరమన్నారు.

జన్మభూమి విజయవంతం

జన్మభూమి - మా ఊరు కార్యక్రమం విజయవంతమైందని, మొత్తం 5,65,616 ఫిర్యాదులు రాగా ఇందులో అక్కడక్కడే 33,888 సమస్యలను పరిష్కరించామన్నారు. పేదరికం నిర్మూలన, పెన్షన్లు, ఇంటి స్థలాల సమస్యలపై అత్యధిక ఫిర్యాదులు అందాయన్నారు. భూ సంబంధిత వ్యవహారాల్లో ఎవరూ మోసం చేయకుండా వ్యవస్థను కట్టుదిట్టం చేశామని ఆయన వివరించారు. ఇంటి జాగాలు నిన్న నెల్లూరులో, అంతకు ముందు విశాఖలో మహిళలకు ఇవ్వడం జరిగిందన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర మంత్రులు పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు పాల్గొన్నారు.

చెరో 38

(మొదటిపేజీ తరువాయి)

తమ లక్ష్యమని ఈ సందర్భంగా వారు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి పాలనకు చరమగీతం పాడుతామన్నారు. తరువాత మోడీ, అమిత్‌షాలు హాయిగా నిద్రపో మవచ్చని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌తో పొత్తుతో పెద్దగా ఒనగూరేదేమీ లేదని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఇటీవల మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతిచ్చిన బిఎస్‌పి ఇప్పుడు పొత్తుల్లో వారిని పక్కన పెట్టడం ఇక్కడ గమనార్హం. దేశ స్థాయిలో వారి ఓట్లు తమకు బదిలీ కావట్లేదని ఈ సందర్భంగా మాయావతి వెల్ల డించారు.

కాంగ్రెస్‌కు రెండు..

లోక్‌సభలో ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుచుకొని కేంద్రంలో కీలక పాత్ర పోషించే దుకు అఖిలేశ్, మాయావతి చూస్తున్నారు. ఇందుకు గానూ సమానంగా సీట్లు పంచుకొని అమేథీ, రాయ్‌బరేలీని మాత్రమే కాంగ్రెస్‌కు వదిలేశారు. అజిత్ సింగ్ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్‌దళ్ పశ్చిమ రాష్ట్రంలో నాలుగు పార్లమెంట్ స్థానా లను కోరడంతో ఆ పార్టీతో చర్చలు సాగలేదని సమాచారం.

అన్నీ మరిచిపోతున్నాం..

మాయావతికి ఏదైనా అవమానం జరిగితే తనకు అవమానం జరిగినట్లే అని అఖిలేశ్ తెలిపారు. దీనిని పార్టీ కార్యకర్తలు గుర్తించాలని ఆయన కోరారు. 1995లో సంకీర్ణ ప్రభుత్వ హయాంలో ఈ రెండు పార్టీల మధ్య స్పర్ధలు వచ్చాయి. లక్నోలోని గెస్ట్‌హౌస్‌లో రెండు పార్టీల కార్యకర్తల మధ్య జరిగిన గొడవల అనంతరం దాదాపు 25 సంవత్సరాల తరువాత ఇప్పుడు ఈ పొత్తు ఏర్పాటు చేస్తున్నారు. దేశ అభివృద్ధి కోసం తాము గెస్ట్‌హౌస్ ఘటనను మరిచిపోయామని మాయావతి వెల్లడించారు. గత సంవత్సరం జరిగిన ఉప ఎన్నికల సమయంలోనే వారు ఈ అవగాహనకు వచ్చారు. కలిసి పోటీ చేసి ప్రస్తుత ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాద్ గతంలో ప్రాతినిధ్యం వహించిన గోరక్‌పూర్ స్థానాన్ని గెలుచుకున్నారు. అనంతరం ఈ ఉత్సాహంతో వారు తమ పొత్తును మరింత ముందుకు తీసుకెళ్తున్నామని వారు తెలిపారు. ఇవి కేవలం బిజెపిని ఓడించేందుకు చేస్తున్న ప్రయత్నాలు మాత్రమే కాదు.. దళితుల, ముస్లిముల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని తాము అడుగులు వేస్తున్నట్లు మాయావతి తెలిపారు. ఈ పొత్తు మున్ముందు కాలంలో కొనసాగుతుందని ఆమె తెలి పారు. ఇటీవల 3 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన బిజెపికి ఎస్‌పి, బిఎస్‌పిల పొత్తు ఇబ్బందికరంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ కూటమిపై పలువురు ప్రతిపక్ష నాయకులు సానుకూలంగా స్పందిస్తున్నారు. ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ ఒక సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో బిజెపి ఓటమి అవసరమన్నారు.

కూటమితో కలిసేందుకు సిద్ధం

తాము అనుకున్న విధంగానే ఎస్‌పి, బిఎస్‌పిల పొత్తు కుదిరింది. కూటమితో తాము కూడా కలిసేందుకు చర్చలు సాగిస్తున్నాం. త్వరలోనే అవి ఫలిస్తాయని ఆశిస్తున్నాం. తమకు సీట్ల కేటాయింపు ముఖ్యం కాదు. బిజెపిని ఓడించడమే తమ లక్ష్యం.

- అనిల్ దూబే, ఆర్‌ఎల్‌డి అధికార ప్రతినిధి

కూటమిని ఓడిస్తాం

బిజెపి వ్యతిరేకంగా కూటమి కడుతున్న పార్టీలను 2014 కంటే ఘోరంగా ఓడిస్తాం. రాజకీయంగా పొసగని వారు కూడా మమ్మల్ని ఓడించేందుకు కూటమి కడుతున్నారు. అటువంటి రాజకీయ స్థిరత్వం లేని, అవినీతి పార్టీ లను ఎదుర్కొంటాం.

- యోగి ఆదిత్యానాద్

కూటమిని స్వాగతిస్తున్నాం

వచ్చే లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఎస్‌పి, బిఎస్‌పిల ఏర్పాటు చేసుకున్న మహాకూటమిని స్వాగతిస్తున్నాం.

- మమతా బెనర్జీ

అవినీతికి ఆధారాలు లేవు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవడానికి మరికొంత సమయం తీసుకుని ఉంటే బావుండేదని ఆయన అభిప్రాయ పడ్డారు. "వారు పూర్తిగా మనస్సు లగ్నం చేసి మరీ ఆలోచించి వుండాల్సింది, ఎందుకంటే అక్కడ వున్నది సుప్రీం కోర్టు

న్యాయమూర్తి, సివిసి చెప్పినదే తుది మాట కాదు' అని ఆయన అన్నారు. 'విచారణను పర్యవేక్షించడం వరకే నా పాత్ర. అందుకోసం సహజ న్యాయ సూత్రాలను పాటించాలనుకున్నాను.' అని ఆయన సుప్రీంకోర్టుకు రాసిన లేఖలో పేర్కొన్నట్లు సమాచారం.

వర్మ పై ఒత్తిడి ..?

మరోవైపు రాకేష్ ఆస్థానాకు అనుకూలంగా వ్యవహరించాలంటూ అలోక్‌వర్మపై పెద్ద ఎత్తున ఒత్తిడి వచ్చినట్లు సమాచారం. జస్టిస్ పట్నాయక్ రాతపూర్వంగా ఇచ్చిన నివేదికలో ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు ఆయనకు అత్యంత సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు చెందిన అత్యున్నత అధికారి ఒకరు వర్మ నివాసానికి వెళ్లి ఆస్థానాకు వ్యతిరేకంగా రహస్య వార్షిక నివేదికలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వర్మను కోరారు. 'ఈ పని మీరు చేస్తే అన్ని సర్దుకుంటాయి. ఎటువంటి సమస్య రాదు.' అని ఆ అధికారి హామీ ఇచ్చినట్లు పట్నాయక్ తన నివేదికలో పేర్కొన్నారు. 'ఆస్థానా నిజాయితీపై అనుమానాలున్నాయి' అని అలోక్‌వర్మ వార్షిక రహస్య నివేదికలో పేర్కొన్నట్లు చెబుతున్నారు. దీనిని తొలగించడానికి సివిసిలోని అత్యున్నత అధికారి చేసిన రాయబారం విఫలం కావడంతో, ఆస్థానా అలోక్‌వర్మపై ఫిర్యాదుకు దిగినట్లు సమాచారం. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను జస్టిస్ పట్నాయక్‌కు అలోక్‌వర్మ రాతపూర్వకంగా సాక్ష్యాధారాలతో సహా అందించారని, అదే విషయాన్ని పట్నాయక్ నివేదికలో పేర్కొన్నారని తెలిసింది.

సిబిఐకి మరింత స్వేచ్ఛ

సిబిఐకి మరింత స్వాతంత్ర్యం ఇవ్వాలని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆర్.ఎం.లోధా శుక్రవారం పేర్కొన్నారు. రాజకీయ కార్యనిర్వాహక వర్గం నుండి సిబిఐకి రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. అధికారంలో ఎవరున్నా దానితో నిమిత్తం లేకుండా ఎప్పుడైతే రాజకీయ వర్గాలు సిబిఐపై పట్టు సాధించాలని ప్రయత్నిస్తాయో అప్పుడు ఇలాంటి సంఘటనలే జరుగుతాయని లోధా వ్యాఖ్యానించారు.

ఏప్రిల్ 20 నుంచి ఎంసెట్

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తామన్నారు. పరీక్షా కేంద్రాలు, పరీక్షలకు సంబంధించిన అన్ని వివరాలు అందుబాటులో ఉండేలా ఉన్నత విద్యామండలి రూపొందించిన[illegible] యాప్‌ను మంత్రి ఆవిష్కరించారు. యూనివర్సిటీల్లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులకు నిర్వహించిన పరీక్షల ఫలితాలను సీల్డ్ కవర్‌లో ఉంచామని చెప్పారు. కోర్టు తీర్పు ఆధారంగా వీటిని భర్తీ చేస్తామన్నారు. కాంట్రాక్టు లెక్చరర్లకు వేతనాలపై ఈ నెల 21న జరిగే మంత్రివర్గ ఉపసంఘంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ నెలాఖరులోపు అన్ని యూనివర్సిటీలకు వైస్‌చాన్సలర్లను నియమిస్తామని చెప్పారు. జెఎన్‌టియు అమరావతి పేరుతో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే ఆలోచన వుందన్నారు. విశాఖపట్నంలో మరో మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన వచ్చిందని, దీన్ని ఉన్నత విద్యామండలి పరిశీలిస్తోందని చెప్పారు. పిపిపి పద్ధతిలో లాజిస్టిక్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన వచ్చిందన్నారు.

వ్యక్తిగత కేసుల్ని ఎలా అప్పగిస్తారు

- జగన్‌పై దాడి కేసు ఎన్ఐఎకి ఇవ్వడంపై సిఎం


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన దాడి కేసు విచారణను ఎన్ఐఎకి అప్పగించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ శనివారం ప్రధాని మోడీకి లేఖ రాశారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం వ్యవహరించిందని మండిపడ్డారు. వ్యక్తిగత కేసుల్ని ఎన్ఐఎకి ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. కేంద్ర హోం శాఖ నిబంధనల్ని ఉల్లంఘించిందని విమర్శించారు. అంతర్రాష్ట్ర, విదేశీ సంబంధిత క్లిష్టతరమైన కేసులు, స్మగ్లింగ్, డ్రగ్స్, ఆయుధాల వంటి ప్రత్యేక కేసులు మాత్రమే ఎన్ఐఎ పరిధిలోకొస్తాయంటూ చట్టంలోని పలు అంశాలను లేఖలో ప్రస్తావించారు. 2008లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్ఐఎ చట్టాన్ని మోడీ వ్యతిరేకించారని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకొచ్చాక జరిగిన మాలేగావ్ పేలుళ్ళ, 2014లో చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ పేలుడు కేసులపై ఎన్ఐఎ విచారణకు కేంద్రం ఎందుకు ఆదేశించలేదని ప్రశ్నించారు. జగన్‌పై దాడి కేసును త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దాడి జరిగిన 24 గంటల వ్యవధిలోనే ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయడం అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మావోయిస్టులు హత్య చేసిన టిడిపి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలపై కనీసం స్పందించని కేంద్రం జగన్‌పై దాడి కేసులో స్పందించడంపై కేంద్ర వైఖరి స్పష్టమవుతోందని తెలిపారు.

సంక్రాంతి హీరో!

సినిమా వాళ్లకు సంక్రాంతి పెద్ద పండగ. ఈ వేడుకకు తమ చిత్రాలను విడుదల చేయాలని నిర్మాతలు తపిస్తారు. అందుకోసం ముందు నుంచీ థియేటర్ల కోసం అన్వేషిస్తుంటారు. ఈ ఏడాదీ భారీ సినిమాలే సందడి చేశాయి. సంక్రాంతికొచ్చిన మూడు చిత్రాలూ మూడు విభిన్నమైన జోనర్లు కావడం విశేషం. ఒకటి బయోపిక్, మరొకటి మాస్ మసాలా. మూడోది హాస్యభరిత చిత్రం. ఈ చిత్రాలు వల్ల అనువాద చిత్రాలకు ఇక్కడ థియేటర్ల కూడా కరువయ్యాయి. వీటిల్లో సంక్రాంతి అల్లుళ్ల అంటూ ముందు నుంచీ చెబుతున్న 'ఎఫ్2' చిత్రమే మంచి రివ్యూలను దక్కించుకుంది. 'ఎన్టీఆర్ కథానాయకుడు' ఒకే ఒకే అన్నట్టు ఉన్నా, 'వినయ విధేయ రామ' మాత్రం అంతగా మెప్పించలేకపోయిందని సమీక్షకులు అభిప్రాయ పడ్డారు.

సినిమా జోనర్ ఏదైనా ప్రేక్షకులను మెప్పించేలా తీస్తేనే అది థియేటర్లలో ఎక్కువ కాలం ప్రదర్శనకు అవకాశం ఉంటుంది. గతంలా కాదు ...హీరో, దర్శకుడు, నిర్మాతలను బట్టి ప్రస్తుత రోజుల్లో సినిమాలు ఆడడం లేదు. కథ బాగుంటే చెప్పండి చూస్తామంటున్నారు. అందుకే పెద్ద చిత్రమైనా చిన్న చిత్రమైనా వినూత్నంగా ఉన్న కథకే ప్రేక్షకులు ఎక్కువ మార్కులు వేస్తున్నారు. ప్రచారం లేని చిత్రమైనా బాగుంటే చాలు మౌత్ టాక్‌తో విజయం సాధిస్తుంది. ఈ ఏడాది సంక్రాంతి బరిలో దిగిన మొదటి చిత్రం 'ఎన్టీఆర్ కథానాయకుడు'. నందమూరి తారక రామారావు జీవితం ఆధారంగా రూపొందిన చిత్రమిది. 'ఎన్టీఆర్'ను సినీ జీవితం ఓ భాగంగానూ, రాజకీయ ప్రస్థానాన్ని రెండో భాగంగానూ తెరకెక్కించారు. వాటిల్లో మొదటి భాగం 'ఎన్టీఆర్ కథానాయకుడు' చిత్రాలు ఈనెల తొమ్మిదన విడుదల చేశారు. టైటిల్ రోల్‌ను బాలకృష్ణ పోషించారు. క్రిష్ దర్శకత్వం వహించారు. విద్యా బాలన్ బసవతారకంగా చేసింది. ఈ చిత్రంలో ఎన్టీఆర్


ఎన్టీఆర్ కథానాయకుడు

సినీ జీవితంతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరి పాత్రనూ చూపించారు. అందుకే భారీ తారాగణంగా తెరపై కనిపించింది. ఎన్టీఆర్ సినిమాల్లోకి రావడం... రాయలసీమలో కరువు, దివిసీమ ఉప్పెన వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆయన తీసుకున్న నిర్ణయాలు ఈ చిత్రంలో హైలైట్‌గా నిలిచాయి. ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లో పాత్రలను బాలకృష్ణ అలవోకగా చేసేశారు. కానీ కొన్నింటి పాత్రల్లో అంతగా కుదరిలేదన్న విమర్శలు వచ్చాయి. కొన్ని మాత్రం తండ్రికి తగ్గట్టుగానే ఉన్నారనిపించిందని ప్రేక్షకులే స్వయంగా సోషల్ మీడియా ద్వారా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కథలో చెప్పుకోవడానికి కొత్తదేమీ కాదు. అంతా తెలిసిన చరిత్రే. దాన్ని జనరంజకంగా చూపించారు. సినిమా మొత్తంగా చూసుకుంటే పర్వాలేదన్న టాక్‌తో రన్ అవుతోంది. ఈచిత్రానికి ఓవర్‌సీస్‌లో మంచి ఆదరణ లభిస్తోంది. నాలుగు రోజుల్లో నాలుగు కోట్లకు పైనే వసూళ్లను రాబట్టింది. రజనీకాంత్ 'పేట' చిత్రం దీని కంటే మరో మూడు కోట్లు ఎక్కువగా రాబట్టింది అంతే.

విధ్వంస రాముడు

బోయపాటి శ్రీను అంటే సాధారణంగానే రక్తపాతం మితిమీరి ఉంటుంది. చెవులు చిల్లులు పడేటట్టు పోరాట సన్నివేశాలు జొప్పిస్తారు. తెర నిండా పాత్రలు కనిపిస్తుంటాయి. కుటుంబ అనుబంధాలకు ప్రాధాన్యమిస్తాడు. 'వినయ విధేయ రామ' చిత్రం తన స్టయిల్‌లోనే ఉంటుంది కానీ చూసిన వారికి కొత్త ఫీల్‌ను కలిగిస్తుందని చెప్పారు. నాలుగేళ్ల పాటు ఈ కథ కోసం శ్రమించారట బోయపాటి. టైటిల్‌లో 'వినయ విధేయ రామ' అని పెట్టినా ఆ కోణం కథా కథనాలు లేవు. విధ్వంస రామ అని పెడితే సరిపోయేది అని కొందరు నెటిజన్లు సోషల్ మీడియా ద్వారా చెప్పారు. సినీ విమర్శకులు కూడా ఈ చిత్రానికి మిక్సిండ్ రివ్యూలు ఇచ్చారు. ఓ పిల్లోడ్ని రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై వదిలేసి వెళితే అక్కడే ఉన్న నలుగురు అనాథలు ఆ పసివాడ్ని కాపాడుతారు. వీరంతా ఓ కుటుంబం మారి కలసి జీవిస్తుంటారు. అందులో ఒకరు గొప్పవాడవుతాడు. అతనికి అనుకోని విధంగా ఆపదొస్తుంది. ఆ ఆపద నుంచి హీరో రామ్ చరణ్ కాపాడుతాడు. ఈ క్రమంలో రక్తపాతం అధికంగా ఉంది. పోరాట సన్నివేశాలు భారీ ఎత్తున తీశారు. కథలో కొత్తదనం లేదు. గతంలో కొన్ని చిత్రాలు చూసినట్టే...ఎక్కడో ఆపదలో ఉన్న వ్యక్తి ఫోన్ చేస్తే రన్నింగ్‌లో ఉన్న రైల్‌ను దాటేసి అప్పటికప్పుడే గుర్రాలపై ఆ ప్రాంతానికి చేరుకోవడం అనేది నమ్మ శక్యంగా ఉండదు. అటువంటివి ఇప్పుడూ పెడితే తిరస్కరిస్తారని బోయపాటి మరిచిపోయారు. ఈ చిత్రం ద్వారా కొత్తగా చెప్పేదేమీ లేదు. కాకపోతే రామ్ చరణ్ వల్లే కాస్తో కూస్తో నిలబడే అవకాశం ఉంటుంది. ఈ చిత్రంలో ఆయన తయ్యారైన సిక్స్‌ప్యాక్ సీన్ మెప్పిస్తుంది. సినిమాకే అది హైలైట్ అవుతుంది. ఓవర్‌సీస్‌లో ఈ చిత్రానికీ మంచి ఆదరణ లభిస్తోంది. ఒక్క రోజులోనే ప్రీమియర్‌తో కలిపి రూ.1.4 కోట్లు రాబట్టింది.


వినయ విధేయ రామ


ఎఫ్2

హాస్యం పండించిన అల్లుళ్లు

పటాస్, సుప్రీమ్, రాజా ది గ్రేట్...ఈ చిత్రాలు చూస్తే...అన్ని అంశాలు సమపాళల్లో ఉంటాయి. దానికి ఈ చిత్రాలే సాక్ష్యం. ఇందులో హాస్యం ఎక్కువగా ఉంటుంది. ఈ జోనర్‌ను వెంకటేశ్ చేస్తే ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఆయన సుదీర్ఘ సినీ కెరీర్‌లో 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి చిత్రాలెన్నో చేశారు. ఇలాంటి హీరోతో అనిల్ రావిపూడి చేయించిన చిత్రం 'ఎఫ్2'. ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న అల్లుడు ఎలా ఉంటాడో చూపించాడు. ఈ చిత్రం ద్వారా అనిల్ రావిపూడి ఒక పక్క హాస్య పండిస్తూనే మరో పక్క మంచి సందేశం ఇచ్చాడు. మిగిలిన చిత్రాల్లా కాకుండా ఈ సినిమాలో కథానాయికలకు కూడా ప్రాధాన్యమున్న పాత్రలు ఇచ్చి గౌరవించాడు. అదొక గొప్ప విషయం. అప్పటి వరకూ సంతోషంగా ఉన్న ఇద్దరు కుర్రాళ్లు వివాహం తర్వాత ఎంత ఫ్రస్ట్రేషన్ ఎదుర్కొన్నారన్నదే ఈ చిత్రం సారాంశం. ఇది మహిళలను గౌరవించే చిత్రమని అనిల్ మొదట నుంచీ చెప్పినట్టే థియేటర్ నుంచి బయటకొచ్చాక అదే అర్థమవుతుంది. సినిమా మొత్తంగా చూస్తే థియేటర్లకు వచ్చిన వారు హాయిగా నవ్వుకోవాలి అన్న కాన్సెప్ట్‌తోనే అనిల్ రావిపూడి ఈ చిత్రం తీసినట్టు స్పష్టమవుతుంది. సెకండాఫ్‌లో వచ్చిన ప్రకాశ్ రాజ్, పృథ్వీ, వెన్నెల కిశోర్‌తో కూడా నవ్వించేలా చేశాడు. హాస్యమే ప్రధానమైనా అందులోనూ సందేశాని ఉండేలా చూశాడు. చివరిలో భర్తలందరికీ వెంకటేశ్ ఓ సలహా కూడా ఇస్తాడు.. 'పెద్దగా అరవకూడదు...మీ భార్య చెప్పింది వినండి'...అంతేగా అంతేగా అని అనండి' అని నవ్వించాడు. వరుణ్ తేజ్ తెలంగాణ యాసలో మాట్లాడడం ఎబ్బెట్టుగా ఉన్నా, పాత్ర పరంగా మాత్రం బాగా చేశాడు. అంతిమంగా చెప్పాలంటే కుటుంబం అంతా థియేటర్లకు వెళ్లి ఈ సినిమాను హాయిగా చూడొచ్చు.

తమిళనాడులో దురాభిమానం

సంక్రాంతికి తెలుగులో మూడు సినిమాలు ఏ విధంగా విడుదలయ్యాయో తమిళంలో కూడా అగ్ర హీరోలు చిత్రాలు రెండు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. అందులో ఒకటి రజనీకాంత్ చిత్రం 'పేట', అజిత్ సినిమా 'విశ్వాసం'. సాధారణంగా అగ్రహీరోల సినిమా విడుదలవుతున్నాయంటే థియేటర్లన్నీ వారి చిత్రాలే ఉంటాయి. రెండు చిత్రాలూ అగ్రహీరోలవే కావడంతో ఒకరికి ఎక్కువ, మరొకరి చిత్రానికి తక్కువ థియేటర్లు వచ్చాయి. 'విశ్వాసం', 'పేట' రెండు చిత్రాలకూ సానుకూల ఫలితాలే వచ్చాయి తమిళంలో ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద కాసులు కురిపిస్తున్నాయి. ఓవర్‌సీస్‌లో కూడా బాగానే ఆడుతున్నాయి. 'పేట' చిత్రం మూడు రోజుల్లో రూ.7.6 కోట్ల ఓవర్‌సీస్‌లో రాబట్టింది. అక్కడ ఈ పండగకు విడుదలై తమిళ, తెలుగు చిత్రాలన్నింటిలోనూ ఈ చిత్రానికి ఎక్కువ ఆదరణ లభిస్తుంది. తమిళనాడులో మాత్రం 'పేట' చిత్రానికి మించి 'విశ్వాసం' భారీ ఓపినింగ్స్‌ను రాబట్టిందని సినీ విశ్లేషకుడు బాల తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నాడు. 'పేట'లో రజనీకాంత్, నవాజుద్దీన్ సిద్దిఖీ, విజయ్ సేతుపతి, త్రిష, సిమ్రాన్, బాబీ సింహా వంటి తారాగణం ఉండడం కలిసొచ్చింది. కథలో కొత్తదనం లేకపోయినా ఫ్యాన్స్‌ను ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ చిత్రం దర్శకుడు కార్తిక్ సుబ్బరాజ్ మార్కు కాకుండా రజనీకాంత్ స్టయిలోనే ఈ సినిమా ఉంటుంది. ఎన్ని ఉన్నా 'విశ్వాసం' తమిళనాడు బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డు సృష్టించేందుకు సిద్ధమవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఈ రెండు చిత్రాలు విడుదలైనప్పుడు థియేటర్ల సమస్య కచ్చితంగా వస్తుంది. చెన్నైలో ఓ చోట రజనీకాంత్, అజిత్ అభిమానులు కత్తులతో దాడులకు దిగారు. విశ్వాసం ప్రదర్శితమవుతున్న మల్టీప్లెక్స్‌లోని ఆరు స్క్రీన్లలో సాయంత్రం షో 'పేట' ప్రదర్శించాలని రజనీకాంత్ అభిమానులు ఆ థియేటర్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. దాన్ని ఆ యాజమాన్యం తిరస్కరించింది. వెంటనే రజనీ అభిమానులు 'విశ్వాసం' పోస్టర్లను, ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. దీంతో అజిత్ ఫ్యాన్స్ వీరిపై ప్రతిదాడికి దిగారు. ఈ తరుణంలో కత్తులతో నరుక్కున్నారు. అందులో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరు ప్రాణాపాయస్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అజిత్, రజనీకాంత్ మాత్రం వివాదాలు వద్దు..హీరోలు ఎవరైనా అభిమానులంతా కలసి ఉండాలని పిలుపినిచ్చారు.


పేట


విశ్వాసం

ప్రయత్నిస్తూ ఓడిపోయిన వాడు లేడు

నాని తాజాగా నటించిన చిత్రం 'జర్సీ'. దేవదాసు తర్వాత ఆయన చేస్తోన్న సినిమా ఇది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ సినిమాను నిర్మిస్తున్నారు. కన్నడ నటి శ్రద్ధా శ్రీనాథ్ ఇందులో కథానాయిక పాత్ర పోషిస్తున్నారు. పీడీవీ ప్రసాద్ సినిమాను సమర్పిస్తున్నారు. అనిరుధ్ బాణీలు అందిస్తున్నారు. ఇందులో నాని అర్జున్ అనే పాత్రలో క్రికెటర్‌గా సందడి చేయబోతున్నారు. శనివారం ఈచిత్రం టీజర్‌ను తన ట్విట్టర్ ఖాతాలో విడుదల చేశారు. ఈ టీజర్‌లో... 'నీ వయసు ఇప్పుడు 36 అర్జున్. అది ప్రొఫెషనల్ స్పోర్ట్స్ నుంచి రిటైర్ అయ్యే వయసు..' అనే మాటలతో మొదలైంది. 'పిల్లల్ని ఆడించే వయసులో మనకు ఆటలు ఎందుకు బావా..?' అని మరో వ్యక్తి నానితో అంటున్నారు. 'ఎంత ప్రయత్నించినా ఇప్పుడు నువ్వు ఏం చేయలేవు..' అని ఓ మహిళ నానితో చెప్పింది 'ఆపేసి ఓడిపోయిన వాడు ఉన్నాడు కానీ.. ప్రయత్నిస్తూ ఓడిపోయిన వాడు లేడు' అంటూ నాని చివర్లో చెప్పాడు. క్రికెట్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అదే టీజర్‌లో చూపించారు. ఇప్పుడేం చేయలేవు అన్న వ్యక్తే క్రికెట్‌లో సిక్స్ కొడితే ఎలా ఉంటుందో చూపించాడు. అనిరుధ్ బాణీలు సమకూరుస్తున్నారు. ఏప్రిల్‌లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


నాని

అసలేం జరిగింది?

ఎక్సోడస్ మీడియా నిర్మిస్తున్న చిత్రం 'అసలేం జరిగింది?' పోస్టర్‌ను ఎంపీ సంతోష్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ చిత్రానికి నీలిమా ప్రొడ్యూసర్. శ్రీరామ్ హీరో. తెలంగాణ రాష్ట్రంలో ఇంతవరకూ ఎవరూ తీయని కొత్త ప్రాంతాల్లో షూటింగ్ జరపాలనుకోవడం అభినందనీయమని పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ అన్నారు. ఇందుకోసం చిత్ర యూనిట్ ఆరు నెలల పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాలను సందర్శించడం గొప్ప విషయమని చెప్పారు. ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్న కెమెరామన్ ఎన్‌వీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మహావీర్ స్వరాలు సమకూరుస్తున్నారు. రామగోపాల్ వర్మ నిర్మించిన 'భైరవగీత'లో విలన్ విజయ్ రామ్ ఈ చిత్రంలోనూ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథ నెర్రపల్లి వాసు అందించారు. ఫిబ్రవరి 11 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. రెండు షెడ్యూళ్లలో చిత్రీకరణ పూర్తి చేస్తామని నిర్మాత కె. నీలిమా తెలిపారు.


శ్రీరామ్



విద్యాబాలన్‌కు శ్రీదేవి మెమోరియల్ పురస్కారం

టీ.ఎస్.ఆర్, టీవీ 9 నేషనల్ ఫిల్మ్ అవార్డులకు విశాఖపట్నం మరోసారి వేదిక కాబోతోంది. 2010 నుంచీ రెండేళ్లకు ఒకసారి సుబ్బరామిరెడ్డి ఈ అవార్డులను జాతీయ స్థాయిలో అందిస్తున్నారు. 2017-2018 అవార్డులను ఈ ఏడాది ఫిబ్రవరి 17న విశాఖపట్నం పోర్ట్ గ్రౌండ్‌లో అందజేయనున్నట్టు సుబ్బరామిరెడ్డి శనివారం ప్రకటించారు. ఈ పురస్కారాల జ్యూరీ ఛైర్మన్ సుబ్బరామిరెడ్డి, సభ్యులు డా. శోభనా కామినేని, పింకీరెడ్డి, నగ్మా, మీనా, పరుచూరి గోపాలకృష్ణ, నరేశ్, కె.ఎస్. రామారావు మీడియాతో మాట్లాడారు. సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ '2010లో మొదలు పెట్టిన ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్విఘ్నంగా కొనసాగించడం ఆనందంగా ఉంది. శ్రీదేవి మెమోరియల్ అవార్డును విద్యాబాలన్‌కు అందిస్తున్నాం. ఈ కార్యక్రమానికి రజనీకాంత్, సూర్య, విక్రమ్, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్ తదితర తారలు హాజరు కానున్నారు' అని అన్నారు. నెల్లూరులో పుట్టిన సుబ్బరామిరెడ్డికి హైదరాబాద్, విశాఖపట్నంతో విడదీయరాని అనుబంధం ఉందని, ఆయన ఆరాధించే శివుడి ఆజ్ఞతోనే ఈ కళాసేవ అపూర్వంగా సాగుతోందని పరుచూరి గోపాలకృష్ణ చెప్పారు. తమ జ్యూరీ గౌరవప్రదంగా, అందరికీ ఆమోదయోగ్యమైన నటీనటులను అవార్డులకు ఎంపిక చేస్తుందని నరేశ్ తెలిపారు. తెలుగు చిత్రసీమకు చెందిన అనేక మంది జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి టి. సుబ్బరామిరెడ్డి కారకులని కె.యస్. రామారావు పేర్కొన్నారు. భారతీయ కళలు, సంస్కృతికి సేవ చేస్తున్న గొప్ప వ్యక్తి సుబ్బరామిరెడ్డి అని నగ్మా అన్నారు. గతంలో అవార్డుల కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యానని, ఆ తర్వాత 'దృశ్యం' చిత్రానికి గానూ ఉత్తమ నటిగా అవార్డును అందుకున్నానని, ఇప్పుడు జ్యూరీలో ఉండటం ఆనందంగా ఉందని మీనా తెలిపారు. రాజకీయ, పారిశ్రామిక, కళా రంగాలలో తనదైన ముద్ర వేసిన టి. సుబ్బరామిరెడ్డి జీవితాన్ని బయోపిక్‌గా రూపొందించాల్సిన అవశ్యకత ఉందని శోభనా కామినేని అభిప్రాయపడ్డారు. తన తండ్రికి వేరెవ్వరూ సాటిరారని, అతి త్వరలోనే ఆయన ఆటోబయోగ్రఫీని విడుదల చేయబోతున్నామని పింకీ రెడ్డి చెప్పారు.

స్ప్రెడ్ ద లవ్.. స్ప్రెడ్ ద పీస్..



దర్శకులు డాక్టర్ ఆనంద్ తాజాగా ఏడు భాషలలో 'రెయిన్ బో' పేరుతో ఓ మ్యూజిక్ వీడియోను రూపొందించారు. ఇటీవల అమెరికాలో జాత్యహంకార దాడిలో దుర్మరణం చెందిన తెలుగు విద్యార్థి శరత్ కొప్పుకి నివాళిగా దీన్ని తెరకెక్కించారు. అనన్య పెనుగొండ అనే తెలుగు యన్ ఆర్ ఐ అమ్మాయిని గాయినిగా పరిచయం చేశారు. స్వాతి పెనుగొండ నిర్మించారు. కొప్పు రాంమోహన్ , యన్ యస్ నాయక్ సమర్పణ. విజయ్ దేవరకొండ, మైత్రి మూవీ మేకర్స్ చేతుల మీదుగా శనివారం యూట్యూబ్‌లో విడుదల చేశారు. పెద్దపల్లి రోహిత్ రచన, సంగీత దర్శకత్వంలో రూపొందిన ఈ పాటకు కిరణ్ మాస్టర్ కొరియోగ్రఫీ. సిద్ధం మనోహర్ కెమెరా సుమన్ రుద్రు ప్రధాన పాత్రలో నటించారు.

ఉండిపోరాదే..

తరుణ్ తేజ్, లావణ్య హీరోహీరోయిన్లుగా పరిచయం కాబోతున్న చిత్రం ' ఉండిపోరాదే...' సత్య ప్రమీల కర్లపూడి సమర్పణ. గోల్డ్ టైమిన్ పిక్చర్స్ బ్యానర్‌పై డాక్టర్ లింగేశ్వర్ నిర్మిస్తున్నారు. దిల్ రాజు బ్యానర్‌లో అసోసియెట్ దర్శకుడిగా పనిచేసిన నవీన్ నాయని దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఇప్పటికే రాజమండ్రి, ఆత్రేయపురం పరిసర ప్రాంతాల్లో మొదటి షెడ్యూల్ షూటింగ్‌ని పూర్తచేసుకుంది. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం టైటిల్ మొదటి లుక్‌ని విడుదల చేశారు. నిర్మాత డా. లింగేశ్వర్ మాట్లాడుతూ.. బలమైన కథ చక్కని నటీనటులు, నూతనంగా చూపించగలిగే వ్యక్తి ఉంటే ఆ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారు. ఈ చిత్రానికి నవీన్ నాయని దర్శకుడు. మా తదుపరి షెడ్యూల్‌ని ఈ నెల 28 నుండి బెంగుళూరు, మైసూర్, కరీంనగర్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏకధాటిగా చిత్రీకరిస్తాం' అని తెలిపారు.


లావణ్య



పసి ప్రాణాలకు బ్రెస్‌మీ రక్ష




'బోరుబావిలో పడి చిన్నారి మృతి' అనే వార్తను మనం మీడియాలో చాలాసార్లు చూసి ఉంటాం. కేవలం కొందరి నిర్లక్ష్యం వల్ల ముక్కుపచ్చలారని పసిబిడ్డలు బలైపోతున్నారు. ఆ క్షణంలో బిడ్డ చీకట్లో భయపడుతూ.. ఊపిరాడక నరకయాతన అనుభవిస్తుంది. సంఘటన జరిగింది అని తెలియగానే ప్రభుత్వ యంత్రాంగం చేసే హడావుడి అంతాఇంతా కాదు. రోజుల తరబడి తవ్వకాలు జరిపినా చివరకు ప్రాణంలేని పసిబిడ్డల్నే బయటకు తీసుకొస్తున్న విషాదకర సంఘటనలే ఎక్కువ. సమస్య వచ్చినప్పుడు మాత్రమే ఆవేశంగా మాట్లాడి, తర్వాత అందరూ మరచిపోతారు. కానీ ఆ యువకుడు మాత్రం అందరిలా ఆలోచించలేదు. దీనికి శాశ్వత పరిష్కారం కనుక్కోవాలనుకున్నాడు. అందుకోసం ఒకటిన్నర సంవత్సరం కష్టపడి 'బ్రెస్‌మీ' అనే ప్రాజెక్టు రూపొందించాడు. ఈ ప్రాజెక్టు ద్వారా బోరుబావిలో పడ్డ బిడ్డలను కేవలం 20 నిమిషాల్లో బయటకు తీసి, రక్షించవచ్చని చెబుతున్నాడు గాజువాకకు చెందిన శనివాడ హేమంత్‌రాజా.

కళ్ల ముందే కన్నబిడ్డలు బోరుబావిలో పడి అర్థాంతరంగా జీవితాన్ని ముగిస్తుంటే నిస్సహాయతగా కన్నీరు పెట్టే తల్లిదండ్రులు ఎందరో. సైన్స్, టెక్నాలజీ పరంగా ఎంతో అభివృద్ధి చెందామని ఒకవైపు ప్రభుత్వాలు ఘనంగా చెప్పుకుంటున్నా.. బోరుబావిలో పడ్డ బిడ్డను ప్రాణాలతో బయటకు తీసే యంత్రాలు మాత్రం మన దగ్గర లేకపోవడం శోచనీయం. ఇలాంటి పరిస్థితుల్లో ఇకమీదట ఒక్క పసిబిడ్డ ప్రాణం పోవడానికీ వీల్లేదు.. అని ఓ ఆలోచన చేశాడు విశాఖ గాజువాకకు చెందిన శనివాడ హేమంత్‌రాజ. అందుకు కారణమూ ఉంది..

ఆ కారణం ఏంటంటే ...

'జూన్ 21, 2017లో రంగారెడ్డిజిల్లా చేవెళ్ల గ్రామంలో 'మీనా' అనే చిన్నారి ప్రమాదవశాత్తు బోరుబావిలో పడింది. ఈ దుర్ఘటన అప్పట్లో పెద్ద సంచలనాన్ని సృష్టించింది. పాప బోరుబావిలో పడింది అనే విషయం తెలియగానే ప్రభుత్వం అప్రమత్తమై రెస్క్యూ టీంలను రంగంలోకి దింపింది. కానీ బోరుబావిలో పడ్డ బిడ్డలను కాపాడే యంత్రాలేవీ మనకు అందుబాటులో లేవు. నాలుగు రోజుల తర్వాత పాప గౌనును, ముక్కలు ముక్కలైనా శరీర భాగాలను మాత్రమే బయటకు తీశారు. ఆ హృదయవిదారకమైన సంఘటన నన్నెంతగానో కలచివేసింది. నేనేమైనా చేయగలనా? అని ఆలోచించా. టెక్నాలజీ పరంగా నాకు పట్టు ఉంది. వెంటనే పేపరు, స్కెచ్ తీసుకుని నా పరిజ్ఞానం ఉపయోగించి, ఒక ప్లాన్‌ను గీశాను. దానిని అమలు చేయడానికి ఒకటిన్నర సంవత్సరం పట్టింది' అని చెప్పుకొచ్చాడు హేమంత్.



'బ్రెస్ మీ'.. ఇలా ఉపయోగించాలి!

బ్రెస్‌మీ అంటే 'బోర్‌వెల్ రెస్క్యూ సేవింగ్ మెకానికల్ ఎక్విప్‌మెంట్' అని అర్థం. ఇది ఒక మెకానికల్ గేర్ మిషన్. ఇది ఎలక్ట్రికల్ గేర్ మోటార్ సహాయంతోపాటు మొత్తం తొమ్మిది గేర్ వీల్స్‌తో పనిచేస్తుంది. ఇందులో ముఖ్యంగా ఐదు డ్రైవ్ గేర్స్ అమర్చి ఉంటాయి. వీటికి లాంగ్ ఫ్లెక్సిబుల్ స్ప్రింగ్‌తో క్లిప్ చేయబడిన గ్రాబర్స్ బిగించి ఉంటాయి. ఈ ఐదు గ్రాబర్స్ ఒకే డైరక్షన్‌లో దేనికదే తిరుగుతూ ఉంటాయి. బోరుబావిలోని చిన్నారి ధరించిన దుస్తులను వీటిలో ఏ ఒక్కటి పట్టుకున్నా బిడ్డను తన ఆధీనంలోకి తీసుకుంటుంది. అలా చిన్నారిని సురక్షితంగా పైకి చేరుస్తుంది. గ్రాబర్స్‌ను ముందుకు, వెనుకకు తిప్పవచ్చు. అంతేకాదు వీటి స్పీడ్‌నూ జీరో నుంచి 12 స్టేజీల వరకూ పెంచొచ్చు.. తగ్గించొచ్చు. రిమోట్ కంట్రోలు మొత్తం మన చేతిలోనే ఉంటుంది. ఈ మిషన్‌తో పాటు అమర్చబడిన లాంగ్ స్పాట్‌లైన్, కెమెరా సహాయంతో చిన్నారి పరిస్థితిని, మిషన్ పనితీరును మోనిటర్ ద్వారా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండొచ్చు. ఈ మిషన్ మోటారు, ఎలక్ట్రికల్ సప్లై వల్ల చిన్నారికి ఎటువంటి ప్రమాదం ఉండదు. ఎందుకంటే ac పవర్‌ని dcగా కన్వర్ట్ చేసే 10amps ట్రాన్స్‌ఫార్మర్ ప్రత్యేకంగా తయారుచేయబడి ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని కంట్రోల్స్‌కి ఒక ఎలక్ట్రికల్ కంట్రోల్ పేనల్ బాక్స్ ఉంటుంది. వీటితోపాటు స్పెషల్ లాంగ్ స్పాట్ టార్చ్‌లైట్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. అలాగే చిన్నారికి సరిపడా ఆక్సిజన్ అందేలా ఆక్సిజన్ పైపు కూడా మిషన్‌కి అమర్చి ఉంటుంది. బోరుబావి సైజ్ ఏదైనా సరే అందులో ఇమిడిపోయే విధంగా గ్రాబర్ పాకెట్స్‌ని అడ్జస్ట్ చేసుకునేలా డిజైన్ చేసి ఉంది. అయితే దుస్తులు ధరించని చిన్నారుల పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్న చాలామంది మదిలో ఉండొచ్చు. ఆ సమస్యకూ హేమంత్ రాజ దగ్గర పరిష్కారం ఉంది. ఆ మిషనరీ ఎక్విప్‌మెంట్‌తో పాటు లాంగ్ స్టడ్ బార్ సహాయంతో 'సేవింగ్ హ్యాండ్' అనే స్పెషల్ టూల్ ప్రత్యేకంగా తయారుచేశారు. అది చిన్నారి కాళ్ల కింద భాగానికి చేరుకొని, దాని స్ప్రింగ్ లోడును రిలీజ్ చేసిన వెంటనే ఆరు లివర్స్ ఒక చెయ్యిలాగా వస్తాయి. అవి చిన్నారిని తన మీదకు తీసుకొని, సురక్షితంగా పైకి చేరుస్తుంది. ఈ మిషన్ ఎలక్ట్రికల్ రిమోట్ కంట్రోల్ గేర్ వించ్ ద్వారా బోరుబావి ఎంత లోతులో ఉన్నా ఈ మిషన్‌ను లోపలికి పంపవచ్చు. అంతేకాకుండా చిన్నారి మాటలను పైకి వినిపించే విధంగా, పైనుంచి మాట్లాడే మాటలను కిందకు చేరేలా మైక్, స్పీకర్స్‌ని కూడా అమర్చి ఉంటారు. కేవలం 20 నిమిషాల్లోనే 'బ్రెస్‌మీ' మిషన్ ద్వారా చిన్నారిని సురక్షితంగా పైకి తీసుకురావచ్చు.

తీరని కష్టాలున్నా..

'మాది రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం. నాన్న అప్పారావు టైలర్. అమ్మ అమ్మాజి. చోడవరం సొంతూరు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా చిన్న వయస్సులోనే గాజువాక "హిందుస్థాన్ షిప్‌యార్డ్"లో ఉద్యోగంలో చేరా. అక్కడ షిప్పులు రిపేరు చేసేవాడిని. కొంతకాలం తర్వాత బెహరైన్, దుబాయ్‌లో మెకానికల్ సూపర్‌వైజర్‌గా పనిచేశా. అక్కడే మెరైన్ (షిప్ రిపేరుకు సంబంధించిన కోర్సుల్లో) లో మూడు సంవత్సరాలు శిక్షణ తీసుకున్నా. అక్కడి నుంచి ఆస్ట్రేలియా వెళ్లడం కోసం అప్పటివరకు సంపాదించిన ఆరు లక్షల రూపాయలను వీసా కోసం ఖర్చుచేశా. అప్పుడే ఆర్థికమాంద్యం రావడంతో వీసా ఆగిపోయింది. కట్టుబట్టలతో ఇండియాకు తిరిగి వచ్చా. 'హైటెక్ మెరైన్' కంపెనీని గాజువాకలో మొదలెట్టాను. ఆ సమయంలోనే కొందరి పరిచయం నన్ను మరింత కష్టాల్లోకి నెట్టేసింది.



కలిసి వ్యాపారం చేద్దామన్నారు. వారిని సులువుగా నమ్మేసా. అమ్మ, అక్క, నా భార్య బంగారాలను తాకట్టు పెట్టి మరీ పెట్టుబడి పెట్టా. వ్యాపారంలో మోసం చేశారు. మళ్లీ ఇంకా అప్పుల ఊబిలో కూరుకుపోయా. అదే సమయంలో బాబు అనారోగ్యంతో పుట్టాడు. దాదాపు నెలరోజులు హాస్పిటల్‌లోనే ఉన్నాం. అలా ఇబ్బందులు పడుతున్నప్పుడే నా స్నేహితుడొకడు తన కంపెనీలో ఉద్యోగం ఇప్పించాడు. ఆ కంపెనీ తరపునే షిప్‌ల రిపేరుకు విదేశాలకు వెళ్లేవాడిని. అలా సంపాదించుకున్న డబ్బునే ఈ ప్రాజెక్టుకు ఉపయోగించా. షిప్‌ల రిపేరుపై మంచి పట్టుండటంతో ఈ ప్రాజెక్టును ఇద్దరు, ముగ్గురు సహాయంతో పూర్తిచేయగలిగా. దీనికిగాను ఆరు లక్షల రూపాయలు నా సొంత డబ్బునే వినియోగించా. చిన్నచిన్న ఆర్థికసాయం నలుగురు స్నేహితులు చేశారు. ఈ మధ్యే 'బ్రెస్‌మీ'కి సంబంధించిన డెమోను విజయవాడ డిజి ఆఫీస్‌లో ఇచ్చా. దానికి మా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌గారి చొరవ ఎంతో ఉంది' అంటున్నాడు హేమంత్.

కానీ ఇలాంటి వాళ్లను ప్రోత్సహిస్తే ఎన్నో అత్యవసరమైన టెక్నాలజీ తయారీ వెలుగు చూస్తుందన్నది వాస్తవం. ఆ దిశగా ప్రభుత్వం హేమంత్‌కు సహకరించాలని కోరదాం.

- స్వర్ణలత నూకరాజు



ప్రతి ఫైర్‌స్టేషన్లో ఉండాలి!

బ్రెస్‌మీ ప్రతి ఫైర్ స్టేషన్‌లో ఉండాలనేది నా కోరిక. ఎక్కడైనా సంఘటన జరిగితే అర్ధగంటలో సంఘటనా స్థలానికి వెళ్లేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ఎన్‌డిఆర్‌ఎఫ్ క్యాంపులు అన్నిచోట్లా ఇవి ఉండాలి. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తే త్వరలో వాటర్‌ప్రూఫ్ మిషన్‌ను కూడా తయారుచేస్తా.

- హేమంత్ రాజా
9640124067

ఊరిని మార్చాలని..



గతంతో పోలిస్తే నేటి యువతలో సమాజం పట్ల బాధ్యత పెరిగింది. ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఏదో ఒకటి చేయాలని సంకల్పిస్తున్నారు. చదువు ద్వారానే పేదరికాన్ని కొంతవరకైనా పోగొట్టవచ్చని ఆలోచించాడతను. పేద బాలబాలికల కోసం ముప్ఫై సంవత్సరాల యోగేష్ గుప్తా తన సొంత డబ్బుతోనే కార్పొరేట్ పాఠశాలకు ధీటైన బడిని తెరిచాడు. అసలు ఈ ఆలోచన అతనికి ఎలా వచ్చిందో తెలుసుకుందాం.

యోగేష్‌ది హర్యాణాలోని పానిపట్ గ్రామం. నిజానికి వాళ్లింట్లో అందరూ వారసత్వంగా వచ్చిన వ్యాపారాన్నే నడుపుకుంటున్నారు. కానీ యోగేష్ మాత్రం దానికి భిన్నంగా ఆలోచించాడు. ఒకవైపు వ్యాపారాన్ని చేస్తూ మరోవైపు చదువును కొనసాగించి, ఎంఏ పొలిటికల్ సైన్స్ చేయగలిగాడు. 'చదువు ఎప్పుడూ తల్లిదండ్రుల ఒత్తిడితో చదవకూడదు. పిల్లలు ఇష్టంగా చదువుకోవాలి అనేది అతని సిద్ధాంతం'. కొందరిలా అతను ఈ సమాజం ఏమైతే నాకేంటి? అనుకోలేదు. తనవంతుగా ఏదో ఒకటి చేయాలనుకున్నాడు. చదువు పూర్తయిన వెంటనే పానిపట్‌లో తన స్నేహితుడు పనిచేస్తున్న స్కూలుకు వెళ్లాడు యోగేష్. అక్కడ 6,7 తరగతుల పిల్లలతో మాట్లాడుతుండగా కొన్ని నిజాలు తెలిశాయి. పిల్లలు కనీసం వాళ్ల పేర్లకు స్పెల్లింగులు కూడా సరిగా రాయలేని పరిస్థితి. అంతేకాదు లెక్కల్లో చిన్నచిన్న సమస్యలను సైతం చేయలేక చేతులెత్తేస్తున్నారు. అది చూసిన అతనికి విద్యావ్యవస్థ మీద పట్టరాని కోపం వచ్చింది. వెంటనే అక్కడి ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగాడు.



మిగతా పాఠశాలలు ఎలా ఉన్నాయో? చూడాలనే ఉద్దేశంతో కొన్ని రోజుల తర్వాత మరొక పాఠశాలను సందర్శించిన యోగేష్‌కు మరికొన్ని చేదు నిజాలు తెలిశాయి. ఆ పాఠశాలలో ఉన్న అరకొర విద్యార్థులలో ఒకరిద్దరే అమ్మాయిలు ఉన్నారనే విషయాన్ని గుర్తించాడతను. ఇంకా అక్కడి స్కూళ్ళల్లో కనీస సౌకర్యాలు కూడా లేవు. ఇదంతా అతనిని చాలా బాధించింది. ఏదేమైనా ఆ ఊరిలో మార్పు తీసుకురావాలి అనుకున్నాడు. బాలికా విద్యను ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నాడు.

నిజానికి యోగేష్ కూడా ఒక గవర్నమెంట్ పాఠశాల విద్యార్థే. అప్పట్లో అబ్బాయిల కంటే అమ్మాయిలే తరగతిగదిలో ఎక్కువగా కనిపించేవారు. గతంలో తన స్నేహితుడు తమ ఊరిలోని స్కూళ్ల గురించి చెప్పాడుగానీ ఇంత ఘోరంగా ఉంటుందని ఊహించలేదు. అతనే ఒక స్కూల్ పెట్టాలనే నిర్ణయానికి వచ్చాడు. అందుకోసం ఎప్పుడూ స్కూల్‌కు వెళ్లని పిల్లలను, గవర్నమెంట్ స్కూల్లో పేర్లు ఉండి స్కూలుకు వెళ్లని పిల్లల మీద దృష్టిని ఉంచాడు.

మరి స్కూల్‌ను ఎక్కడ పెట్టాలి అనే ఆలోచన మొదలైంది. పానిపట్‌లోని సంజయ్ చౌక్ ప్రాంతంలో ఉన్న ఒక గుడిని కేంద్రంగా ఎంచుకున్నాడు. దానికి కారణం లేకపోలేదు. ఆ గుడి ఆ ఏరియాలో బాగా ఫేమస్ కాబట్టి ఎవరైనా సరే సులభంగా చిరునామాను కనుక్కోగలరు.

ప్రస్తుతం యోగేష్ తన సొంత డబ్బుతోనే 25 మంది విద్యార్థులతో పాఠశాలను నడుపుతున్నాడు. అతని భార్య మాయాగుప్తా, చెల్లి నైనాగుప్తా ఆ స్కూలోనే వాలెంటరీలుగా పనిచేస్తున్నారు. చదువుతోపాటు చిత్రకళనూ నేర్పుతున్నారు. పాఠశాలను యోగేష్ తన నాల్గవ పెళ్లిరోజు సందర్భంగా డిసెంబర్ 2, 2018న ప్రారంభించాడు. ఈ పాఠశాలలో మరికొంత మంది యువత స్వచ్ఛందంగా వాలంటీర్లుగా రావాలని అతను కోరుకుంటున్నాడు.



చిన్నారి

పొడుపు కథ

వానకు, ఎండకు ఉపయోగ పడతాను. అవసరం లేదంటే ముడుచుకు పోతాను. ఎవరిని నేను?



జవాబు : గొడుగు

జోక్:

టీచర్ : నువ్వు వేసుకున్న సాక్సులు చిత్రంగా ఉన్నాయిరా, ఒకటి ఎరుపుది, మరొకటి బ్లూది

బంటు : అవును టీచర్.. నాకు ఇలాంటివే ఇంట్లో మరొక జత సాక్సులు కూడా ఉన్నాయి.

చుక్కలు కలపండి!

పిల్లలూ! పక్కనున్న చిత్రంలోని చుక్కల్ని కలిపి.. బొమ్మను పూర్తి చేయండి!!



అడవులు

అందమైన అడవులు
పచ్చపచ్చని అడవులు

ఆహారాన్నిచ్చే అడవులు
నివాసాన్నిచ్చే అడవులు

ఉపాధినిచ్చే అడవులు
ఉపకారం చేసే అడవులు

వర్షాన్నిచ్చే అడవులు
జీవనాధారాన్నిచ్చే అడవులు





రాకేష్
5వ తరగతి.
మండల పరిషత్
ప్రాథమిక పాఠశాల మెయిన్,
గుడేకల్, ఎమ్మిగనూరు మండలం,
కర్నూలు జిల్లా.

దారి కనుక్కోండి!



పిల్లలూ! ఈ కుక్క పిల్లకు తన తల్లిని చేరే దారి తెలియడం లేదు. దారి కనుక్కోండి మరి!

నేను గీసిన బొమ్మ



ఎం. ప్రవీణ్ కుమార్ నాయక్
6వ తరగతి
ఎ.పి.టి.డబ్ల్యు.ఆర్ బాయ్స్ స్కూల్,
టి. సుండుపల్లి,
వై.ఎస్.ఆర్ కడప.



పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవల్సిన మాచిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com



రోహిత్
133 పరుగులు

రోహిత్ శతకం వృథా!

టెస్టు సిరీస్ గెలుపుతో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్ ఆసీస్ బౌలర్ల దాటికి బోల్తా పడింది. 289 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కోహ్లీసేన నాలుగు పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లోకి వెళ్లింది. ఆ తర్వాత హిట్‌మన్ రోహిత్ సెంచరీ, సీనియర్ వికెట్ కీపర్ ధోనీ అర్ధసెంచరీతో ఆదుకునే ప్రయత్నం చేసినా మిడిలార్డర్ వైఫల్యం కారణంగా ఆసీస్ చేతిలో 34 పరుగుల తేడాతో టీమిండియా పరాజయం పాలైంది.

తొలివన్డేలో ఆసీస్ ఆల్‌రౌండ్ ప్రదర్శన

34 పరుగుల తేడాతో భారత్ ఓటమి

సిడ్నీ : సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరిగిన తొలివన్డేలో భారత్ 34 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. మూడో ఓవర్లోనే ఆసీస్ సారథి ఆరోన్ ఫించ్(6)ను భువి పెవిలియన్ చేర్చాడు. అయినా భారత బౌలర్లకు పరీక్ష పెడుతూ బౌండరీలతో పరుగులు పెట్టించిన హాండ్స్‌కాంబ్(73) ఉస్మాన్ ఖవాజా(59), మార్ష్(54)లు అర్ధ శతకాలతో రాణించడంతో భారత్ ముందు 289 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. భువనేశ్వర్‌కు, కుల్దీప్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

అనంతరం 289 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా కేవలం నాలుగు పరుగులకే ధావన్, కోహ్లీ, రాయుడు వికెట్లను కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అనంతరం చాలాకాలం తర్వాత వన్డేల్లో చోటు దక్కించుకున్న ధోని తొలుత ఆసీస్ బౌలర్లను ఆచితూచి ఆడుతూ రోహిత్‌కు తోడుగా నాల్గో వికెట్‌కు 137 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించాడు. ఈ క్రమంలో ధోనీ వన్డేల్లో అర్ధసెంచరీని పూర్తి చేశాడు. చివరకు 51 పరుగుల వ్యక్తిగత స్కోర్‌వద్ద బెహ్రెన్‌డోర్ఫ్ చేతిలో ఎల్‌బిడబ్ల్యుగా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన దినేష్ కార్తీక్ సాయంతో రోహిత్ శర్మ వన్డేల్లో 22వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. సెంచరీ పూర్తయిన అనంతరం రోహిత్ ఎడాపెడా షాట్లు కొడుతూ స్కోర్‌బోర్డును పరుగెత్తించాడు. కానీ 133 పరుగుల వ్యక్తిగత స్కోర్‌వద్ద స్టోనిస్ బౌలింగ్‌లో మ్యాక్స్‌వెల్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరడంతో భారత్ పరాజయం ఖాయమైంది. చివర్లో కార్తీక్, జడేజా స్వల్ప స్కోర్లకే పెవిలియన్‌కు చేరారు. దీంతో టీమిండియా నిర్ణీత ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 254 పరుగులు మాత్రమే చేయగలిగింది. చివరకు భారతజట్టు 34 పరుగుల తేడాతో ఆసీస్ చేతిలో ఓడి మూడు వన్డేల సిరీస్‌లో 0–1తో వెనుకబడింది.

ఈ విజయంతో ఆస్ట్రేలియా జట్టు అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మెట్‌లలో కలిపి 1000వ విజయాన్ని నమోదు చేసుకున్నట్లయ్యింది. రిచర్డ్‌సన్‌కు నాలుగు, స్టోనిస్, బెహ్రన్‌డ్రాప్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రిచర్డుసన్‌కు లభించింది.



10వేల పరుగుల జాబితాలో ధోని

టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని తన కెరీర్‌లో మరో మైలురాయిని అందుకున్నాడు. భారత్ తరపున అంతర్జాతీయ వన్డేల్లో పదివేల పరుగుల మార్కును ధోనీ పూర్తిచేశాడు. ఫలితంగా ఈ ఘనత సాధించిన భారతజట్టు ఐదో బ్యాట్స్‌మన్‌గా ధోని గుర్తింపు పొందాడు. ఇప్పటి వరకూ భారత్ తరపున సచిన్, గంగూలీ, ద్రావిడ్, విరాట్ కోహ్లీ సరసన ధోనీ చేరాడు. సిడ్నీ వేదికగా జరిగిన తొలి వన్డేలో వ్యక్తిగత స్కోర్ ఒక పరుగు వద్ద ధోనీ ఈ ఫీట్‌ను అందుకున్నాడు.

నాలుగు పరుగులకే మూడు వికెట్లు

తొలి వన్డేలో భారత్ నాలుగు పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి చెత్త రికార్డునూ నమోదుచేసింది. ఓపెనర్ ధావన్, రాయుడు డకౌట్ కాగా, కోహ్లీ(3) పరుగులు మాత్రమే చేసి పెవీలియన్‌కు చేరాడు. ఫలితంగా కోహ్లీ సేన నాలుగు పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయింది. ఇలా 2004లోనూ జింబాబ్వే చేతిలో ఆడిలైడ్ వేదికపై నాలుగు పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయిన రికార్డుకు సమం చేసింది. 2005లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఐదు పరుగులకు, 1983లో జింబాబ్వే చేతిలో ఆరు పరుగులకే భారత్ తొలి మూడు వికెట్లు కోల్పోయిన చెత్త రికార్డు ఉంది.

ఆసీస్‌కు 1000వ విజయం

ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు అరుదైన మైలురాయిని అందుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆసీస్ 1000వ విజయాన్ని నమోదు చేసి సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. భారత్‌తో సిడ్నీ మైదానంలో జరిగిన తొలి వన్డేలో ఆసీస్ గెలవడం ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో 1000వ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఫలితంగా క్రికెట్ చరిత్రలో ఈ మార్కును చేరిన తొలి జట్టుగా ఆసీస్ నిలిచింది. టెస్టుల్లో 384, వన్డేల్లో 558, టీ20ల్లో 58 విజయాలను కంగారు జట్టు అందుకుంది. 1877లో మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా తొలి విజయాన్ని సాధించిన ఆసీస్ తన విజయ ప్రస్థానంలో ఎవ్వరికీ అందనంత దూరంలో నిలిచింది.



అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక విజయాలు సాధించిన జట్లలో ఇంగ్లాండ్ 774, భారత్ 711 విజయాలతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.

స్కోర్ బోర్డు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ : అలెక్స్ క్యారీ (సి)రోహిత్, (బి) కుల్దీప్ 24, ఫించ్(బి)భువనేశ్వర్ 6, ఖవాజా (ఎల్‌బి) జడేజా 59, మార్ష్ (సి)షమి (బి)కుల్దీప్ 54, హ్యాండ్‌కోంబ్ (సి) ధావన్ (బి) భువనేశ్వర్ 73, స్టోనిస్ (నాటౌట్) 47, మ్యాక్‌వెల్ (నాటౌట్) 11, అదనం 14. (మొత్తం 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 288 పరుగులు)

బౌలింగ్ : భువనేశ్వర్ 10–0–66–2, ఖలీల్ అహ్మద్ 8–0–55–0, షమి 10–0–46–0, కుల్దీప్ 10–0–54–2, జ డేజా 10–0–48–1, రాయుడు 2–0–13–0.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) స్టోనిస్ 133, ధావన్ (బి) బెహ్రెన్‌డోర్ఫ్ (ఎల్‌బి) 0, కోహ్లీ (సి)స్టోనీస్ (బి) రిచర్డ్‌సన్ 3, రాయుడు (ఎల్‌బి) రిచర్డ్‌సన్ 0, ధోనీ (ఎల్‌బి) బెహ్రెన్‌డోర్ఫ్ 51, దినేష్ కార్తీక్ (బి) రిచర్డ్‌సన్ 12, జడేజా (సి) మార్ష్ (బి) రిచర్డ్‌సన్ 8, కుల్దీప్ (సి) ఖావాజా (బి) సిడెల్ 3, షమి (సి) మ్యాక్స్‌వెల్ (సి)స్టోనిస్ 1, భువనేశ్వర్ (నాటౌట్) 29, అదనం 14 (మొత్తం 50 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 254 పరుగులు)

బౌలింగ్ : బెహ్రెన్‌డోర్ఫ్ 10–2–39–2, రిచర్డ్‌సన్ 10–2–26–4, సిడెల్ 8–0–48–1, లియాన్ 10–1–50–0, స్టోనిస్ 10–0–66–2, మ్యాక్స్‌వెల్ 2–0–18–0.



సెపక్‌తక్రా ఫైనల్లో ఆంధ్ర

(ప్రజాశక్తి స్పోర్ట్స్ డెస్క్)

రాష్ట్ర స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో విజయవాడలోని గాంధీనగర్, ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్లో జరుగుతున్న 64వ జాతీయ అండర్–17 బాలబాలికల సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీలు ఫైనల్ దశకు చేరుకున్నాయి. బాలుర విభాగంలో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా జట్లు, బాలికల విభాగంలో ఒరిస్సా, మహారాష్ట్ర జట్లు ఫైనల్స్‌కు చేరాయి. శనివారం జరిగిన సెమీఫైనల్స్ బాలుర విభాగం పోటీలో ఆంధ్రప్రదేశ్ 21–9, 21–11 పాయింట్ల తేడాతో మహారాష్ట్రపై, ఒరిస్సా జట్టు 21–15, 21–18 పాయింట్ల తేడాతో తెలంగాణపై గెలిచాయి. బాలికల విభాగంలో ఒరిస్సా 21–16, 21–16 తేడాతో ఢిల్లీపై, మహారాష్ట్ర జట్టు 13–21, 21–14, 21–15 తేడాతో తెలంగాణపై విజయం సాధించాయి. ఆదివారం ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

దక్షిణాఫ్రికాకు ఆధిక్యత

జోహెన్స్‌బర్గ్ : పాకిస్తాన్‌తో జరుగుతున్న మూడో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా జట్టుకు 77 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. శనివారం పాకిస్తాన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు పరిమితమైంది. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా జట్టు 262 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్ జట్టులో సర్ఫరాజ్ అహ్మద్ 50, బాబర్ అజామ్ 49 పరుగులతో రాణించారు. ఓలీవర్‌కు ఐదు, ఫిలాండర్‌కు మూడు, రబాడాకు రెండు వికెట్లు లభించాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సఫారీ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. ఆమ్లా 42, డికాక్ 34 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. దీంతో ఆతిథ్య జట్టుకు పాకిస్తాన్‌పై ఇప్పటికే 212 పరుగుల ఆధిక్యత లభించినట్లైంది. అష్రఫ్‌కు రెండు, అమీర్, అబ్బాస్, షాదాబ్‌కు తలా ఒక వికెట్ దక్కాయి.

ప్రి క్వార్టర్స్‌కు ఇరాన్

ఆసియాకప్ ఫుట్‌బాల్ టోర్నీ



అబుదాబి : ఆసియాకప్(ఎఎఫ్‌సి) ఫుట్‌బాల్ టోర్నీ నాకౌట్‌లోకి ఇరాన్ జట్టు ప్రవేశించింది. శనివారం వియత్నాం జట్టును 2–0 గోల్స్ తేడాతో ఓడించింది. ఇరాన్ తరపున సర్దార్ అజ్‌మౌన్ రెండు గోల్స్ చేసి ఆ జట్టును ప్రీ క్వార్టర్స్‌కు చేర్చాడు. దీంతో ఆ జట్టు 43 ఏళ్ల తర్వాత టైటిల్ వేటలో నిలిచినట్లైంది. మరోమ్యాచ్‌లో ఇరాక్ 3–0తో యెమెన్‌పై గెలిచింది. భారత ఫుట్‌బాల్ జట్టు ఆఖరి లీగ్‌మ్యాచ్‌ను బహ్రెయిన్‌తో సోమవారం తలపడనుంది. ఈ మ్యాచ్‌ను కనీసం డ్రా చేసుకున్నా భారతజట్టు నాకౌట్‌కు చేరడం ఖాయం.

సెమీస్‌లో హంటర్స్‌కు షాక్

ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ ఫైనల్లో ముంబయి


సమీర్ వర్మ


బెంగళూరు : ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ ఫైనల్లోకి ముంబయి రాకెట్స్ జట్టు ప్రవేశించింది. శనివారం జరిగిన రెండో సెమీఫైనల్ పోటీలో హైదరాబాద్ హంటర్స్ జట్టు 2–4 తేడాతో అనూహ్యంగా ముంబయి చేతిలో ఓడింది. హైదరాబాద్ ట్రంప్ మ్యాచ్‌గా తీసుకున్న మహిళల సింగిల్స్ పోటీలో పివి సింధు 15–6, 15–5 పాయింట్ల తేడాతో పరదేశీ(ముంబయి)పై మాత్రమే గెలవగా, మిగతా మ్యాచుల్లో హంటర్స్ ఓడింది. పురుషుల డబుల్స్‌లో జంగ్–డియో (ముంబయి) 15–14, 15–12తో ఇసరా–రంగ్(హంటర్స్) జోడీపై గెలిచి 1–0 ఆధిక్యతను సంపాదించింది. ముంబయి ట్రంప్ మ్యాచ్‌లో సమీర్‌వర్మ 15–8, 15–7తో కల్జో(హంటర్స్)పై గెలిచి 3–0 ఆధిక్యతలోకి తీసుకెళ్లాడు. ఆ తర్వాత మహిళల సింగిల్స్‌లో సింధు గెలిచి 2–3కు ఆధిక్యతను తగ్గించగల్గింది. పురుషుల సింగిల్స్ రెండో మ్యాచ్‌లో అంటోన్సెన్(ముంబయి) 15–13, 15–6 పాయింట్ల తేడాతో హుయాన్(హంటర్స్)పై గెలుపొందడంతో ముంబయి 4–2తో ఫైనల్‌కు చేరింది. ఆదివారం జరిగే ఫైనల్లో ముంబయి రాకెట్స్ జట్టు బెంగళూరు ర్యాప్టర్స్ జట్టుతో టైటిల్‌కై తలపడనుంది.

యోగి.. ఎన్‌కౌంటర్ రాజ్

- రెండేళ్లలో 1,038 పోలీసు ఎన్‌కౌంటర్లు.. 32మంది హత్య
- యూపీలో రక్తపాతంపై యూఎన్ తీవ్ర ఆందోళన
- దర్యాప్తులో 'సుప్రీం' మార్గదర్శకాలు బేఖాతర్

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లో యోగి హయాంలో.. ఎన్‌కౌంటర్ల పాలన సాగుతోంది. గో అక్రమ రవాణా పేరిట జరిగే మూకదాడులకు తోడు.. పోలీసుల నకిలీ ఎన్‌కౌంటర్ హత్యలతో రాష్ట్రం నెత్తురోడుతున్నది. 2017లో రాష్ట్ర సీఎంగా యోగి ఆదిత్యానాథ్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆరునెలల్లో 420 ఎన్‌కౌంటర్లు జరగ్గా.. అందులో 15మంది మరణించారు. 2018కల్లా యూపీ పోలీసులు 1,038 ఎన్‌కౌంటర్లు చేపట్టగా.. అందులో 32 మంది అసువులుబాశారు. గతేడాది రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్ హత్యలపై ఓ జాతీయ వార్తాసంస్థ దర్యాప్తు చేయగా.. దాదాపు 14 బాధిత కుటుంబాలు ఈ హత్యలు ముందస్తు ప్రణాళికతో జరిగినవేనని ఆరోపించడం గమనార్హం.

కాగా, ఈ ఎన్‌కౌంటర్ హత్యలపై ఐక్యరాజ్య సమితి(ఐరాస) హక్కుల విభాగం తీవ్ర ఆందోళనను వ్యక్త పరిచింది. ఈ ఘటనలపై హెచ్చరికగా భారత ప్రభుత్వానికి ఒక లేఖ రాసింది. ఇందులో యూపీ పోలీసులు 'చట్టాన్ని అతిక్రమించి' హత్య చేసిన



15 కేసులను ఆఫీస్ ఆఫ్ ద హైకమిషనర్ ఫర్ యునైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్(ఓహెచ్‌సీహెచ్‌ఆర్) ఉటంకించింది. దీంతోపాటు నకిలీ ఎన్‌కౌంటర్‌గా అనుమానిస్తున్న 59 కేసులనూ పేర్కొంది. ఓహెచ్‌సీహెచ్‌ఆర్ లేవనెత్తిన కేసుల్లో అత్యధికంగా ముస్లిం బాధితులకు సంబంధించినవే ఉండటం గమనార్హం. ఈ దారుణ అకృత్యాలు జరుగుతున్న తీరుపైనా సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. 'ఒక్కొక్కరిని అపహరించి లేదా అరెస్టు చేసి తర్వాత హత్య చేస్తున్నారు. వారిని చిత్రహింసలు పెట్టి చంపేశారని సూచించేలా ఆ మృతదేహాలపై తీవ్ర గాయాలుంటున్నాయ'ని యూఎన్ నిపుణులు గుర్తించారు.

మణిపూర్‌లో ఎన్‌కౌంటర్ హత్యలు, వాటి దర్యాప్తును సుప్రీంకోర్టు గడువులో ముగించడంలో ప్రభుత్వం విఫలమవడంపై ఆరునెలల క్రితం ఓహెచ్‌సీహెచ్‌ఆర్ భారత ప్రభుత్వానికి లేఖ రాశారు. ఉద్దేశపూర్వకంగా దర్యాప్తులో జాప్యం చోటుచేసుకుంటున్నట్టు తెలుస్తున్నదని, దీన్ని ఖండిస్తున్నామని అందులో పేర్కొంది. అయితే ఆ లేఖకు ఇప్పటివరకూ సమాధానం లేదని తెలిపింది. ఎన్‌కౌంటర్ హత్యలకు.. ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారని, ఎన్‌కౌంటర్‌లో మరణించారని సాధారణంగా పోలీసులు వివరణలు ఇస్తుంటారని, అయితే చాలా వరకు లాకప్ డెత్‌లే జరిగినట్టుగా లభించిన ఎవిడెన్స్‌లతో తేలుతున్నదని సంస్థ వివరించింది. హత్యకు ముందు కుటుంబ సభ్యుల నుంచి పోలీసులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, కుటుంబీకులు, మానవ హక్కుల కార్యకర్తల ప్రాణరక్షణపైనా ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ హత్యలపై వెంటనే సమగ్ర విచారణ జరపాలని సూచించింది.

మోడీ సర్కారుకు పట్టని 'సుప్రీం' మార్గదర్శకాలు :

ఎన్‌కౌంటర్ హత్యల దర్యాప్తును సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా భారత ప్రభుత్వం చేపట్టడం లేదని 2014లో పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ వర్సెస్ మహారాష్ట్ర స్టేట్ కేసును ఉటంకిస్తూ ఓహెచ్‌సీహెచ్‌ఆర్ పేర్కొంది. ఈ హత్యల గురించి వెంటనే బాధిత కుటుంబీకులకు తెలుపాలని, పోస్టుమార్టం నివేదికను అందజేయాలని, స్వతంత్ర దర్యాప్తు సంస్థలకు కేసును బదిలీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ మార్గదర్శకాలూ అమలు కావడం లేదని తాజాగా సంస్థ వివరించింది.



సుప్రీం న్యాయమూర్తులుగా జస్టిస్ దినేశ్ మహేశ్వరి, సంజీవ్ ఖన్నా

సిఫారసు చేసిన కొలీజియం

న్యూఢిల్లీ : కర్నాటక హైకోర్టు చీఫ్ జస్టిస్ దినేశ్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు జడ్జి సంజీవ్‌ఖన్నాలను సుప్రీంకోర్టు జడ్జిలుగా నియమించాల్సిందిగా కొలీజియం సిఫారసు చేసింది. చీఫ్ జస్టిస్ రంజన్‌గొగోయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం వీరిద్దరికీ పదోన్నతులు కల్పించాల్సిందిగా కేంద్ర న్యాయశాఖకు ప్రతిపాదించింది. వీరిలో జస్టిస్ దినేశ్ మహేశ్వరిపై సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ చలమేశ్వర్ తీవ్ర ఆరోపణలు చేయడం గమనార్హం. కర్నాటకలోని ఓ జిల్లా జడ్జిపై లైంగిక వేధింపుల ఆరోపణలు రాగా, జస్టిస్ దినేశ్ మహేశ్వరి ఆయనపై దర్యాప్తునకు ఆదేశించడాన్ని జస్టిస్ చలమేశ్వర్ తప్పు పట్టారు. ఆ జిల్లా జడ్జిని హైకోర్టు జడ్జిగా రెండుసార్లు సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన నేపథ్యంలో జస్టిస్ చలమేశ్వర్ చొరవ తీసుకున్నారు. ఆ జిల్లా జడ్జిపై సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు జరిగిన దర్యాప్తులో ఆరోపణల్లో నిజం లేదని తేలడం గమనార్హం. కార్యనిర్వాహక వ్యవస్థ ప్రభావంతో జడ్జిలు వ్యవహరించకూడదంటూ జస్టిస్ చలమేశ్వర్ ఆ సందర్భంగా సూచించారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత కోసం గళం విప్పిన వారిలో జస్టిస్ చలమేశ్వర్ కీలక వ్యక్తి అన్నది తెలిసిందే.

కొలీజియం సిఫారసు చేసినవారిలో మరొకరైన జస్టిస్ సంజీవ్‌ఖన్నా జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నాకు సోదరుడు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నపుడు కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గని న్యాయమూర్తిగా హెచ్‌ఆర్ ఖన్నాకు పేరున్నది. దేశంలో అత్యవసర పరిస్థితి విధించినపుడు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో మెజారిటీ తీర్పును వ్యతిరేకిస్తూ పౌరహక్కులకు అనుకూలంగా ఒంటరిగా అసమ్మతి తీర్పును వెల్లడించిన ఘనత హెచ్‌ఆర్ ఖన్నాకున్నది. ఆ తర్వాత సీనియారిటీ ప్రకారం రావాల్సిన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పదవి హెచ్‌ఆర్ ఖన్నాకు రాకుండా ఇందిరాగాంధీ తన అధికారాన్ని ఉపయోగించారన్న విమర్శలున్నాయి.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68